ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక


REGD. No. M4479

4 అణాలు

28-11-'51



ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



రష్యాలోని ఆరోగ్యపరిశోధనా కేంద్రంలో ఇద్దరు పరిశోధకులు నరాల చైతన్యాన్ని
పరీక్షించే యంత్రంవద్ద ఉన్న దృశ్యం.


ఆంధ్ర దేశమంతటా
విజయవంతముగా నడచుచున్న
అద్భుత తెలుగు చిత్రం
ఎనెస్కె వారి
పెళ్ళికూతురు
చమ్రియా రిలీజ్
డైరెక్టర్
N.S. కృష్ణన్

విషయానుక్రమణిక 1951 నవంబరు 28

40-వ పేజీలో చిత్రం: బి. ఎస్. సరోజ.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిపత్రిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును
Founder : K. NAGESWARA RAO

సంపుటము 44
సంచిక 13
28-11-51

ఖర సంవత్సర కార్తీక బహుళ చతుర్దశి బుధవారము

రాజకీయాలు :

ఎన్నికలు : అభ్యర్థులు

ఇప్పటివరకూ వచ్చిన వార్తల్నిబట్టి, జనవరిలో జరగబోతున్న ఎన్నికలలో మొత్తం 2670 మంది అభ్యర్థులు చెన్నరాష్ట్రంలో పోటీకి నామినేషను దాఖలు చేశారు. వీనిలో 62 పార్లమెంటరీ నియోజకవర్గాలలోనూ 75 స్థానాలకు ఇప్పటికి 394 మంది నామినేషన్లు వచ్చాయి. 309 రాష్ట్రనియోజక వర్గాలలోనూ 350 స్థానాలకు ఇప్పటికి 2276 నామినేషన్లు వచ్చాయి.

పార్లమెంటుకి సభ్యత్వాలకు, రాష్ట్రశాసనసభల సభ్యత్వాలకు నామినేషను పంపినవారిలో అధికసంఖ్యాకులు ఏ పార్టీపైనా ఆధారపడకుండా స్వతంత్రంగా నిలుస్తున్న అభ్యర్థులే. పార్లమెంటులోని 75 స్థానాలకు 166 మంది స్వతంత్ర అభ్యర్థులు, 98 మంది కాంగ్రెస్ అభ్యర్థులు ఉన్నారు.

స్వతంత్ర అభ్యర్థులు కాక పార్లమెంటుకు 14 పార్టీలు, రాష్ట్రశాసనసభలకు 15 పార్టీలు పోటీచేస్తున్నాయి. వీనిలో ఆంధ్రదేశంలో పార్లమెంటుకు శాసనసభకు పదకొండు పార్టీలు మాత్రమే పోటీ చేస్తున్నాయి. ఆంధ్రదేశంలో పోటీచేస్తున్న పార్టీలు కాంగ్రెస్, కృషికార్ మజ్దూర్ ప్రజా పార్టీ (ప్రకాశంగారి కె. యం. పి.), కృషికార్ లోక్ పార్టీ (రంగాగారి కె. యల్. పి.), కమ్యూనిస్టుపార్టీ, సోషలిస్టుపార్టీ, షెడ్యూల్డ్ కాస్ట్స్ ఫెడరేషన్, బాక్వర్డ్ క్లాసెస్ లీగ్, జస్టిస్ పార్టీ, ఫార్వర్డ్ బ్లాక్, హిందూమహాసభ, రామరాజ్య పరిషత్తు.

ఇంతవరకూ తెలిసిన లెక్కల్నిబట్టి చెన్నరాష్ట్రంనుంచి పార్లమెంటు సభ్యత్వాలకు వచ్చిన నామినేషన్లు స్వతంత్ర అభ్యర్థులవి 166, కాంగ్రెస్ 98, కమ్యూనిస్టులు 29, ప్రజాపార్టీ 26, సోషలిస్టులు 26, కృషికార్ లోక్ పార్టీ 17, షెడ్యూల్డ్ కాస్ట్స్ ఫెడరేషన్ 84, ఫార్వర్డ్ బ్లాక్ 16, హిందూ మహాసభ 11 మిగిలినవి మిగిలినపార్టీలకు చెందినవి. రాష్ట్రశాసనసభ సభ్యత్వాలకువచ్చిన నామినేషన్లు స్వతంత్ర అభ్యర్థులవి 1074, కాంగ్రెసు 423, కమ్యూనిస్టులు 205, సోషలిస్టులు 193, ప్రజాపార్టీ 163, కృషికార్ లోక్ పార్టీ 55, షెడ్యూల్డ్ కాస్ట్స్ ఫెడరేషన్ 34, ఫార్వర్డ్ బ్లాక్ 16, హిందూమహాసభ 11. మిగిలినవి మిగతా పార్టీలవి.

నామినేషన్లలో కొన్ని నిరాకరించబడగలవనే భీతితో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ఒక్కొక్క స్థానానికి రెండేసి మూడేసి నామినేషన్లు వెయ్యడం కూడా కొన్నిచోట్ల జరిగింది. వీనిలో కొన్ని వరి

కీలన జరిగేరోజున (నవంబరు 28 వ తేదీని) నిరాకరించబడవచ్చును. కొన్ని డిసెంబరు 1 లోగా ఉపసంహరించుకోబడతాయి.

ఈమారు ఎన్నికల్లో నెల్లూరులో మినహా జస్టిస్ పార్టీవారు, నంద్యాలలో మినహా ముస్లింలీగ్ పార్టీవారు చాలచోట్ల స్వతంత్ర అభ్యర్థులుగా నిలబడుతున్నారు. సోషలిస్టు పార్టీ, ప్రజాపార్టీలు, రంగాగారి పార్టీలు పోటీచెయ్యకుండా ఒకరి అభ్యర్థుల్ని ఒకరు బలపరచాలని మొదట యత్నించారు కాని, ఆ పార్టీలమధ్య సమాధానం కుదరలేదు. అందువల్ల అక్కడక్కడ మాత్రం పోటీలు పెట్టుకోని కొన్ని నియోజకవర్గాలలో పరస్పరం సహాయం చెయ్యడానికి నిర్ణయించుకున్నారు. కమ్యూనిస్టుపార్టీ కాంగ్రెసేతర పార్టీ లన్నిటితోనూ (హిందూమహాసభ మొదలైన కొన్ని పార్టీలతో మినహా) సహకరించడానికి ప్రయత్నం చేసింది. కాని ఇంతవరకూ ఈ యత్నాలు కొనసాగలేదు. కాంగ్రెస్ అన్ని స్థానాలలోనూ పోటీ చేస్తోంది. స్వతంత్ర అభ్యర్థులతో కాని, ఇతరపార్టీలవారితో కాని ఎక్కడా పొత్తు కుదుర్చుకోడానికి ప్రయత్నం చెయ్యలేదు.

భారత ప్రధాని పండిట్ నెహ్రూ ఎన్నికలకు సంబంధించిన కొన్ని వివరాలను గురువారంనాడు రేడియోలో తెలుపుతూ వోటర్లకు వారి కర్తవ్యాన్ని బోధించారు. మొత్తం భారతరిపబ్లిక్ అంతా 3293 నియోజకవర్గాలుగా విభజించబడింది. ఇన్ని నియోజకవర్గాలనుంచీ పార్లమెంటులోని ప్రజాప్రతినిధి సభకు, రాష్ట్రప్రతినిధి సభకు, రాష్ట్రశాసనసభలకు రాష్ట్రాల లెజిస్లేటివ్ కౌన్సిల్సుకు మొత్తం 4,412 మంది ప్రతినిధులను ఎన్నుకోవాలి. ఎన్నవలసిన వోటర్లసంఖ్య మొత్తం 17 కోట్ల 66 లక్షలు. మొత్తం 2 లక్షల 24 వేల పోలింగ్ స్టేషన్లు నెలకొల్పబడుతున్నవి. అంటే దాదాపు 788 మంది వోటర్లకొక పోలింగ్ స్టేషన్ ఏర్పాటుచెయ్యబడుతున్నదన్నమాట.

ఈ ఎన్నికలు నిర్వహించడానికి దాదాపు 56 వేల మంది పోలింగ్ ఆఫీసర్లు,

మళ్ళా


★

"శరత్"

చేసుకో కొద్ది తిరుబాటు
ఆలోచించు ఒకమాటు
నీవు ఎక్కేది ఏబోటు?
ఎవరికిస్తావు నీ వోటు?

దాటగలవా కష్టాల జైలుగోటు
పడకముందే నిరాశ పాముకాటు
ఒకసారి చేసేవు పొరబాటు
తప్పించుకో శనిగ్రహపాటు
కావాలి ఎసెంబ్లీలో సీటు
అందుకుసోపానం నీ వోటు
తిరగవేస్తాడు తనకోటు
ప్రతినాయకుడూ ఈమాటు
ఒద్దుసుమా తొట్రుబాటు
తగదయ్యా ఏమరుపాటు
పడకుపడకు కునికిపాటు
బద్మాషులకా నీ వోటు?
చెడ్డవాళ్ళకిచ్చిన వోటు
చెల్లనికరెన్సీనోటు
మంచివాళ్ళకిస్తే సాపాటు
దొరుకుతుంది పదికాలాలపాటు
వోటుతో బాధల్నిదాటు
పోతుందిలే నీ చేటు
చేరుకోగలవు మంచిచోటు
పెరుగుతుంది సుఖాల రేటు
ఎడదవీణియల మీటు
ప్రగతి విత్తనాలు నాటు
ఈ సత్యం జగాన చాటు
అన్నిటికీ ఆద్యబ్రహ్మవోటు

కీ॥ శే॥ శ్రీ శిష్టా వెంకట్రావుగారు



21 వ తేదీ బుధవారం ఉదయం డండం విమానాశ్రయంవద్ద (కలకత్తా) సంభవించిన విమానప్రమాదంలో శ్రీ శిష్టా వెంకట్రావుగారు (బొంబాయి), అఖిలభారత పత్రికా సంపాదకుల సంఘాధ్యక్షుడు శ్రీ దేశబంధుగుప్త గార్లతో సహా మొత్తం 16 మంది హతులైనారు.

శిష్టా వెంకట్రావుగారు 1902 వ సంవత్సరం సెప్టెంబరు 2 న జన్మించారు. తండ్రి శంభుశాస్త్రిగారు. స్వగ్రామం తూ. గోదావరి జిల్లా అమలాపురం తాలూకా కేశనకుర్రు. దాదాపు 30 సంవత్సరాల క్రితం బొంబయి వెళ్ళారు. ముందు జి. ఐ. పి. లో టైపిస్టుగా చేరారు. తరువాత బొంబాయిలోనే కొంతకాలం అడ్వర్టయిజింగ్ కంపెనీలో పనిచేసి 1934లో అడ్వర్టయిజింగ్ కంపెనీ స్థాపించారు. తరువాత 1939 లో దీన్నే అడార్ట్స్‌గా మార్చారు. తరువాత సిష్టాస్, అనే అడ్వర్టయిజింగ్ కంపెనీని స్వంతంగా స్థాపించి ఈ సంస్థలను జయప్రదంగా నిర్వహిస్తూ వచ్చారు. బ్రిటన్‌లో జరిగిన పారిశ్రామిక ప్రదర్శనకు వెళ్ళివచ్చారు. అనేక ఆంధ్ర పారిశ్రామిక, వ్యాపార సంస్థల్లో డైరెక్టరుగా వుంటున్నారు. వీరు బొంబాయి ఆంధ్ర మహాసభ అధ్యక్షులుగా ఉన్నారు. బొంబాయిలోని ఆంధ్రులకు ఎంతో సహాయంగా వుంటూవున్నారు. వీరికిద్దరు కుమార్తెలు, నల్గురు కుమారులు వున్నారు. ★

2 లక్షల 80 వేలమంది గుమాస్తాలు, 2 లక్షల 24 వేలమంది పోలీసుల్ని నియమించవలసి వస్తుంది. కేంద్రప్రభుత్వమూ రాష్ట్రప్రభుత్వాలూ కలిసి మొత్తం దాదాపు 10 కోట్ల రూపాయలు వెచ్చించవలసి ఉంటుంది.

ఇదివరలో పార్టీలు కొద్దిగా ఉన్నందువల్ల బాలెట్ పెట్టెలకు రంగులు పురమాయించడంతో సరిపోయేది. కాని ఈమారు ఎన్నికలకోసం అనేక కొత్త పార్టీలు పుట్టినందువల్ల బొమ్మల నేర్పరచి నిరక్షరాస్యులైన వోటర్లకు పార్టీల వ్యత్యాసాలు తెలపవలసివస్తోంది.

వోటర్లు తమ ప్రతినిధుల నెన్నుకొని ప్రభుత్వాలను నిర్మింపచేయడానికీ, ముఖ్య పరిపాలనా సమస్యలనుగురించి వోటర్ల అభిప్రాయం తెలుసుకోడానికీ ఎన్నికలు నిర్వహించబడుతున్నా యని నెహ్రూ అన్నారు. అయితే ఇప్పటి పార్టీల పరిస్థితిని

(47-వ పేజీ చూడండి)

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

అలెగ్జాండర్ డ్యూమా

77

మాంట్ క్రిస్టో ఇంటికి చేరగానే ఆలీని పిలిచి "ఆలీ! నాపిస్తోళ్లు రెండూ ఇటు తీసుకురా!" అన్నాడు. ఆలీ తీసుకువచ్చాడు. ఒకటి తీసి మాంట్ క్రిస్టో పరిశీలిస్తున్నంతలో మెల్లిగా సావడి తలుపు తెర్చుకుంది. బాప్టిస్టిన్ వచ్చి ఏదో చెప్పబోతున్నంతలోనే వెనకనుంచి ముఖమంతా ముసుగు కప్పుకున్న ఒక స్త్రీ లోనికి వచ్చింది.

"మీరెవరమ్మా?" అన్నాడు మాంట్ క్రిస్టో అనుమానంతో.

వచ్చిన స్త్రీ చుట్టూ పరికించి చూసింది. తరవాత చేతులు రెండూ జోడించి దీనంగా ఇలా అంది: "ఎడ్మండ్! నాకొడుకుని చంపవు కదా?"

మాంట్ క్రిస్టో ఉలిక్కిపడి వెనక్కి ఒకడుగు వేశాడు. చేతిలోని పిస్తోలు జారి క్రిందపడింది.

"ఏ పేరుపెట్టి పిలిచారు కౌంటెస్ మార్సెర్ఫ్?" అన్నాడు కంపిస్తున్న స్వరంతో.

"నీ పేరే" అంటూ ఆమె ముసుగు వెనక్కి విదల్చి వేసింది. "నీ పేరే! నీ పేరు మరిచిపోనిది నేనొక్కదాన్నే, ఎడ్మండ్! నిన్ను వేడుకోడానికి వచ్చింది కౌంటెస్ మార్సెర్ఫ్ కాదు. మర్సిడా"

"మర్సిడా చనిపోయింది కౌంటెస్. ఆమె యెవరో నాకిప్పుడు తెలియదు."

"మర్సిడా బ్రతికే ఉంది. ఆమెకు సర్వం జ్ఞప్తిలో ఉన్నాయి. కౌంట్ మార్సెర్ఫ్ పరాభవానికి కారకులెవరో కూడా ఆమెకి ఎవరూ చెప్పనవసరం లేదు." అంది మర్సిడా.

"ఓహో! పాత పేర్లు మనం జ్ఞాపకం చేసుకుంటున్నాం కాబట్టి మీరు చెప్తున్నది ఫెర్నాండోగురించి కాదూ?" అన్నాడు మాంట్ క్రిస్టో. అతని మాటలలో ద్వేషం, వ్యగ్యం ఉట్టిపడుతున్నాయి. మర్సిడా ఇది విని లోలోన కంపించిపోయింది.

"ఎడ్మండ్! నేను పొరపడలేదు. నా కొడుకుని రక్షించమని ప్రార్థించడంలో దోషం లేదుకదా?"

"మీ కొడుకుపట్ల నాకు శత్రుత్వమున్నదని మీతో ఎవరు చెప్పారు?"

"కొడుకులకు సంబంధించినప్పుడు తల్లికి దృష్టి ద్విగుణీకృతమౌతుంది. ఎడ్మండ్! నేను సర్వం గ్రహించాను. నేనివాళ నాటకప్రదర్శనాలయానికి వచ్చాను. అంతా కళ్లారా చూశాను."

"మీ రదంతా చూసిఉంటే, ఫెర్నాండో కొడుకు నన్ను పదిమందిలో అవమానం చేశాడని గ్రహించేఉంటారు."

"అయ్యో! ఎడ్మండ్! నా మాట విను. నీ వెవరో నా కొడుకుకూడా తెలుసుకున్నాడు. తన తండ్రి విపత్తుకు నీవే కారకుడ వనుకుంటున్నాడు."

"పొరపడుతున్నారు. అది విపత్తు కాదు. శిక్ష. నేను పగ తీర్చుకోవాలని ప్రతిజ్ఞ పటినది ఫ్రెంచి సైనికోద్యోగిపైన కాదు, కౌంట్ మార్సెర్ఫ్ పైనా కాదు; పల్లెకారి ఫెర్నాండో పైన; కాటలన్ జాతి యువతి మర్సిడా భర్తపైన."

"అయ్యో! దైవదుర్విపాకంవల్ల నేను చేసిన పనికి ఇంత ఘోరశిక్షా? ఇందులో నేరం ఎవరయినా చేసిఉంటే, నేనే నేనాలి. ఎడ్మండ్! నువ్వు పగతీర్చుకోవలసి ఉంటే నాపైనే తీర్చుకో. నువ్వు లేక ఒంటరి జీవితాన్ని భరించడానికి ధైర్యం లేకపోయిన నన్నే నిందించాలి ఎడ్మండ్!"

"కాని నేను లేకపోవడం ఎలా సంభవించింది? నీకు ఒంటరితనం ఎందువల్ల వచ్చింది?" అన్నాడు మాంట్ క్రిస్టో.

"నువ్వు అరెస్టయినందువల్ల ఎడ్మండ్! బందీవైనందువల్ల!"

"నే నెందుకు అరెస్టయినాను? బందీ నెందుకైనాను?"

"అది నాకు తెలియదు" అంది మర్సిడా.

"అవును. అది నీకు తెలియదు. తెలియదనే అనుకుంటూను. కారణం నే చెపుతాను విను. పెళ్లి జరగవలసిన రోజుకి ముందొక రోజు సాయంకాలం రిజర్వుహోటల్లో కూర్చుని డాంగ్లర్ వ్రాసిన ఈ ఉత్తరాన్ని పల్లెకారి ఫెర్నాండో అధికారులకు పంపాడు. అదే కారణం" అంటూ మాంట్ క్రిస్టో ఒక బీరువ తెరిచి అందులోంచి ఒక చిన్నతోలుపెట్టె తీసి, నలిగిపోయిన ఒక కాగితాన్ని తీసి విప్పాడు. కాగితం బొత్తిగా మాసిపోయి సిరాతో వ్రాసిన అక్షరాలు స్పష్టంగా కనపడ్డంలేదు. కాగితాన్ని మర్సిడా చేతికిచ్చాడు. మర్సిడా వొణుకుతున్న చేతులతో అది అందుకుని ఇలాచదివింది: "మహారాజు హితంకోరిన ఒకమిత్రుడు, రాజశాసనాధికారి నీక్రిందివిధంగా హెచ్చరిస్తున్నాడు: స్మిర్నా నుంచి బయలుదేరి నేపుల్స్, ఫెరాజోరేవులగుండా ప్రయాణం చేసి, ఇవాళ ఉదయమే మార్సెల్స్ చేరిన ఫరావోనౌకలో మేట్ గా పనిచేస్తున్న ఎడ్మండ్ డాంటీ అనే ఒక యువకుడు, నేపుల్స్ రాజు (నెపోలియన్ బావమరిది)వద్దనుంచి నెపోలియన్‌కు ఒక ఉత్తరం ఇచ్చి, పారిస్‌లో బోనపార్టిస్ట్ కమిటీకి ఇవ్వడానికి నెపోలియన్ వద్దనుంచి ఒకఉత్తరం తీసుకు వెడుతున్నాడు. ఆయువకుని అరెస్టుచేసినట్లయితే, రుజువు దొరుకుతుంది. నెపోలియన్ ఉత్తరం అతనివద్దకాని, అతని తండ్రిఇంటిలోకాని, ఫరావో నౌకలో అతని గదిలో కాని దొరుకుతుంది."

"అబ్బ! ఎంత ఘోరం!" అంది మర్సిడా. "దీనివల్ల నేనా......"

"అవును. దానివల్లనే నే నరష్టయినాను. కాని ఎంతకాలం చెరలో ఉన్నానో నీకు తెలియదు. నీకు మైలుదూరంలో నే ఇఫ్ కోటలో ఒక కూపంలో పధ్నాలుగేళ్లు గడిపానని నీకు తెలియదు. శత్రువులపై పగ తీర్చుకోవాలని మొదటిరోజు తీసుకున్న ప్రతిజ్ఞను పధ్నాలుగేళ్ళలో ప్రతి ఒక్కరోజూ పునశ్చరణ చేసుకుంటూ గడిపానని నీకు తెలియదు. నువ్వు పెళ్లిచేసుకున్నట్లు నాకు తెలియలేదు. నాపైన నేరమారోపించిన నీమనిషే నిన్ను పెళ్లిచేసుకున్నాడని నాకు తెలియలేదు. నా తండ్రి ఆకలితో మలమలమాడి మరణించాడని నాకు తెలియలేదు."

అనువాదం: సీతారామ్

"ఇది నిజమేనా ?"

"నేను చెరనుంచి బయటపడగానే ఈ మాటలు విన్నాను. అందువల్లనే బ్రతికిఉన్న మర్సిడా కోసమూ, మరణించిన నా తండ్రికోసమూ పగ తీర్చుకోవాలని శపథం తీసుకున్నాను. ఫెర్నాండోపైన పగ తీర్చుకున్నాను."

"ఫెర్నాండో ఆ పనిచేసినట్లు నీకు రూఢిగా తెలుసునా ఎడ్మండ్ ?"

"అతనే చేశాడని నిర్ధారణగా తెలిసింది. నిజానికి, అదీ ఒక దోషమేనా ? మాతృదేశంగా చేసుకుని నివసించిన ఫ్రాన్సు దేశానికి ద్రోహంచేసి ఇంగ్లీషువారి పక్షాన చేరాడు. పుట్టుకవల్ల స్పానిష్ జాతీయుడైనా స్పెయిన్ దేశంపైన యుద్ధం చేశాడు. అలీపాషా కింద ఉద్యోగానికి చేరి యజమానికి ద్రోహంచేశాడు. హత్యచేశాడు. ఫ్రాన్సుదేశం దేశద్రోహిని శిక్షించలేదు. స్పానిష్ సైనికులు ద్రోహిని అంతంచెయ్యలేదు. అలీపట్లచేసిన ద్రోహానికి శిక్షపడలేదు. కాని నాపట్ల ద్రోహంచేసి నాజీవితాన్ని ధ్వంసంచేసినందుకు నేనే భగవత్కృపవల్ల ద్రోహిని శిక్షించగలిగాను. భగవంతుడిందుకే నన్నిక్కడికి పంపాడు. అందుకే నేనిప్పుడిక్కడున్నాను.

మర్సిడా నిలవలేకపోయింది. మాంట్ క్రిస్టో ముందు మోకరిల్లి దీనంగా వేడుకుంది: "క్షమించు ఎడ్మండ్ ! నీపట్ల పూర్వప్రేమ పోగొట్టుకోలేని నాకోసమైనా క్షమించు ఎడ్మండ్."

మాంట్ క్రిస్టో ఈమారు చలించాడు. అతనిలో పూర్వప్రేమ తిరిగి పొడగట్టింది. కాని పరకాంత, మాతృమూర్తి - అయిన ఆ స్త్రీని సమీపించలేకపోయాడు. మర్సిడా ప్రణమిల్లింది. ఆమెనుదురు తివాసీ తాకింది. మాంట్ క్రిస్టో ఇంక చూడలేక ముందుకి వంగి మెల్లిగా ఆమెను లేవదీశాడు. ఒకసోఫాలో కూర్చోపెట్టాడు. ఆమె మెల్లిగా తలెత్తి మహోదాత్తుడైన ఆ పురుషుని ముఖం పరిశీలించనారంభించింది. అతని ముఖంలో అప్పటికీ దుఃఖద్వేషాలఛాయలు చెరిగిపోలేదు. "ఆ దుష్టజాతిని నాశనం చెయ్యకుండా కాపాడ్డమా? ఫలించబోతున్న తరుణంలో నేనా పరమలక్ష్యాన్ని విడనాడుకోడమా? అసంభవం! కౌంటెస్ ఇది అసాధ్యం."

"ఎడ్మండ్ ! నేను నిన్ను ఎడ్మండ్ అని పిలుస్తుంటే నన్ను మర్సిడా అని పిలవకూడదా ఎడ్మండ్ !"

ఆమె దీనప్రార్థనకు మాంట్ క్రిస్టో విచలితుడైనాడు: "మర్సిడా!" ఆ నేమాటను జాగ్రత్తగా ఉచ్చరించాడు. "మర్సిడా! అవును. నువ్వు చెప్పింది నిజం. మర్సిడా పేరులో ఇంకా ఆ మాధుర్యం ఉంది. మర్సిడా! ఎంత దుఃఖంలో, ఎంత యాతనలో నీ పేరు ఎన్నిసార్లు పలికాను! దుర్భర మనోవేదనలో కుమిలి కుమిలి జీవితం సమాప్తం చేసుకోవాలని ప్రయత్నించి నీ పేరెన్నిమార్లు మననం చేశాను! మర్సిడా! నేను పగతీర్చుకుతీరాలి. నేను పధ్నాలుగేళ్లు యమయాతన లనుభవించాను."

"అయితే తప్పకుండా పగతీర్చుకో ఎడ్మండ్ ! కాని నీ పగ దోషులపైనే తీర్చుకో. నాపైన తీర్చుకో, ఫెర్నాండోపైన తీర్చుకో; కాని ఏ పాపమెరగని నా కొడుకుపైన మాత్రం వద్దు ఎడ్మండ్ !"

మాంట్ క్రిస్టో ఇది భరించలేక సన్నగా మూలిగాడు. రెండు చేతులతో తలపట్టుకున్నాడు.

మర్సిడా ప్రార్థనాపూర్వకంగా చేతులు చాపి ఇలా అంది: "ఎడ్మండ్ ! నీతో పరిచయమైన మొదటిరోజునుంచీ నిన్ను ఆరాధించాను. భక్తితో నీపేరు జపించాను. నువ్వు జీవించి ఉన్నావనుకున్నన్ని రోజులూ నీకోసం భగవంతుని ఎంతగా ప్రార్థించానో ఆ భగవంతునికే తెలుసు. నువ్వు మరణించావనుకున్న తరవాత నీకోసం ఎంత పరితపించానో నీకు తెలియదు. నీకోసం భగవంతుని ప్రార్థించడం, విలపించడం తప్ప నేను చెయ్యగలిగిన దేముంది ఎడ్మండ్ ? పదిసంవత్సరాలపాటు ప్రతిరాత్రీ నిద్రలో ఒకే స్వప్నంచూస్తూ గడిపానంటే నమ్ము. తప్పించుకుని పారిపోడానికి నువ్వు ప్రయత్నించావని విన్నాను. ఒక బందీ శవాన్ని చుట్టిన గోనె సంచిలో నువ్వుదాగావనీ, నిన్ను ఇఫ్‌కోటగుట్టలపైనుంచి సముద్రంలోకి విసిరివేశారనీ తెలిసింది. కాని నువ్వు రాళ్లగుట్టలపైన పడి ఆర్తనాదం చేశావన్నారు. నిన్ను శవవాహకులు హత్యచేశారని విన్నాను.

ఎడ్మండ్ ! నే నెవరిని రక్షించమని నిన్ను ప్రార్థిస్తున్నానో ఆ నా కుమారునిపైన ప్రమాణంచేసి చెప్తున్నాను. పది సంవత్సరాలకాలం ప్రతిరాత్రీ భయంకరమైన స్వప్నాలతో గడిపాను. ఎవరో ఇద్దరు దేనినో రెండువైపుల పట్టుకుని విసిరివేస్తున్నట్లు, తరవాత భయంకరమైన ఆర్తనాదం వినపడినట్లు కలలోనుంచి ఉలిక్కిపడి మేలుకొనేదాన్ని. ఎడ్మండ్ ! నేనుకూడా చాలకాలం యాతనపడ్డాను సుమా ! నామాట నమ్ము."

మాంట్ క్రిస్టో సహించలేని ఆవేదనతో ఇలా అన్నాడు: "కాని నువ్వులేని సమయంలో నా తండ్రి ఆకలితో మాడి మరణించడం నువ్వెరుగుదువా? అంధకారకూపంలో మగ్గిపోతుంటే ప్రియురాలిని పరమశత్రువు పరిణయమాడినప్పుడు కలిగే బాధ నువ్వనుభవించావా?"

"లేదు" అంది మర్సిడా. "కాని నేను ప్రేమించిన పురుషుడే నా కొడుకుని చంపబోవడం తెలుసును." ఆమె దీనావస్థనింక మాంట్ క్రిస్టో చూడలేకపోయాడు. అతని ద్వేషం, క్రోధం, పగ కరిగిపోయాయి.

"అయితే నన్నేం చెయ్యమంటావు ? నీకొడుకు ప్రాణమేనా ? సరే. అతనే జీవిస్తాడు"

మర్సిడా చేతులలో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్వనారంభించింది. మాంట్ క్రిస్టో కన్నులలో నీరు నిండింది కొంతసేపటికి మర్సిడా తేరుకుని లేచి అతని రెండుచేతులు పట్టుకుంది. "ఎడ్మండ్, నేను కలలో కన్న ఆదర్శపురుషుడవే నువ్వు. నువ్వు ఎంత ఉత్కృష్టుడవని ఆశలతో నీ జ్ఞప్తి పెంపొందించుకున్నానో, వాస్తవంగా నీవంత ఉత్కృష్టుడవైనందుకు నాకు పరమ ఆనందం కలుగుతోంది ఎడ్మండ్ "

"అవును. అది మరీ మంచిది." అన్నాడు మాంట్ క్రిస్టో "ఎడ్మండ్ ఇంక నీయీ ఆరాధన స్వీకరించడానికి ఆట్టే కాలంబతకడు. మృత్యువు నోటనుంచి బైటపడివచ్చిన మానుషాతీతమైన మహాశక్తి తిరిగి తన గోరీ చేరుకుంటుంది."

"ఏమిటన్నావ్ ఎడ్మండ్ ?"

"నువ్వు ఆజ్ఞ ఇస్తున్నావు కాబట్టి జీవితం చాలిస్తానని చెప్తున్నాను మర్సిడా!"

"కాని నువ్వు క్షమిస్తున్నావు! ఇంక ద్వంద్వయుద్ధం జరగనక్కరలేదు కదా !"

"కాదు, ద్వంద్వయుద్ధం జరిగి "తీరుతుంది" అన్నాడు మాంట్ క్రిస్టో స్థిరస్వరంతో." కాని నీకుమారునికి బదులు నేనే మరణిస్తాను." మర్సిడా భీతితో కంపించిపోయింది. "ఎడ్మండ్! ఎంత ఉదాత్త ప్రకృతి నీది! మహాత్యాగం చేస్తున్నావుఎడ్మండ్! దీనంగా ప్రార్థించవచ్చిన ఒక స్త్రీని కరుణించి ఉత్కృష్టత్యాగశీలం ప్రకటించావు. నేనో! ఏళ్లుపైబడినదానికంటె ముందే వృద్ధాప్యంవచ్చి పడింది నాకు. ఒకనాడు తనతో ప్రణయవీధులలో విహరించిన ఎడ్మండ్‌ని ఆనాడు మురిపించగలిగిన మర్సిడా ఈనాడు చల్లని చూపైనా చూడలేదు గదా. చిరునవ్వుకూడా

(౩౫-వ పేజీ చూడండి)

విచిత్ర సంభాషణ

శ్రీ మహీధర నళినీమోహనరావు

మా గోడనున్న గడియారం ఠాంగ్, ఠాంగ్ మని పన్నెండుగంటలు కొట్టింది. అర్ధరాత్రయినా నాకింకా నిద్రపట్టటం లేదు. వళ్ళంతా ఏవో కుడుతున్నాయి. వెధవకుక్కి మంచంలో పడుకోలేక ఆపసోపాలు పడుతున్నాను.

ఇంతట్లోకే ఎవరో మాట్లాడుకుంటున్న ధ్వని వినిపించింది. నాకు ఆశ్చర్యం వేసింది. ఆ గదిలో నేనొక్కడినే పడుకున్నాను కదా. మరి ఈధ్వని యొక్కడిదీ? పక్క గదిలోనుంచేమో అనుకుందామంటే నా చెవిదగ్గర ఎవరో స్పష్టంగా గుసగుస లాడుతున్నట్లు వినబడుతోంది. పోనీ, ఆ గదిలోకి ఎవరైనా వచ్చారేమో అనుకోవడానికైనా వీలులేదు. గోడనున్న ముత్తెమంత దీపం చెప్తానే ఉంది గదిలో ఇంకెవ్వరూ లేరని. నేను చెవులొగ్గి వినడం మొదలుపెట్టేను. నా కా కంఠధ్వని చాలా తమాషాగా ఉంది.

"చాల్లే ఊరుకోరా పేనుపోతూ! చూస్తే నా కాలిగోరంత లేవు. నేనూ ఓ మొగాణ్ణేనని చెప్పొచ్చేవ్"

"జాగర్తగా మాట్లాడరా నల్లిపోతా! ఒరేయ్ గిరేయ్ అంటే మాటదక్కదు."

నాకు మరీ ఆశ్చర్యం వేసింది. నల్లీ పేనూ దెబ్బలాడుకుంటున్నాయి కాబోలు. ఇందాకటినుంచీ నన్ను కుట్టి, నిద్రపట్టకుండా చేసినందుకు ఈ రెండింటినీ పట్టుకుని, కసితీరా నొక్కి చంపేద్దామన్నంత కోపం వచ్చింది. కాని, కోపం వచ్చినప్పుడు పది అంకెలు లెక్కపెట్టమన్న మా వీధి బడిపంతులుగారి మాటలు జ్ఞాపకం వచ్చి, ఒకటీ, రెండూ... అని నోట్లో పది అంకెలు లెక్కపెట్టుకున్నాను. నా కోపం ఎక్కడిదక్కడ పటాపంచలైపోయింది. పైగా, ఆ నల్లీ పేనూ ఇంకా ఏమేమి మాట్లాడుకుంటాయో వినాలన్న కుతూహలం కలిగింది. మళ్లీ వినడం మొదలెట్టేను.

నల్లి: ఇప్పుడు నువ్వు కూసినదేమిటే? అదీకాక నాకన్న తక్కువవాళ్లని నేను "ఒరేయ్" అన్నా ఖరవా లేదు.

పేను: ఏమిట్రా పేలుతున్నావ్? నేను నీకన్న తక్కువ వాడినా?

నల్లి: ముమ్మాటికీనూ.

పేను: ఎందులోనూ?

నల్లి: మనుష్యుల్ని బాధించడంలోనూ, ఇంకా...

పేను: ఛీఛీ నోరుముయ్యి నీకన్న నేనే ఎక్కువ ఆమాటకొస్తే.

నల్లి: ఛీ అంటే కుక్కా అంటాను. గట్టిగా నోరెట్టుకుని అర్చినంతమాత్రాన్ని ఒప్పుకుంటాననుకున్నావేమో. ఇవి వెనకటి రోజులు కావు కాస్త బుకాయిస్తే నమ్మెయ్యడానికి. నువ్వెల్లా గొప్పవాడివో ఋజువుచెయ్యి చూస్తాను. నేను పూర్వపక్షం చేస్తాను.

పేను: అయితే కాచుకో. మన పక్కింట్లో ఉన్న చింపిరితల అమ్మాయిని అడుగు మా తడాఖా చెప్తుంది. రెండు చేతులూ జుట్టులో దూర్చి తెగబరికేటప్పటికి గోళ్లుకూడా అరిగిపోయి బాధ తగ్గక, గోక్కోలేక దిగాలుపడిపోయిన మన ఇంటివాళ్ళ దాసీపిల్ల మంగిని అడుగు తెలుస్తుంది మా ప్రజ్ఞ. మన ఎదురింటిలో కాపరం ఉన్న ఆచారిగారి ఆడవాళ్ళని వాకబు చెయ్యి మా వంశీకుల కరుకుతనం, చురుకుతనం బాగా తెలిసివస్తుంది. మా పేరు ఖండ ఖండాంతరాల్లోనూ మోగిపోయింది.

నల్లి: ఓస్. ఈమాత్రపు చచ్చు ప్రజ్ఞకేనా ఇంత మిడిసిపాటూ? నువ్వు ఆడవాళ్ళనీ, అందులోనూ చింపిరి జుట్టువాళ్ళనీ కాని ఏమీ చెయ్యలేవన్న మాట. హా. ఇంక నా ప్రజ్ఞ చూడు. విధవలనే కాదు, నున్నగా బుఱ్ఱగీయించిన బ్రాహ్మలనే కాదు ఆడా మొగా అనే భేదం లేకుండా అందరినీ ఒక వరసపెట్టి పీల్చి పిప్పిచేసి పారేస్తాను. నిదర్శనం కావలిస్తే ఈ మంచంమీద పడుక్కున్న పెద్దమనిషిని చూడు.

నా సంగతి ఎత్తేటప్పటికి నాకు కించిత్తు కోపం వచ్చింది. చేసేది వెధవపని. పైగా ఎల్లా చేస్తున్నానో చూడమని చెప్పడానికి అందులోనూ నాముందర—ఎంత గుండె నిబ్బరం! కాని, నన్ను పెద్ద మనుష్యుల్లోనే లెక్క వేసిందికదా అని మనస్సు సమాధానపరుచుకున్నాను.

పేను: చాలు చాలు ఊరుకో. నేను వెళ్ళలేని చోటంటూ ఉందా? పోతుటీగకు కూడా చొరడానికి శక్యంకాని మహారాజాంతఃపురాలలో సమస్త భోగాలూ అనుభవించే రాణులుకూడా మా వాళ్ళంటే హడలుతూ ఉంటారు. నవరత్న ఖచితమైన సువర్ణ సింహాసనంమీద కూర్చుని కన్నెపడుచుల చేత వింజామరలు వేయించుకునే మహారాజు సైతం తన మీసంలో దూరి హడావిడి చేస్తున్న నన్ను పసికట్టి, అందరిలోనూ గోక్కోడానికి నామర్దా,

చేత మీసం దువ్వుకుంటున్నట్లు నటిస్తూ నానా అవస్థలూ పడతాడు. ఇంక ఇతరుల మాట నాకు లెక్కేమిటి? అల్లాంటి చోట్లు నువ్వెప్పుడైనా నీజన్మలో చూసి ఎరుగుదువా? నాకు తప్ప మరో ప్రాణికి అక్కడికి వెళ్ళ వల్ల అవుతుందా?

ఈ సంభాషణంతా ఇతదాకటినుంచీ చాటున నిలుచుని వింటోంది కొబోలు, చిటికెన వేలుకి అందేలాగ నెత్తురు తాగిన ఒక దోమ అప్పుడే ఉస్‌మంటూ వాటి దగ్గరకు వచ్చి, తానుకూడా ఆ దెబ్బలాటలో పాల్గొంది.

దోమ: ఓయబ్బో! ఆవులు లేనిచోట గొడ్డుగేదే మహాలక్ష్మిట. అల్లా ఉంది నీపని. నేను లేకుండా చూసి,నిన్ను నువ్వే పొగిడేసుకొంటున్నావే. నా ముందర నిన్ను ఉచ్చరించడానికైనా వీలుందిట్రా పేనుపోతూ!

నల్లి: అడుగు. అల్లా అడుగు. నోట్లో ఇంకొంచెం గడ్డిపెట్టు. అటకాయించేవాడు లేక ఈపేను మరీ పేట్రేగి పోతోంది.

దోమ: ఏంరా పేనూ! నాకున్న కీర్తిలో నీకు వెయ్యోవంతేనా ఉందా? నాపేరు లేని వైద్యం పుస్తకం మచ్చుకి ఒక్కటి చూపించు. అవతల వీధినున్న చలిజ్వరం రోగినీ, కోమట్ల వీధినున్న బోదకాళ్ళ వాళ్ళనూ అడుగుతే నా ప్రతాపం మీకు బాగా అవగాహన అయేలాగ చెప్తారు.

పేను: ఏడిసేవులే. నాలుగు ఫినైలు చుక్కలు చల్లుతే థామ్మని చస్తావు. దోమతెర కట్టుకుంటే కుయ్యోమని ఏడుస్తూ పోతావు. రాత్రేగాని పగలు నోరులేవని వాజమ్మలు మీరు నన్ను ఆక్షేపించ వచ్చారూ? నేను చూసుకో. పగలవనీ, రాత్రిఅవనీ ఏక ధాటిని విసుగూ విరామం లేకుండా మనుష్యుల్ని ఏడిపిస్తూనే ఉంటాను.

నల్లి. గొప్పే. గడపనేని కుక్కుతే కిక్కురు మనకుండా ఛస్తావ్.

పేను: ఛీ నీదీ ఒక బతుకే. కాలికింద పడేసి నలుపుతే రక్తం కక్కుకు చస్తావ్.

దోమ: ఓరి చవటల్లారా! మనుష్యుల కంటబడితే మీ ప్రాణాలు మీవి కావు. నేను చూడండి. దేవతల్లాగ ఆకాశమార్గాన్ని ప్రయాణం చేస్తాను. ఒళ్ళంతా విస్తరిలాగ కుట్టేస్తాను.

పేను: నీప్రజ్ఞ అంతవరకే. మావంశంలో ఒకడు పెసరచేను వేసుకుంటే ఆదేశపు రాజు దాన్ని పాడుచేసేసరికి ఆపేను రాజుని చంపేదాకా వదిలిపెట్టిందీ? మీలో ఎవరు చెయ్యగలిగేరు ఆపని?

నల్లి: మిడిమిడి జ్ఞానం పనికిరాదు. ఆ రాజుని చంపినది పేనుకాదు పెద్దపులీ, బండరాయీ, పామూను.

దోమ: అవును. సరిగ్గా ఇదే నే నందామనుకుంటూంటే నువ్వనేశావ్.


నల్లి: ఇంతవరకూ మీరు చెప్పినదాన్ని బట్టి మీరు మనుష్యుల్నే కాని, ఇంకెవ్వరినీ ఎరగనట్టుందే! కప్ప తన పాడునూతినే ప్రపంచం అనుకుంటుందిట. అవును. పాపం! మీకేం తెలుసు? ఈ లోకం తప్పించి ఇంకేమీ ఎరగరు. నేను మనుష్యుల్నే కాదు దేవతలని కూడా భయపెట్టేను. ఈ విషయాన్నే ఒక కవి ఏమన్నాడో విన్నారా?

"శివు డద్రిని వసియించుట,
రవిచంద్రులుమింటనుంట, రాజీవాక్షుం
డవిరళ సముద్రమందున
బవళించుటనల్లిబాధ బడలేకసుమీ!"

దోమ: నల్లిబావా; ఇదుగో. నామీద కూడా ఒక కవి పద్యం రాశాడు చూడు.

"అల్లపరమశివుడు హాలాహాలంబును

(34-వ పేజీ చూడండి)



వినయప్రవర్తన

"వసశ్రీ"

[గత సంచిక తరువాయి]

"వెధవ గ్లాక్సోటిన్! ఒక్క టిన్‌వాయి కూడా బయటపెట్టడే! ఏం వందలు కావాలన్నా నా? వేలు కావాలన్నా నా? ఒక్కటంటే ఒక్కటీ! ఉదయం ఏడుగంటల్నుంచీ సాయంత్రం ఐదున్నర గంటలదాకా కాలికి బలపం కట్టుకుని తిరిగినా ఒక్కటి సంపాదించలేక పోతిని. అందులోనూ బ్లాక్‌మార్కెటీర్లను స్వయంగా ప్రధానమంత్రే పురితీయించేస్తున్న యీ దేశంలో అనుకుంటూ—మా వాకిలిముందు ఆ సంఘటన జరిగిన రెండోరోజో, మూడో రోజో—సరిగ్గా గుర్తులేదు—గ్లాక్సోటిన్ సాధించే ప్రయత్నంలో సైనాబజారు నుంచి గోడౌన్ స్ట్రీటు మలుపు తిరిగాను; వో రెండురూపాయలు మనవి కాదనుకుని అవతల పారేస్తే ఎవడో వొకడు యివ్వక పోతాడా అనే ఆశతోద్దీ.

సరిగ్గా మలుపు తిరిగానో లేదో వో కాని స్టేబుల్ ఎదురైయాడు. ఆఁ ఆఁ ఆ కానిస్టేబులే! అతనే! నా కుడిచేయి నాకు తెలీకుండానే కణతలదాకా వచ్చి అతనికి సలాంకొట్టేసింది. అతను చిరునవ్వుతో అదోమాదిరిగా చేయెత్తి దించని "ఎక్కడికి సార్! పోతారు?" అన్నాడు.

ఇంకేం! అంతకంటే కావాల్సిందేముంది? పొద్దుట్నుంచీ గ్లాక్సోటిన్ కోసం ఎంత అవస్థపడుతూంది ఆప్యాయంగా చెప్పాను.

"అయ్యోపాపం! మాటమాత్రం నాతో అన్నారు కాదేం? దొంగముండాకొడుకులు! వీళ్ళందరి దగ్గరా వుంటయ్."

"ఆఁ ఆఁ అదేనండి! మేము పోతే బయటపెట్టరు."

"రండీ పోదాం! ఎలా యివ్వరో చూస్తాను." లాటీని అదోమాదిరిగా విన్యాసంచేసి ముందుకు నడిచాడు.

ఎంత హుందాతనం? ఎంత గ్రివి ఆ నడకలో.

దగ్గర్లోవున్న వో షాపులోకి వెళ్ళడమేమి 'ఏయ్! అవతారం గ్లాక్సోటిన్ కావాలనడమేమీ, అయ్యా అంతకంటేనా చిత్తం చిత్తం' అంటూ టిన్ ముందున్న టేబుల్ మీదకు దూకడమేమీ అంతా నా కళ్ళముందు సినిమా ఫ్లాష్‌లా జరిగిపోయింది.

టిన్ నా చేతులో పెట్టా "వొకటి చాలా?" అన్నట్టు చూశాడు. పోలీసాయన.

"వో చాలండి! థాన్క్సు! వుత్సాహంతో వుబ్బి తబ్బిబ్బవుతున్న హృదయం నిండి సంతృప్తిగా అన్నాను. కృతజ్ఞతతో మునకలు వేస్తున్న నాహృదయం యేం చేయటానికి తోచక తికమక పడింది.

"కాఫీ తీసుకుందాం రండీ!" హోటలకు దారితీస్తూ అన్నాను. అప్పటికి అంతకంటే మరేం తోచలేదు.

"వద్దుసార్! ఇప్పుడే తాగాను!" ఎంత మర్యాదగా నిరాకరించాడు! ఇంకా ఏదో గుణుస్తూన్న నా అవస్థ గమనించి యిలా అన్నాడు.

"అదంతా మాడ్యూటీ సార్, మేము ప్రజలకు సేవచేయటానికిదా వుంటిమి; మీ కేమైనా అవసరమొస్తే నాకు కనిపించండి." అన్నాడు.

తర్వాత మాటల మధ్యలో అతనిపేరు మారయ్య అని, ఎప్పుడు యెక్కడ డ్యూటీలో వుండేది తెలుసుకొని, నా అభివందనాలు చెప్పి గ్లాక్సో టిన్‌తో సగర్వంగా సరాసరి అమ్మమ్మదగ్గర కెళ్ళాను. ఆ వార్త అమ్మమ్మ చెవిని వేసిందాకా నాకు వూపిరాడలేదు.

ఆ నాటి సంఘటన - పోలీసు మారయ్య ప్రవర్తన నాకళ్ళు తెరిచింది. ముఖ్యంగా సరదాగా కాఫీకి రమ్మన్నారా నిరాకరించిన అతని ప్రవర్తన పోలీసు చరిత్రలో సువర్ణాక్షరాల్తో లిఖించాల్సింది.

ఏదైనా అంతలోనే వుందిగదూ? అసలు మనం ఎదటివాళ్ళను అర్థం చేసుకోటంలోనే వుంది. అంతవరకూ పోలీసుల్లో క్రౌర్యం, నైచ్యం, అవినీతి, అవిశ్వాసం, అసహ్యం, ద్వేషం, భయాన్ని పరిధులు తెలియని పరిమాణంలో చూడగలిగిన హృదయం యీ అనుభవంతో ఆ పోలీసుల్లోని సహృదయతను, సహకారేచ్ఛను, బాధ్యతాయుతమైన మంచితనాన్ని హిమాలయపర్వతాల పరిమాణంలో పసిఫిక్ మహాసముద్రమంత లోతుగా చూడగలిగింది.

అబ్బ! దేశంలోని పోలీసులంతా మారయ్యలే అయితే! అహింసతిని, సత్యాన్ని తాగి, సంస్కృతిని పీల్చి బతికి ఆత్మసౌందర్యాన్ని ఆరాధించే యీ కర్మభూమిలో—బుద్ధభగవానుడు, గాంధీజీ అవతారాలు చాలించిన యీ పుణ్యభూమిలో, జీవనదులు పొంగిపొరలే యీ జీవగడ్డలో - పోలీసులంతా మారయ్యలుగా ఎందుక్కారు? తప్పకుండా అవుతారు. అయి తీరాల్సిందే. ఆలోచిస్తున్న కొద్దీ, ఆవేగంతో, ఆవేశంతో, వుద్వేగంతో హృదయం ఆనందపు వెల్లువలో మునకలు వేసింది. భూమిపైన వో పదిగజాలు లేచి గాల్లో నుంచున్నట్టుగా వుంది.

ఈపాటికి పోలీసుల్లో చాలామంది మారయ్యలా మారి వుంటారు. ఇంతవరకూ పోలీసులు అలా ప్రవర్తించటానికీ, ప్రజలకు పోలీసులంటే వున్న విముఖత్వానికి, విద్వేషానికి, భయానికి కారణం బ్రిటిష్ ప్రభుత్వ పరిపాలనే కావొచ్చు.

అసలు ప్రజలకు పోలీసులపట్ల అలాంటి విపరీత మనస్తత్వం ఏర్పట్టాని క్కారణం పరాయి ప్రభుత్వ పాలనే కాకుండా కొంతవరకూ ఆ రోజుల్లోని కాంగ్రెసు వుద్యమం కూడా నేమో!

ఏమైనా అనతికాలంలోనే కాంగ్రెసు ప్రభుత్వ హయాంలో పోలీసులంతా మారయ్య లవుతారని, రామరాజ్యంలో శాంతిభద్రతలు తాటిచెట్టు వేళ్ళలా పాతుకుని, సత్యాహింసలు మర్రి వూడల్లా అలుముకుంటాయని నాలో సంపూర్ణ విశ్వాసం కలిగి...

"ఒరే అబ్బాయ్! యీ టిమ్ము చూడరా?" ఆశయ సౌధాల్లో కూర్చుని

మారయ్య ఆత్మౌన్నత్యం తాలూకు విశాలత్వాన్ని కొలుచుకుంటున్న నన్ను అమ్మమ్మ కేక వంటింట్లోకి పరుగెత్తేట్టు చేసింది.

‘ఈ టిన్ను చూడరా?’ అన్న అమ్మమ్మ కేక నా లోపల దేన్నో తొలిచివేసింది. ‘ఆ టిన్ను ఖాళీది కాదు కదా? అందులో మట్టి లేదు కదా!’

ఛీ! వెరి అనుమానం బ్రతుకు! అందుకే యీ దేశం యిట్టేడుస్తోంది! మనుష్యులపై విశ్వాసం వుంచకపోతే దేనిపై వుంచుతామో అర్థం కాదు. అమ్మమ్మ టిన్ విప్పకో లేక పిలిస్తే యింత అనుమానమూ వచ్చి పడిందాయె. బంగారంలా వుంటేను గ్లాక్సో పోడరు. మళ్ళీ మారయ్య నా మనసులో కదిలాడు ‘మారయ్యలాంటి వాళ్ళు దేశానికి పదిమంది వుంటే.’

“మళ్ళీ పోయి కూర్చుంటావేరా? కాలేజీకి వెళ్ళవ్?”

“పెట్టు మరీ—అన్నం!”

* * *

“ఒరేయ్! జాగ్రత్త! భద్రంగా తీసుకెళ్ళాలి సుమా!”

“వూఁ”

“ఎవరైనా పట్టుకుంటే నా పేరు మాత్రం చెప్పక నాకు తెలీయదనేసేయ్.”

మినర్వా థియేటర్లో రెండో ఆట సినిమా చూసి వస్తూంటే సరిగ్గా అవతారం కొట్టు ముందుకొచ్చేసరికి వినిపించింది.

నాకు తెలీకుండానే నా శరీరం గోడ పక్కకు నక్కి నీడలో పంది కొక్కులా పాక్కుంటూ పోయింది. చూస్తునుగదా! యింకేముంది! ఎక్కం చేస్తున్నాడు తానుకు తాన్లు బిన్నీ గుడ్డలు, పెట్టెలకు పెట్టెలు గ్లాక్సో టిన్నులు, గ్రైప్ వాటర్ బాటిల్సూను! ఇంకెవరూ? అవతారం గాడే! నిన్న నేకదూ వాడిషాపులో బిన్నీ గుడ్డ యిస్తున్నారని తెలిసిపోతే అయిపోయింది వచ్చే కోటాకు రమ్మన్నాడు.

వెంటనే నా కళ్లల్లో మెదిలాడు పోలీసు మారయ్య, ‘ఇక చచ్చాడులే అవతారంగాడు. యీ దెబ్బతో వురిశిక్ష; తప్పితే యావజ్జీవ కారాగార శిక్షో, ద్వీపాంతరమో! అది తప్పినా, ఎంత లేదన్నా ఆరుసంవత్సరాలపాటు శ్రీకృష్ణ జన్మస్థానంలో దేవతా పులుసు, వేరుసెనగ పప్పూ తప్పవు.’ మెదడు అవతారానికి పట్టబోయే దుర్గతిని ఆలోచిస్తూంటే కాళ్లు పిక్కబలం కొద్దీ పోలీస్టేషన్ వైపు పరుగెత్తాయి. అంతకుముందే మనసు పోయి మారయ్యదగ్గర వాలిపోయింది.

‘ఇంతకీ పోతే మారయ్య డ్యూటీలో వుంటాడో వుండడో?’ అనుమానాన్ని సంకుచితను మనసు కదిలించుకొని పెద్దది చేసుకుంటుంటే వివేకం, విశాలత్వం తాలూకూ ఏదో భావన ‘పోలీసులంతా యీ పాటికి మారయ్యలే అయివుంటారని’ విశ్వాసాన్ని కలిగించింది.

ఆ కూర్చుంది మారయ్యేనా? ఆఁ ఆఁ అనుమానం ఎందుకు? మారయ్యా! మా మారయ్యా!! ఎగిరి గంతేసి మారయ్యదగ్గర వాలిపోయాను.

రొప్పుకుంటూ రోచుకుంటూ అలా అర్థరాత్రి వచ్చిన నన్ను చూసి మారయ్య కలవర పడ్డాడు.

“తొందరగా రావాలి! బ్లాక్ మార్కెట్! తానుకు తాన్లు! టిన్నులకు టిన్నులు! రిక్షా నిండా...వూఁ లేవండీ!”

ఎలా వున్నవాడు అలానే బయలుదేరాడు మారయ్య. లోపలికిపోయి రెండో పోలీసు చెవినైనా వేయకుండా టోపీనైనా తీసుకోకుండా అలా బయల్దేరిన మారయ్యను చూస్తూంటే—‘శిరికిం జెప్పడు శంఖ చక్రయుగముఁ జేదోయి బంధింప..’ వీధిబళ్లో చదువుకొన్న పద్యం గుర్తొచ్చింది. మహావిష్ణువు అదృష్టవంతుడు - అలా పోతన చేత పొగిడించుకొన్నందుకు. మారయ్య పోతన కాలంలో పుట్టక పోవడం వో విధంగా చూస్తే మారయ్య దురదృష్టమే అనాల్సొంటుంది. మారయ్యను గురించి పోతనలా నాకు వర్ణించిచెప్పడం చేతకాక పోయినా—బ్లాక్ మార్కెటీర్ల కబంధ హస్తాల్నుంచి, విషపుకోరల్నుంచీ ప్రజలను రక్షించాలనే ఆ కాంక్ష, ఆవేదన, కార్య దీక్షను మారయ్యలో—నా హృదయం చూడగలిగింది.

అయితే యింకో సంగతి. శ్రీ మహావిష్ణువు దద్దమ్మలా—ఎప్పుడూ చేతిలో వుండే గదనుకూడా వదిలేసి పోయాడు. కాని మారయ్య చేతిలో లాఠీ వుండనే వుంది. ఎక్కడికన్నా వెళ్ళడం జరిగితే ముందు లాఠీ—తర్వాతే మారయ్య. అసలు మారయ్య లేకపోతే లాఠీ లేదు! లాఠీ లేకపోతే మారయ్య లేడు!

ముందు నేనూ, నా వెనక మారయ్యా — నేను ప్రజలకు ప్రతిరూపాన్నయితే మారయ్య ప్రభుత్వానికీ—చెట్టపట్టాలు పట్టుకుని నడిచాం. బ్లాక్ మార్కెట్ అవతారం యీ దెబ్బతో అవతారం చాలించాల్సిందే. మా యీ నవశక్తిని ఎదిరించి ఏదీ నిలుపరించలేదు. మనసు ఎంతగా వూహించుకుని ఆనందించిందో, ఎంత వుత్సాహాన్ని, వుద్రేకాన్ని పొందిందో మారయ్య ముందు నడుస్తూన్న నా మనసుకు తెలియాలిగాని తాపీగా కూర్చొని కాలక్షేపంకోసం కథలు చదువుకునే మీకెలా తెలుస్తుంది?

అలా మేము వెళ్ళి వెళ్ళడంతోనే కదలబోతూన్న రిక్షా ఆగిపోయింది. అవతారం మమ్మల్ని అంతదూరంలోనే చూసి అచేతనుడయ్యాడు. కాని మేము దగ్గరకు వెళ్లడంతోనే అవతారం పోయినప్రాణాలు తెచ్చుకుంటూ—

“నువ్వేనా మారయ్యా! ఎవరో అనుకొని గుండె ఆగిపోయినంత పనైంది.” అని మెల్లిగా అన్నాడు.

“హుఁ వీడికింకా మారయ్య సంగతి తెలియదల్లే వుంది. మారయ్యంటే ఏమనుకుంటున్నాడో?” అని మనసులో అనుకున్నాను.

అవతారమూ, మారయ్యా వొకరొకరు చూసుకొని ఆ గుడ్డివెలుగులో అదో మాదిరిగా నవ్వుకున్నారు.

"ఏం ? మారయ్యా! పనిమీద వచ్చి నట్టున్నావ్ ?" అవతారం అంటూన్నది వినిపించుకోకుండానే మారయ్య నావైపు తిరిగి—

"ఏయ్! ఎక్కడికో చెప్పాపెట్టకుండానే తీసుకొచ్చావ్ ?" కోర్టుఇంజక్ ధ్వనిలాగుంది మారయ్య మాట్లాడింది.

"అవునండీ! అవేం! అవే! దొంగబజారుకు పోతూంది సరకు—ఆ రిక్షాలో..."

"శాట్! అదంతా నిన్నెవ్రరా చెప్పమన్నారు. అవక్కడికిపోతే నీకేంరా ?" మధ్యలో అందుకున్నాడు అవతారంగాడు. వోరి వీడి జబర్దస్తీమండ! రా-గీ-అంటున్నాడు.

"అర్ధరాత్రి నన్ను నానా అవస్థపెట్టి, అటుతిప్పి యిటు తిప్పి మన అవతారంగారి దగ్గరకే తీసుకొచ్చావేమోయ్ ? యిలాంటి పిచ్చిపను లెప్పుడూ చేయకు."

"ఎరివైతే నేమండీ! అవి బ్లాక్ మార్కెట్ లోకే పోతూన్నాయండీ సార్ !"

"చప్! ఏయ్! అధికంగా వాగకు. అవి ఎక్కడికిపోతే నీకేమోయ్! అయినా యింత రాత్రి పూట బజార్లో ఎందుకురా తిరుగుతావ్ ?" మారయ్య ఎడం చేతులో వున్న లాటీ కుడిచేతిలోకి వచ్చింది.

"అది కాదండీ! మీరే ఆరోజున చెప్పేరు కాదటండీ!" సగం చచ్చి అన్నాను.

"ఏరోజోయ్ ?"

"గ్లాక్సో టిన్ కూడా యిప్పించారు కాదండీ!" మారయ్యకేదో గుర్తుచేయాలనే ప్రయత్నం కొద్దీ అనేశాను—

"వినయ ప్రవర్తన వారంలో - వొకరోజు నండీ."

"ఓహ్! అదా! వినయ ప్రవర్తన వారం వెళ్లిపోయి మూడు నెల్లయితే యిప్పుడేమిటోయ్ నీ ఏడుపూ-" మారయ్య మాటలు నా చెవుల్లో నలికలు పాముల్లా జొరబడ్డాయ్.

నాశరీరం శీతలం కమ్మింది. అంతటిలోను ముచ్చెమటలు పోశాయ్. నా లోపలఏదో వూడిపోయి సుడిగుండంలా గిర గిరా తిరుగుతూ, బయటకు రావటానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నట్టనిపించింది. నరాలు విచ్చి పోతున్నాయ్.

"బ్లాక్ మార్కెట్! బ్లాక్ మార్కెట్" అంత భయంలోనూ బాధలోనూ పిచ్చెక్కినట్టుగా అరిచాను.

"ఇంకా చూస్తావేం మారయ్యా! వీడు అల్లరిచేసి నలుగుర్నీ చేర్చి గొడవ చేసేట్టున్నాడు!" అవతారం మాట పూర్తికాక ముందే-"ష్చ్! చుప్! నోరుమూయ్ !" అంటూ మారయ్య చేతిలోని లాఠీ అటూ యిటూ వోసారి వూగి, గాల్లోకి లేచి గుండ్రంగా రెండు చుట్లు తిరిగి తిన్నగా వడుపుగా వచ్చేసింది—సూటిగా నా కుడికాలు మోకాలుపైకి.

"ఫట్! ఫట్ !"

"అమ్మో! నా మోకాలు!!" అన్న నా గావుకేకను లాకాలేజీ భవనం, హైకోర్టులైట్ స్థంభం ప్రతిధ్వనించాయ్.

తొలిగిపోయిన మోకాలును యీడ్చుకుంటూ వొంటికాలి కుంటిపరుగు లంకించుకున్నాను—

"మారయ్యా! అసలు వాళ్ళకు అల్సు యిచ్చినందుకు ముందు బుద్ధి తక్కువ మీది."

"నిజమే."

"అసలు వినయప్రవర్తనంటే—పోలీసులకు ప్రజలు వినయంగా వుండాలా? ప్రజలకు పోలీసులే వినయంగా వుండాలా?"

"నా అనుమానమూ అదే అవతారం !"

"అదేనోయ్ మారయ్యా! పోనీ, ఒక వారం మీరు వాళ్ళతో వినయంగావున్నారనుకో. మిగతా ఏభైయొక్క వారమూ—మూడొందల నలభైయెనిమిది రోజులూ, వాళ్ళు మీతో వినయంగా వుండొద్దూ!"

"నేననేదీ అదే అవతారం."

"చూడు! మారయ్యా! ఆ వొక్క వారం కూడా..."

"అదే నవతారం! ఆ వొక్క వారంలో కూడా—ప్రజలు పోలీసులపట్ల వినయంగా ప్రవర్తించటం నేర్పితే బాగుంటుందికదూ!"

"మా బాగా చెప్పావ్! అంతే! అంతే హహ్హహ"

"హ్హా! హ్హా!"

"ఇదిగో మారయ్యా! రిక్షా పెద్దబజారు దాటిందాకా కొంచెం నీవు వెంటవుండు."

"వూఁ పోనియ్‌రా"

—అంతవరకూ దూరంగా సన్నగా మోకాలిబాధలో వినిపిస్తూన్న వాళ్ళ సంభాషణ నాకు ఆ మలుపు తిరిగాక వినిపించలేదు.

'ఇంకా నయం! మారయ్య అంతవరకూ మంచివాడే—ఆ కొట్టిన రెండు దెబ్బలూ వొక మోకాలుమీదే కొట్టేడు. ఆ విసిరిన రెండూ రెండు మోకాళ్ళమీద విసిరితే యింకేమన్నా వుండేదేనా? అసలు యింటికెలా చేరేవాడ్ని ? ఆ పదమూడు మెట్లూ ఎలా ఎక్కేవాడిని.' యీ చిన్ని చిలిపి వూహకు మెదడు నవ్వుకుంటుంటే—అంతరాత్మ ఘోషించింది.

*   *   *   *

"ఒరే అబ్బాయ్! యిక లెగవరా!"

"అబ్బా! ఏం టమ్మమ్మా ?" మళ్ళీ ఏమొచ్చింది యీ ముసలమ్మకు యివ్వాళ అనుకుంటూ బాధగా నీరసంగా లేచి కూర్చున్నాను. ఖాళీ కుండల్ని చూపిస్తూ బిందె ఎదురుగా పెట్టి—"పనిపిల్ల—వాళ్ళయ్యను పోలీసోళ్ళు ఎందుకో లాక్కుపోయారని విని బిందె అక్కడ పారేసి పోయిందిరా !" అంది అమ్మమ్మ.

భారంగా వొళ్ళు విరుచుకుని లేచి నుంచోపోయేసరికి మోకాలు కలుక్కుమంది.

"అంజేంట్రా నాయనా! మోకాలంత లావున వాచింది !"

"వినయ ప్రవర్తన పరివర్తనే !"

అమ్మమ్మకు అర్థంకాలేదు. తాటికాయంత లావున వాచి వుబ్బిన నా మోకాలు నీళ్లబిందెకేసి జాలిగా మాసింది. అవ్యక్తమయిన మూగ బాధలో మునిగిపోయింది హృదయం. (అయిపోయింది)★

ఆశా చాపల్యాలు

ఎదురింటివాళ్ళ అల్లుడు వచ్చి హాల్లో కూచ్చున్నాడు. వీధి బళ్ళోంచి అప్పుడే వచ్చిన బామ్మరిది "పెళ్ళికూతురుగా రింకా ముస్తాబు కాలేదే!" అంటున్నాడు—చాటున దాక్కొని. ప్రక్కగదిలో ఆడవాళ్ళు పగలబడి నవ్వుతున్నారు వాడి సరసానికి. సమయానికి పౌడరు కూడా ఎదురుతిరిగింది. ఎంత తుడిచినా పొడలు పొడలుగా పెక్కిరిస్తూంది మరో సారి అద్దం దగ్గరకు వంగి కర్చీఫ్‌తో తుడుచుకుంటున్నాను. ఎదురింటి అల్లుడు—"ప్రొద్దు గూకుతూంది రావుగారూ" అన్నాడు విసుగ్గా. ఒకవైపున బయలుదేరుతూంటేనే యీ మనిషి యింత తొందర పంతాలేమిటా అని చికాకు వేసింది. దానికి తోడు ఆ బామ్మరిదిగాడు "ఇంకా కొక్కట్టుకోవడం కాలేదా వదినే" అన్నాడు. ఆ వధవాయిని పట్టుకుని చెవులు నులి

వుగా ఆ నేత్రాలను మూయబోతున్నాయ్; మిగిలిన నీలినలుపు భాగాల్లో సిగ్గు దొంతరలు ముసురుకుంటున్నాయ్.

ఇంతలో రెండు గాజులచేతులా కళ్ళను కప్పివేసినయ్. సూర్యోదయాన విచ్చుకుంటూన్న పద్మం అదృశ్యమయినట్లు మనస్సు గతుక్కుమంది. ఆ గాజులచేతులు నల్లగా గరుకుగా తుమ్మకొమ్మల్లా కనిపించాయ్. పానకం తాగబోతూంటే ఆముదం గిన్నె అడ్డువచ్చిన ట్లనిపించింది. ఆ చేతులమీద కోపంవచ్చి వెనుదిరిగి చూచాను. ప్రక్కగది కిటికీ కావల కృష్ణ వుంది. ఆ చేతులు మెల్లగా తీసింది. ఆ కళ్ళు ఆ క్షణంలో కమలాన్నీ, మంచు బిందువుల్నీ, ఇంద్రధనస్సునీ, లేడిగంతులనీ గుర్తుకు తెచ్చాయ్. నరనరాలనూ తాకి లాక్కుంటూన్న పిలుపు కనిపించిందా కళ్ళలో – ఆమె తుర్రుమంది. ఆడవాళ్ళు ఘక్కున నవ్వుతున్నారు. "ఇవ్వాళికి షికారు కళ్ళవా

కొక్కిరించినయ్. నా మతిమరుపుకు నాకే సిగ్గువేసింది.

*   *   *

తర్వాత అక్కడ వున్న రెండుగోజులూ ఆ కళ్ళ కోసం గాలించాను. ఎపుడూ అద్దం ముందు కూచ్చుని ఆ మధుర దృశ్యాలకోసం ఎంతో ఎదురుచూచాను. అవి కనిపించలేదు. పెళ్ళినాటి నుంచీ కృష్ణమీదగల కోపం యిక విజృంభించింది. తలిదండ్రులు చెప్పిపంపిన విషయాలు గుర్తుకొచ్చాయ్. ఆరోజున పెళ్ళిపోతున్నాను గనుక మామగార్ని అడగవలసిన నాలుగూ అడిగేస్తున్నాను.

మామగారు – "మే మేనాడూ మా అమ్మాయి రంభ అనిచెప్పలేదండీ...పైగా మీ అమ్మ, నాన్నగారూ చూచే లగ్నం పెట్టించారు గదా...ఇపుడిలా అంటే ఎలా చెప్పండి" అన్నారు. నాదగ్గరి విన యాలు పనికిరావు. నాకోపం ఆగింది

శ్రీ పోలవరపు శ్రీహరిరావు

మెయ్యాలనిపించింది. కళ్ళమీది జేబు గుడ్డను తొలగించేసరికి నా ముఖం నాకే కందగడ్డలా కనిపించింది కోపంతో.

"వస్తున్నానండీ" అంటూ యీవలికి తిరుగుతుండగా అద్దంలో ఏదో తళుక్కున మెరిసినట్లయింది. ఆ మెరుపు ఒకటి కాదు రెండనిపించింది. పెదవులో ఏదో యింద్రధనస్సులా మెదిలింది. ఆ మెరుపులేమిటో నని ఆగి అద్దంలోకి చూచాను. నిలువుటద్దంనిండా వున్న ఛాయలో రెండు కళ్ళుమాత్రం మురిపెంతో నిండి మెరుస్తున్నాయ్. తెల్లని విశాలనేత్రాల మధ్య నల్లని స్థలాల్లో ఆనందం నృత్యం చేస్తూంది. ఆ లాస్యం నాలో అంతవరకూగల భావాల అన్నింటినీ తుడిచివేశి; నిలబెట్టింది. నాకా కళ్ళు తప్ప మరేమీ కనుపించడం లేదు.

అంతలో ఆ కళ్ళలోని నృత్యం తడబడింది; రెప్పలు రెపరెపలాడినయ్. సినిమాలో దృశ్యం మారినంత వేగంగా మరో భావం గోచరించింది. వింత వలయంగా వంగిన కనురెప్పలు యింకా మురు

బావా!" అని బామ్మరిదిగాడు పిలిచేసరికి వళ్ళు జలదరించి స్పృహ వచ్చినట్లయింది. చకచకా బైటికి నడిచాను.

*   *   *

ఆ అల్లుడేదో చెబుతూనే వున్నాడు. నాకవేమీ అర్థం కావడంలేదు. పున్నమి చంద్రుడు రెండు బారలు పైకెక్కాడు. "ఇవ్వాళ మీ రేదో పరధ్యానంలో వున్నారు. ఏం జరిగిందండీ?" అని ఆదుర్దాగా నన్ను తడుతూ అడిగాడు ఆయన. "ఏమీ లేదండీ...ఏదో ఆలోచిస్తున్నాను" అంటూ లేచి వూళ్ళోకి దోవతీశాను.

ఇంటివద్ద స్నానం చేస్తున్నప్పుడుకూడా ఆ కళ్ళు నాతో మాట్లాడుతున్న ట్లనిపించింది. వాటి మాటలు అర్థం చేసుకుంటున్నాను. "మూడు బిందెలనీళ్ళు పోసుకుని యింకా లేవరేం భావగారూ" అని బామ్మరిది అంటూంటే మళ్ళీ వళ్ళు జలదరించింది. చెంబునెత్తి మీద గుమ్మరించుకున్నాను. అందులో నీళ్ళు లేవు...పెనకాల వంటింట్లోనుంచి ఆడవాళ్ళనవ్వులు

కాదు. ఎలా ఆపుకోగలను. అమ్మా నాన్నా పెళ్లికూతురు అందమైనదే అంటేయీ పెళ్ళికి వప్పుకున్నాను. ఈ విడగారు చూస్తే పేరుకు తగ్గంత నలుపూ, మొరటూను. ఆ పెళ్ళిపీటలమీదనే నాకు కంపరంపుట్టి లేచాను. అమ్మ కన్నీరూ, నాన్న కన్నెర్రలూ నన్ను నిస్సహాయుణ్ణి చేసి ఆమూడు ముళ్ళూ వేసేట్లు చేశాయ్. చివరికి కట్నం ఎవరిపేరున చదివించాలనే విషయంలోనూ; అంపకాల ఆనవాయి తీల దగ్గరా ఘర్షణలు తప్పలేదు.

అవును మరి! అలాటి తుమ్మమొద్దును కట్టుకుంటున్న నాపేరనే కట్నం చది

వించి, నా చేతికే యివ్వాలి గాని దాని పేర సెందుకో? "బంగారంలాంటి అల్లుడు దొరికితే—కట్నం అతని పేరనే చదివించక యిదేం పట్టుదలో—" అని నలుగురూ మామనే అన్నారు. అయినా ఆయన "ఎవరి పేర చదివించినా అతనిది కాక నాదవుతుందా? ఏ పొలమో పుట్రో కొని అతని పేరనే పెడతాలెండి" అని ఆరోజున సర్దుకున్నాడు.

కల్లబొల్లి కబుర్లు చెప్పి పబ్బం గడుపుకున్నాడే గాని—యింతవరకూ అలాంటి మాట నెగ్గించుకోలేదు. తగునమ్మ అంటూ పండక్కి నన్ను తోడుకొచ్చాడు. వచ్చేప్పుడే నాన్న ఘట్టిగా చెప్పాడు నాలుగూ దులపమనీ, లేకపోతే లోకువయి పోతావనీను. కాదు మరీ?! అందుకే మామ గారి మాటలు వింటే కోపం ఆగింది కాదు.

"చాలెండీ చెప్పొచ్చారూ, ఆ కట్నం సంగతి కూడా అల్లానే చేశేరుగా" అనేశాను—హేళనగా. ఆయన—"ఇంకా నెలన్నా తిరగలేదు, తొందరపడితే ఎలా బాబూ! మంచి భూమికోసం వెదుకుతున్నాను గాని—నే నా సొమ్ము కాజేస్తానా?" అన్నాడు. నేను "మీరంత సత్య హరిశ్చంద్రులూ—మా నాన్నేమో కాజేసే వాడూనా ఏమిటి? ఆయనకే యిస్తే యీ పాటికేదో ఒకటి కొనేశేవాడుగా?" అని నిలదీశాను.

మామగారు—"నేనంటే ఒకే కూతురు గలవాణ్ణి! మీ నాన్నగారి కేమో యింకా పెరిగి పెద్దవాళ్లు కావలసినవాళ్లున్నారా? మీ కిచ్చిన డబ్బులో ఏ అవసరానికో కొంత ఖర్చయితే మళ్లీ మనలో మనకి తగూలొస్తాయ్. అందుకని జాగ్రత చేశాను... నే నేదిచేసినా మీ మేలు కోసమేగదా..." అంటూంటే నాకు వళ్లు మండింది. మా నాన్న నేదో నెప పెట్టబోతే నా కెలాగుంటుంది మరీ?! కుర్చీలోంచి లేచి గదిలోకి వెళ్లి పై పంచె వేసుకుంటూ—"మీ రెన్నయినా చెప్పండి—నా కట్నం నాకిలా యిస్తేనే గాని, నే నిక్కడో క్షణమైనా వుండను" అన్నాను.

మామగారుకూడా గదిలోకి వచ్చి గుమ్మం దగ్గర నుంచుని - "అంత కోపమయితే ఎలాగునయ్యా - కాస్త ఆలోచించు" అన్నాడు. నేను అద్దందగ్గర కెళ్ళి తల దువ్వుకునేందుకు దువ్వెన ఎత్తాను. నా చేతిలోని దువ్వెన ఛాయకూ, రేగిన తలఛాయకూ మధ్య ఏదో అగాధం ఏర్పడింది. కృష్ణ ముద్దుముఖం అక్కడుంది. ఆముఖం చూడగానే నాకు "కోతిముఖాన్ని అంటగట్టి..." అని అనబుద్ధయింది. నోరు తెరిచాను. ఆమాట అనకముందే ఆ విశాల నేత్రాలు కనిపించాయ్. వాటిలో లోగడ కనిపించిన లాస్యంలేదు. ఏదో అదృశ్య శక్తి ఆ కనురెప్పలను వెనక్కు విరచిపట్టుకున్నట్లు అలానే వుండిపోయాయ్. తెల్లదనంమీద మంచుబిందువులు వుండీ లేనట్లుగా చలిస్తున్నాయ్. నల్లగుడ్లు కొంచెంగా కదులుతూ క్వొశ్చన్ మార్కు లవుతున్నాయ్.

మామగారు "బుద్ధిమంతుడవు, చదువుకున్నవాడవు గదా అని ఏరికోరి నిన్ను తెచ్చుకున్నాం బాబూ - నువ్విలా-" అని ఏదో అనబోతున్నాడు. ఆయనిక ఏమనబోతాడో నాకంత మాత్రం తెలియదా. తెలిశే - "అయితే యిప్పుడు నా చెడ్డతనం ఏం తెలిసిందీ? మీ అమ్మాయిని విరగడ చేసింది గాక యీ మాటలుకూడా పడతామనుకున్నావా?" అనేశాను. ఇక వెళ్లిపోవలసిందే. క్షణంకూడా వుండరాదు. తల చకచకా దువ్వుకుంటున్నాను... ఆ కళ్లు యింకా దగ్గరగా కనిపించాయ్. నలుపు కనుభాగాలు ఆ కొననుంచి యీ కొనకూ, యీ కొననుంచి ఆ కొనకూ పరుగెడుతున్నాయ్. కిందికీ మీదికీ వూగుతున్నాయ్. కనురెప్పలు కొంచెంగా అదురుతూ తల యిటునటు వూపినట్లు ఆదేశిస్తున్నాయ్.

మామగారు "ఏం...అందం తక్కువయినందుకేగా ఏ ఆస్తీ, వుద్యోగమూ లేకపోయినా నీకు పదివేల కట్నమూ పోసిందీ. నేనుగాక ఎవరయితే మీ కింత కట్నం యిస్తారయ్యా" అన్నాడు. నాన్న చెప్పినట్లే యీయనకి డబ్బు గలదు గదా అని మదం. ఇంత గర్వం గల యీయనకి యిప్పుడు నేను లొంగితే యిక పరువు దక్కదు. ఎలాగయినా నా వ్యక్తి గౌరవం నేను రక్షించుకోకపోతే ఎలాగు? అందుకనే-ఓస్. మీ కట్నమెంత, మీ కూతు

(22-వ పేజీ చూడండి)

కొత్తల్లుడు

శ్రీ విప్పర్ల వీర్రాజు

సుందరం మను గుడుపుకు అత్తవారింటికి వెళ్లి అప్పుడే వచ్చాడు. వచ్చి రావడంతోనే యశోదమ్మ చేటంత ముఖం చేసుకుని నవ్వుతూ "మీ అత్తారు ఏమిచ్చారు?" అంది. "పాతిక రూపాయలు" అన్నాడు. "ఏమిటి? ఎంత? నిజంగానే?" అంది.

"నిజమే"

"అదేమిట్రా!" అంది ఆశ్చర్యంతో చూస్తూ.

"ఏం?"

"అవ్వ" అని చేతితో నోరు నొక్కుకుని "పాతికేమిటి? ఎవరైనా వింటే నవ్వరూ!"

"ఎందుకు?"

"ఎందుకా? మను గుడుపుకు తీసుకెళ్లిన మాంగారు పాతిక రూపాయలు చేతిలో పెట్టిపంపిస్తాడా! నువ్వెలా పుచ్చుకున్నావు? పొలం దున్నుకునే మీబావ సైతం అప్పుడు మీనాన్న చేత మూడు వందలు పెట్టి సైకిలు కొనిపించలేదూ! తర్వాత కొంటామంటే ఊరుకున్నాడా! అటువంటిది నీకు పాతిక రూపాయలిస్తాడా! ఆమాత్రం నీకు తెలియక్కర్లేదూ. ఒకళ్ళను చూచయినా నేర్చుకోవాలి..." యశోదమ్మ ఇంకా ఏమిట్లో అంటూనే ఉంది. సుందరం కాళ్ళు కడుక్కోడానికి నూతి దగ్గరకు వెళ్లాడు.

సుందరం భోజనం చేసేటప్పుడు మళ్లీ అంది "అసలు ఆ పాతిక ఎందుకని పుచ్చుకున్నావు" అని. కాని సుందరం మాత్రం సమాధానం చెప్పలేదు. ఏమైనా అంటే అమ్మ తన అత్తవారినీ తననూ కలిపి ఇంకా ఆడిపోస్తుందని తెలుసు. అంచేత కిక్కురుమనకుండా భోజనంచేసి గదిలోకిపోయి పడుకున్నాడు.

సుందరానికిప్పుడు అర్థమయిందేమిటంటే అత్తవారెంతిచ్చినా ఇంకా పేచీపెట్టి కొంచెమైనా ఎక్కువ పుచ్చుకోవాలి. అలా గివ్వకపోతే కోపగించాలి. లేకపోతే కొత్తల్లుడెలా అవుతాడు! అంటే ఇప్పుడు తను బావలా కనీసం ఒక సైకిలన్నా కొనిపించవలసింది. సైకిలేం ఖర్మం! ఏ యెనిమిది వందలో పెట్టి జీవితకాలం ఉండే వాచీ అత్తవారిచేత కొనిపించాలనుకున్నాడు సుందరం. పెళ్లయిన తర్వాత అత్తవారింటిదగ్గర ఎలా మసలుకోవాలో, వాళ్ళను ఎలా పీల్చి పిప్పిచేయాలో—ఈ థియరీ అంతా సుందరం తన బావదగ్గర్నుంచే నేర్చుకున్నాడు. ప్రతిపండగకు తనను తీసుకెళ్ళడానికి అత్తవారింటిదగ్గర్నుండి ఎవరో ఒకరు వస్తారు. బావకూడ అంతేగా. సంక్రాంతి పండగకు రమ్మని ఉత్తరం వ్రాస్తే ఎవరూ వచ్చి తీసుకెళ్ళలేదని అలిగికూర్చుంటే అప్పుడు నాన్న పురమాయింపుమీద సుందరమే వెళ్లి తీసుకొచ్చాడు. బావ ఉన్నన్నాళ్లూ ఎంతో నాగరికత తెలిసిన పెద్దమనిషిలా, జమీందారులా ఉండేవాడు. సుందరం కూడ బావతో సినీమాల కెళుతూ, హాస్యాలాడుతూ సరదాగానే గడిపేవాడు. కాని ఎటొచ్చీ బావ వెళ్లేటప్పుడు వచ్చేది గొడవ. నాన్న ఏవో కొత్తబట్టలు తెచ్చి కట్టుకోమంటే కట్టుకోడం మాని వచ్చినప్పుడల్లా వందలు తెమ్మనేవాడు. అప్పుడే సుందరం కుడిచేయి బలం కొద్దీ బావ దవడ దగ్గరకు పోతాననేది. ప్రతి పండగకు నాన్న ఎక్కడ నుండి తెస్తాడు వందలు. చెల్లెలు పెళ్లి చేయకముందు నాన్న ఎప్పుడూ ఎవరిదగ్గర నుండీ దమ్మిడీ అప్పుకూడ తేలేదు. బంగారంలాంటి ఆ నాలుగెకరాల భూమి చేస్తూ, తనని చదివిస్తూ కొంత వెనకేశాడు కూడ. కాని చెల్లెలు పెళ్లికి కట్నానికని మూడువేలుదాకా అప్పు చేయవలసి వచ్చింది. ఎంతదగ్గర లేకపోయినా నాన్న ఎప్పుడూ బావను కోపగించి పోనీయలేదు. బావ వచ్చినప్పుడల్లా ఎవళ్లనో దేవురించి అప్పు తెచ్చి యిచ్చేవాడు. ఒక్కొక్కసారి ఎక్కడా అప్పు పుట్టకపోతే నాన్న ఎంతగా బాధపడేవాడో తనకు తెలుసు. అందులోనూ నాన్న ముందెప్పుడూ కూడ అప్పు తెచ్చి యెరుగడు. నాన్న ఎంత బాధపడేవాడో బావకేం తెలుసు. బావమీద సుందరానికి బోనులోని పులికి వచ్చినంతకోపం వచ్చేది.

సుందరానికి ఎప్పుడు నిద్రపట్టిందో, సాయంకాలం లేచేటప్పటికి యశోదమ్మ పొరుగింటి శాంతమ్మతో మాట్లాడుతుంది "అది కాదు శాంతమ్మొదినా ఎంతలేకపోయినా మనుగుడుపుకు తీసుకెళ్లి పాతికరూపాయలిస్తారా!"

"తక్కువే అనుకో. అయినా సమయానికి చేతిలో ఉండొద్దూ" అంది శాంతమ్మ.

"చేతిలో లేకపోతే మాత్రం, మా అల్లుడికి అప్పుజేసి మూడు వందలు పెట్టి సైకిలు కొనివ్వలేదూ? వెధవ పాతిక రూపాయలూ ముఖాన్ని కొట్టి రావడం మాని తీసుకొచ్చాడు. ఎవరైనా వింటే నవ్వుతారు"

"నవ్వడమెందుకొదినా! ఏదో ఎవరి శక్తికొలదీ వారు"

"అంత లేకుండా చస్తున్నారేమిటి? లేకపోతే మాత్రం అప్పో సప్పో చేసి పెట్టొద్దూ. ఇప్పుడు పెట్టకపోతే ఇంకెప్పుడూ? అసలు ఈ సంబంధం వద్దనుకుంటూనే చేసుకున్నామొదినా. ఖర్మ అలా తిప్పింది ఏం చేస్తాం. నోరు మూసుకుని ఊరుకోవాలి. అయినా శాంతమ్మొదినా మావాడిదంతా అదో పెద్ద మనిషి తరహాలే!......"

ఈ నిప్పు అప్పుడే చల్లారేటట్లు కనబడలేదు సుందరానికి. గబగబా ముఖం కడుక్కుని కాఫీ త్రాగకుండానే బయటికి నడిచాడు. ఏం పని లేకపోయినా రాత్రి ఎనిమిదిగంటలవరకు ఊళ్ళో అక్కడక్కడ తిరిగాడు. సుంద

రానిక్కి ఇంటికి వెళ్ళ బుద్ధికాలేదు. ఆవిషయంగురించి అన్నిసార్లు తలపెట్టకుండా ఒకసారి చేతికొద్దీ కొట్టి, నోటికొద్దీ తిట్టి ఊరుకున్నా బాగుండే దనిపించింది. ఇల్లంటే నల్లుల మంచంలా కనపడుతుందిప్పుడు సుందరానికి.

సుందరం ఇంటికి వచ్చేటప్పటికీ కూడ యశోదమ్మ అదే ధోరణిలో ఉంది. చిలకలపూడి వారి కోడలుతో మాట్లాడుతుంది." బాగా నే వెనకేసుకు వస్తున్నావుగాని లక్ష్మీ! మీ ఆయనకు, మీ నాన్న, రెండొందలు పెట్టి వాచీ కొనిచ్చారా? మా సుందరంకంటె మీ ఆయన తక్కువ చదివాడా? ఆ లెక్కని మావాడికెం తీయాలంటావు?"

"అవును పిన్నిగారు. ముందు మానాన్న కూడ యాభై ఇవ్వబోతే ఆయన పేచీపెట్టి వాచీ కొనిపించారు"

"అవునంటావా, మాసుందరం, ఇచ్చిన పాతికరూపాయలు మాట్లాడకుండా తెచ్చుకున్నాడు. పాతికంటే ఎవరైనా నవ్వుతారు. కిక్కురు మనకుండా ఊరుకోవాలి. మాసుందరానికి ఒకళ్ళను కష్టపెట్టడం అంటే ఇష్టముండదు. చిన్నప్పటినుండీ వాడు అంతేలే!......"

సుందరం రావడం చూచి లక్ష్మి లేడిలా గెంతుకుంటూ పోయింది. "కాఫీత్రాగకుండా వెళ్ళావేం?" అంది యశోదమ్మ. "ఏం లేదు" అన్నాడు సుందరం. తల్లిదగ్గర రెండురోజులవరకు కొంచెం ముభావంగా ఉండడం మంచిదనుకున్నాడు. ఈ సంగతి యశోదమ్మగారే చెప్పింది భర్తతో. కాని ఆయన సుందరాన్ని "పాతికేనట్రా?" అని కూడ అడుగలేదు. యశోదమ్మ భర్త మాట్లాడక పోయేసరికి ఆయనమీద పడింది "ఒకరి కొకరు ఏం తీసిపోరు"అని, తన కొడుక్కి అత్తవారు ఇంత ఇచ్చారు అంత యిచ్చారు అని గొప్పగా అందరితోనూ చెబుదామనుకున్న యశోదమ్మకు చాలకష్టంగానే ఉంది.

ఒక వారం రోజులకు సుందరం రిజల్టున్న వచ్చాయి. "సుందరం. *B. A.*" అన్నమాట ఇప్పుడు. సుందరానికంటె యశోదమ్మ ఎక్కువగా సంతోషించింది యీ వార్తవిని. అసలు సుందరానికి పాసయ్యానన్న సంతోషమే లేదు. అసలయిన పరీక్షముందే ఉన్న దనిపించింది. ఆపరీక్షరాయడానికి ఓ దస్తాకాగితాలు ఖుడ్డిసిరా జాగ్రత్తపెట్టా లనుకున్నాడు.

రోజు లిట్టే గడిచాయి. దీపావళి వచ్చింది. వెంకట్రామయ్య గారు - అంటే సుందరం మామగారు - దీపావళికి రమ్మని ఉత్తరం వ్రాసేరు. సుందరం తల్లితో చెప్పాడు. ఆమె నిర్ఘాంతపోయి "ఏమిటి? ఉత్తరం వ్రాశాడా? తిండిలేక వస్తాడనుకున్నారా! ఏమైనా సరే వెళ్లకు" అంది.

"నాకు భయమేమిటి?" అన్నాడు సుందరం.

"బావకు భయమనే పోయి తీసుకొచ్చే వాడివా?"

"మళ్ళీ వాళ్ళకు అనవసరంగా శ్రమా, ఖర్చూ ఎందుకని"

"ఖర్చూ శ్రమా ఏమిటి. కొత్తల్లుణ్ణి ఎలా చూడాలి. అయినా తీసుకెళ్ళి పాతికా పరకా చేతిలో పెట్టడానికే నేమిటి?"

"వాళ్లు ఎంతి స్తేమాత్రం ఏమవుతుంది."

"అంతా ఇంతా అని కాదు. ముద్దూ ముచ్చటా లేదూ?"

"ఉన్నంతలోనే చెల్లించుకుంటారు ముద్దూ ముచ్చటా. కాని ఆకాశంమీద కూర్చుంటే వాళ్ళుమాత్రం, ఎక్కడనుండి తెస్తారు? అయినా కొత్తబట్టలు కట్టబెట్టడం ఆచారంకాని డబ్బివ్వమని ఎక్కడా లేదు.

"అందరూ వెర్రివాళ్ళయి అల్లుళ్ళకిస్తున్నారు కాబోలు. అయినా వెళ్ళకు. ఎవరికోసం వస్తారో చూస్తాను" అంది యశోదమ్మ. ఈ సమాచారం విని నాన్న మాత్రం వెళ్ళమన్నాడు. తల్లి కిష్టంలేదని సుందరం మనస్సు పీకుతూనే ఉంది. చివరకు "నే వెళ్ళను" అన్నాడు. సుందరం



ఇలా అన్నప్పటినుండి యశోదమ్మ సుందరాన్ని అత్తవారింటికి వెళ్ళమని బలవంతం చేసింది. అతను ప్రయాణమయ్యేవరకూ ఊరుకోలేదు. కాని వెళ్లేటప్పుడు మరీ మరీ చెప్పింది "పాతికా పరకా ఇస్తే ముఖం మీద కొట్టి మరీ రా" అని.

అత్తవారింటిదగ్గర సుందరం అడుగులకు మడుగులొత్తేవారు. అన్నీ కూర్చున్న చోటికే వచ్చేవి. జమీందారులా ఉండేది. కాని సుందరంమాత్రం ఇంటిదగ్గరలా సుఖంగా, సంతోషంగా ఉండలేక పోయేవాడు. అత్తవారు తనని "జలగ"లా చూస్తున్నారేమోనని అతని అభిప్రాయం. ఏమంటే అతను తన బావను అలాగే చూచేవాడు. సుందరం బావకూడ ముందు బాగానే ఉండేవాడు. కానీ ఉండేకొలదీ "జలగ గుణం" ఎక్కువై, చివరకు వెళ్ళే రోజుకు పూర్తిగా జలగై కూర్చునేవాడు. అలాగని అతనిని పైకి ఎవరూ ఏవగించుకొనేవారు కారు. అందరిమాటా ఎలా గున్నా సుందరంమాత్రం లోలోపల అతన్ని తిట్టుకునేవాడు. పైకిమాత్రం అందరూ బావను చాల గౌరవించేవారు. అలాంటి గౌరవమే తనకూ లభిస్తుందనుకున్నాడు సుందరం.

ఆ రోజున సుందరం గదిలో పడుకున్నాడు. ఇంకా నిద్రపట్టలేదు. సుందరం భార్య శారద బయటికి అమ్మవచ్చిన బెంగుళూరు సిల్కుచీరలు బేరం చేస్తుంది. "ఈ చీర కొనుక్కోనా, నలభైరూపాయలట" అంది శారద.

"ఇప్పుడు డబ్బులేదమ్మా తర్వాత కొనుక్కోవచ్చులే" అన్నారు వెంకట్రామయ్యగారు.

"మరి దీపావళికి కొనవేమిటి?"

"ఎల్లుండి కొనవచ్చులే. బజారులో తెస్తాను. ఇప్పుడు డబ్బులేదన్నానా"

"అసలు నీ దగ్గర డబ్బెప్పుడుంటుంది."

"డబ్బుంటేమాత్రం కొనాలని ఎక్కడైనా ఉందా?" కొనడు ఏంచేస్తావు అంటూ పరుగెత్తుకు వచ్చాడు రామారావు శారద అన్నయ్య.

"అయ్యో! నిన్నే కొనమంటున్నాను. నువ్వైతే మరీ కొంటావు" అంది శారద మూతి తిప్పుకుంటూ.

"లేకపోతే డబ్బులేదంటూంటే ఏమిటది?"

"ఇప్పుడు కొనకపోతే ఇంక తర్వాత కొంటారు కాబోలు పాపం" అంది శారద తల ఎగురవేస్తూ.

"అసలు మేమెందుకు కొనాలి? అంత కట్నం తీసుకున్నాడు కావలిస్తే బావనే కొనమను. లేకపోతే డబ్బు అడిగి తీసుకురా కొంటాను."

"ఏమిట్రా అది" అన్నారు వెంకట్రామయ్యగారు.

"వినబడుతుంది" అంది శారద తల్లి మెల్లగా.

"వినబడాలనే అంటూంట. గోడచెందుకు బావతోనే చెబుతాలే కొనమని" అంటూ సుందరంఉన్న గదిలోకి వచ్చాడు రామారావు. "డబ్బేమైనా తెచ్చారేమో శారదకు చీరలంట కొనండి. లేకపోతే తొందరగా తీసుకుపొండి. మమ్మల్ని చీరలుకొనమని చంపేస్తుంది" అన్నాడు. సుందరం నవ్వి ఊరుకున్నాడు.

"మాడవే అమ్మా వెధవగోల" అంది శారద.

"వాడు అనడం బాగానే ఉంది, నువ్వు ఉడికిపోడం బాగానే ఉంది."

"కొంటాడటలే చెప్పాను" అన్నాడు రామారావు శారదతో.

"పోదూ బాబూ, నీవేం కొనక్కర్లేదు" అంది శారద ఉడుకుబోతుతనంతో పుట్టిన కోపంలో గట్టిగా.

రామారావు వెటకారంగాఅన్నా అతని మీద అపరిమితమైన కోపం పుట్టుకొచ్చింది శారదకు. రాత్రి సుందరంతో అంది" మొన్నటిలా పాతిక రూపాయలిస్తే పుచ్చుకోకండి" అని.

"ఏం?" అన్నాడు సుందరం.

"ఏం" ఏమిటి? వెటకారానికి అన్నయ్య పాతికిస్తే మాట్లాడకుండా జేబులో పెట్టుకున్నారు. నాన్నతో తర్వాత చెప్పాడు అన్నయ్య. అసలు నూటయాభై ఇచ్చి వెళ్లాడు నాన్న. బాగా మిగిలించాడు పెట్టుబడికి అప్పుతేవాలను కున్నాను అని అప్పుడే పులుసులో వేశాడు నాన్న."

"పోనీలే"

"అందుకే మంచి అల్లుడు దొరికాడు అని సంతోషిస్తున్నాడు నాన్న"

"ఇవ్వదలచుకొంటే ఇప్పుడిస్తారు"

"ఊరుకుంటే ఇంకా ఇస్తారు"

"ఊరుకోపోడానికి ఏమైనా దాచపెట్టానా?"

"వచ్చేటప్పుడు దాచపెట్టాలా? మీకంత ఎక్కువైతే పుచ్చుకుని నాకివ్వండి" అంది శారద

"అలాగా" అని సుందరం శారదను దగ్గరకు తీసుకున్నాడు.

దీపావళి వెళ్లిన మర్నాడు సుందరం ఇంటికి వెడతానన్నాడు వెంకట్రామయ్యగారితో. "అంత కంగారేం? రేపు వెళ్ళవచ్చు" అన్నాడు. సుందరం ఆ రోజుకు ఉండిపోయాడు. మర్నాడు సాయంకాలం బండికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాడు. మధ్యాహ్నం శారద కాఫీ ఇచ్చేటప్పుడు చెప్పింది "డబ్బు ఎక్కడా దొరకలేదట. ఇవాళ కూడ వెళ్లనివ్వడు నాన్న మిమ్మల్ని" అని.

"డబ్బేమిటి?" అని అడిగాడు.

"మీకివ్వడానికట. మొన్నగూడ తక్కువిచ్చాం కనీసం వందయినా దొరుకుతే బాగుండునని తిరుగుతున్నాడు. అంచేత ఇవాల్టికి కూడ మిమ్మల్ని ఉండమంటూన్నాడు"

"సాయంకాలం వెళ్లాలి"

"వెళ్లి చేసే దేముంది? రెండు రోజులుండొచ్చు పరవాలేదు" అంది శారద కాఫీగ్లాసు తీసుకెడుతూ వెనక్కి చూచి.

వెంకట్రామయ్యగారు "నే వెడతాను" అని సుందరం చెప్పినమీదట "వెళ్ళవచ్చు ఇంటి దగ్గర మాత్రం తీరుబడేగా" అని వెళ్ళిపోయారు. సుందరం తప్పకుండా వెడతానని చెప్పలేకపోయాడు. తనకు ఏదో డబ్బు ఇవ్వడానికి వెంకట్రామయ్యగారు నానా కష్టాలు పడుతున్నారు. సుందరం చెప్పకుండా వెడదామనుకున్నాడు. కాని వెంకట్రామయ్యగారు ఏమనుకుంటారో అని మానేశాడు.

మూడోరోజు సుందరం ప్రయాణమయ్యేసరికి వెంకట్రామయ్యగారు వంద రూపాయల నోటు చేతిలో పెట్టి "బట్టలు కుట్టించుకో" అన్నారు. అల్లుడికి అన్యాయం చేసినట్లు భావించారు వెంకట్రామయ్యగారు. వంద రూపాయలు చాల తక్కువలా అనిపించింది. వెళ్ళేటప్పుడు అల్లుడితో మామూలుగా మాట్లాడలేక పోయాడు.

వెంకట్రామయ్యగారి ముఖం చూచేటప్పటి సుందరానికి గుండె బేజారెత్తింది. "ఈ వందరూపాయలకోసం నే నెంత కష్టపడ్డానో, ఎంతమంది కాళ్లు పట్టుకున్నానో తెలుసునా. నన్ను ఇంత కష్టపెట్టి నీవు సంతోషిస్తున్నావు" అనే భావాలు కనపడ్డాయి సుందరానికి మామగారి ముఖంలో. నిజానికి వెంకట్రామయ్యగారు అలా అనుకోలేదు. సుందరం ఆ డబ్బు సంతోషంతో తీసుకుంటే అదే పదివే లనుకున్నాడు.

సుందరం తల్లిని సంతోషపెట్టడానికి కాగితం మడిచి జేబులో పెట్టుకున్నాడు. వెంకట్రామయ్యగారి రక్తం పిండుకొస్తున్నట్లు తోచింది సుందరానికి. "వెడతాను" అని స్పష్టంగా చెప్పలేకపోయేడు. ఎలాగో ఒణికే గొంతుకతో చెప్పి బయలుదేరాడు. అల్లుడివాలకం చూచి "సంతోషించలేదు" అనుకుని వెంకట్రామయ్యగారు నిట్టూర్చివరండాలోని మంచంమీద కూలబడ్డారు.

ఇంటిదగ్గర అమ్మ మళ్ళీ అడిగితే వంద రూపాయలనోటు, గిరవాటు వేద్దామనుకున్నాడు. కాని యశోదమ్మ ఏమీ అడగలేదు. ఆమెకు ధైర్యముంది ఈసారి పాతికో పరకో ఇస్తే సుందరం ఎలాగూ పుచ్చుకోడు అని. సుందరానికి మాత్రం ఆనోటు చాల బరువుగా తోస్తుంది. అమ్మ ఎప్పుడు అడుగుతుందా ఎప్పుడు విసిరి కొడదామా అని చూస్తున్నాడు.

చివరకు రాత్రి అడిగింది యశోదమ్మ. "వందరూపాయ లిచ్చారు" అన్నాడు. నోటు విసిరి కొట్టలేకపోయాడు. చివరకు కోపంగా కూడ అన లేకపోయాడు. మామూలు ధోరణిలోనే అన్నాడు.

"అంతే! ఏ వాచీ అయినా కొనిపించుకోలేక పోయావా?" అంది యశోదమ్మ. "వాచీ లేదు ఏమీ లేదు పోనిద్దూ" అన్నాడు. కొంచెం విసుగ్గానే.

కొడుకు విసుగుదలను కనిపెట్టి యశోదమ్మ ఏమీ అనలేదు. సుందరానికి మాత్రం ఆనోటు ఏంచేయాలో తెలియడంలేదు. ఆనోటు తనది కాదని తన అంతరాత్మ చెబుతోంది. దానిమీద వెంకట్రామయ్యగారి రక్తపు చుక్కలు కనపడుతున్నాయి. తిరిగి ఇచ్చి వేద్దామనుకున్నాడు. కాని ఏవిధంగా ఇవ్వాలి? వెధవది పెళ్ళయింతర్వాత ఇన్ని గొడవలున్నవని ముందు తెలియలేదు సుందరానికి.

సుందరానికి అనుకోకుండానే ఒక పుగాకు ఫ్యాక్టరీలో ఉద్యోగం దొరికింది. ఎంతరికమండేషన్ ఉన్నా బి. ఏ, పాసయింతర్వాత కనీసం రెండేళ్ళయినా ఉద్యోగంకోసం తిరగా లనుకున్నాడు. కాని వెంటనే దొరికింది. రెండు నెలలు చేసిన తర్వాత ఖాయం చేస్తారు. ఇప్పుడు అన్నీ కలుపుకుని వంద చిల్లరవచ్చినా ముందు ముందు పెరిగే అవకాశాలున్నాయి. పరీక్ష పాసయినంతగా సంతోషించాడు సుందరం. తను హాయిగా కృష్ణా, రామా! అనుకుంటూ కాలక్షేపం చేయవచ్చుగదా అని సుందరం తండ్రి మురిసిపోయాడు.

కాలచక్రం రాపిడికి కేలండరులో ఒక కాగితం రాలిపోయింది. ఆమర్నాడు సుముహూర్తం. శారద అత్తవారింటికి వస్తుంది. యశోదమ్మ ఇల్లంతా కడిగివెల్ల వేయించింది. సుందరంకూడ చాల సంతోషంగానే ఉన్నాడు. కాని ఆ ఆనందం పైకి కనపడనీయకుండా శారద రావడం ఓమామూలు విషయంలా భావిస్తున్నట్లు కనపడాలని అతని ఊహ. అది కొంచెం జాగ్రత్తగానే పరిశీలించాలి. లేకపోతే తెలియదు.

శారద దిగడంతోనే గడప అవతల నిలబెట్టి దిష్టి తీసి లోపలికి తీసుకొచ్చింది. పెద్దాపురం సిల్కు చీరకట్టుకొంది. నీలం రంగు టాకెట్టు. సన్నగా పెట్టుకున్న కాటుక సుందరానికి శారదచాల అందంగా కనపడుతుంది. యశోదమ్మ ఇరుగువాళ్ళనూ పొరుగువాళ్ళనూ అందరినీ ఓసారి పిలిచి వచ్చింది కోడలిని చూడ్డానికి. అందరూ చూడ్డానికి వచ్చేసరికి శారదకు అదోకలా ఉంది. అందరికళ్ళూ తనమీద ఉన్నప్పుడు ఎలా కదిలినా గొడవే. అందులోనూ యశో

దమ్మ "పమిట అలా వేసుకున్నావేం? గొలుసు ఇలా వేసుకోవాలి, ఈ గాజు లెప్పుడు చేయించుకున్నావు. మధ్య నీలం గాజులుంటే బాగుండేవి," అంటూ సర్దడం మొదలెట్టేసరికి శారదకు చాల సిగ్గేసింది.

యశోదమ్మ అప్పటితో ఊరుకోలేదు. శారద తెచ్చిన సామానంతా పరీక్షించి శారదదగ్గరే, చూడ్డానికివచ్చిన ఆడపడుచులు ఉండగానే "అవి తక్కువ ఇవి మంచివి కావు" అని వియ్యాలవారిని ఏవేవో అంది. శారద చిన్నబుచ్చుకుంది. గదిలోంచి వింటున్న సుందరానికి శారదకంటె కష్టం వేసింది, పాపం తన భార్య ఎంత చిన్నబుచ్చుకుంటుందో అని.

గదిలో శారదను బుజ్జగిస్తూ అన్నాడు సుందరం "అమ్మ అలా అందని చిన్నబుచ్చుకోకు, మనకోసమే." శారదమాత్రం ఏమీ అనలేదు. "నీవుమాత్రం దెబ్బలాడలేదూ మీ అన్నయ్యతో చీరకోసం? మీ ఆడవాళ్ళంతా అంతేలే" అన్నాడు. శారద పలక్కుండా భర్త ఒళ్ళో వాలింది.

శారద రావడం, ఉద్యోగం దొరకడం అన్నీ జరిగేసరికి సుందరం "నేనుకూడ ఒక సంసారి నయ్యాను" అనుకున్నాడు. సంసార సాగరం కష్టాలమయం అంటారు. సుందరానికి అవి ఏమీ కనపడ్డంలేదు. అంతా మానవుల నడవడిలో ఉంటుంది, కష్టం సుఖం కలిగించుకోడం అనుకున్నాడు. అసలు సంసారం అంటే ఇంతే కాదన్న సంగతి సుందరానికి తెలియలేదు. అది అతని తప్పుకాదు.

ఈ ఆనందం ఓ నెలరోజులుకూడా ఉండనీయకుండా హటాత్తుగా రామారావు ప్రత్యక్షమయ్యాడు. అతన్నిచూచి శారద ఉప్పొంగిపోయింది. ఆమెకు పుట్టింటి నుండి వచ్చి 25 రోజులే అయినా ఇరవై ఐదు నెలల్లాగు కనపడింది. సుందరానికి మాత్రం రామారావుమీద కొంచెం చిరుకోపం వచ్చింది.

శారదతోపాటు సంక్రాంతి పండక్కి సుందరాన్నికూడ రమ్మన్నాడు రామారావు. యశోదమ్మకూడ వెళ్ళమంది. పండగ ఇంకా వారంరోజులుంటే అప్పుడే వెళ్ళడ మెందుకు? అనుకుని సుందరం తర్వాత వస్తానన్నాడు. శారదను స్టేషను వరకూ దిగబెట్టిరావడానికి వెళ్ళాడు. శారదకు ఇంటికి వెడుతున్నాననే సంతోషంలో భర్త జ్ఞాపకంలేదు. సుందరందగ్గరున్నాన్నే ఇంటిదగ్గరి సంగతులు ఎన్నో అడిగేది. ట్రయిను కదిలింతర్వాత కళ్ళపడినంత వరకు కిటికీలోంచి తనను చూస్తుందను కున్నాడు సుందరం. కాని శారద అలా చేయలేదు. సుందరం నిరుత్సాహపడ్డాడు.

సుందరం సంక్రాంతికి అత్తవారింటికెళ్ళాడు. అక్కడుండగానే వెంకట్రామయ్యగారికి రిజష్టరు నోటీసు అందింది. రమణయ్య దగ్గర్నుండి బాకీ రెండువేలు చిల్లరా వారంరోజులలో ఇవ్వాలని. వెంకట్రామయ్యగారు ఎక్కడెక్కడ, ఎవరెవరిని దేవురించాలో అందరినీ దేవురించారు డబ్బుకోసం. నూటికి నెలకు రూపాయిన్నర వడ్డీకి కూడ అప్పుపుట్టలేదు. చివరకు రమణయ్యను కూడ బతిమాలుకున్నాడు "వడ్డీకి కూడా వడ్డీ ఇస్తానని, వచ్చే సంవత్సరం తీర్చుకుంటాననీను! కాని ఆయన వప్పుకోలేదు.

సుందరం అనుకున్నాడు వెంకట్రామయ్యగారు తనను డబ్బుఅడుగుతారు అని. సుందరానికి కట్నం ఇచ్చిన నాలుగువేలలో వెయ్యి ఖర్చయిపోయినా మూడువేలు బ్యాంకులో వేశాడు. అడిగితే అవి తెచ్చియిద్దామనుకున్నాడు. వెంకట్రామయ్యగారైనా కొత్తగా రెండెకరాల పొలం కొన్నందువల్ల అప్పుచేశాడు కాని ఏమీ దూబరా ఖర్చుచేసికాదు. ముందు ఏడెకరాలుంది. మొత్తంమీద మళ్ళీ యిచ్చేస్తారు ఇప్పుడు ఆపద కడ్డుకుంటే. వెంకట్రామయ్యగారు అడుగుతారు అని తహతహపడ్డాడు సుందరం. ఈ దశమగ్రహాన్ని అడిగి లాభంలేదనుకున్నారు కాబోలు అడగలేదు.

చివరకు ఐదువేలకు కొన్న రెండెకరాల భూమి అమ్మకం పెట్టారు. తీరా అమ్మజూపితే మూడువేల ఐదువందలకంటె ఎక్కువకు ఏ అసామీ అడుగలేదు. రెండెకరాలు కొన్నానని మురిసిపోయిన వెంకట్రామయ్యగారి కిది గొడ్డలిపెట్టయింది. ఇంట్లో మాట్లాడితే విసుక్కుంటున్నారు. చివరకు నాలుగువేలయినా రాదా అని ఎదురుచూస్తున్నాడు. సరిగా తిండికూడ తినకుండా "తిరుగుతున్నారు. ఎక్కడికు ఎందుకు తిరుగుతున్నారో ఎవరికీ తెలియదు. వెంకట్రామయ్యగారికి కూడ తెలియదు ఒకొక్కసారి ఎక్కడికు వెడుతున్నారో. .

"ఇంటికి వెళ్ళాలి" అన్నాడు సుందరం శారదతో.

"ఇప్పుడింటి కేమిటి?" అని అడిగింది ఆశ్చర్యంగా.

"పనుంది మళ్ళీవస్తా" అని ఎవరికి చెప్పకుండానే వెళ్ళాడు. నాన్నతో చెప్పి బ్యాంకులో డబ్బుతీసి సాయంచేయాలి వెంకట్రామయ్యగారికి అనుకున్నాడు. కాని నాన్నతో చెబితే ఏమంటాడో. తన పేరనే ఉంది కాబట్టి తీసిచ్చింతర్వాత చెప్పితేనో, అసలు ఆ డబ్బు వెంకట్రామయ్యగారిదే కదూ. ఈ ఆపదలో అడ్డుకుంటే ఆయనకు ఎంత సాయం చేసినవాడవుతాడు. మళ్ళీ వెంటనే పంటలు వచ్చింతర్వాత ఇచ్చేస్తారు.

అల్లుడు చెప్పకుండా వెళ్ళాడని ఆశ్చర్యం కలగలేదు వెంకట్రామయ్యగారికి. అసలు ఆయన ఈ లోకంలో లేడు. చెప్పకుండా వెళ్ళిన అల్లుడు మర్నాడు వచ్చి తనతో మాట్లాడాలనే సరికి ఇంట్లో కెళ్ళారు.

సుందరానికి అడగకుండా ఇవ్వడం కొంచెం బెరుకుగానే ఉంది. "నిన్నెవ్వరు దానం చేయమన్నారు" అని అంటేనో కొంపతీసి వెంకట్రామయ్యగారు? అయినా అలాగని చేను నష్టానికమ్ముతుంటే చూస్తూ ఊరుకుంటాడా? ఎలాగయితేనేం ధైర్యం

తెచ్చుకుని అన్నాడు "అబ్బే ఏమీలేదండీ! మీరు డబ్బుకోసం తిరుగుతున్నారట కాదూ... నేను అనవసరంగా...... దండగకు అమ్మడమెందుకు...... నాకు తర్వాతే ఇద్దురు గాని" అంటూ నోట్లకట్టలు అందించాడు. వెంకట్రామయ్యగారు తన కళ్లను తామే నమ్మలేకపోయారు. సుందరాన్ని ఎన్నో ప్రశ్నలు వేద్దామనుకున్నారు. "మీ నాన్నకు తెలుసునా? తెలియకపోతే మళ్లీ చిక్కొస్తుంది" అని అందామనుకున్నారు. కాని ఊపిరి కూడ గట్టిగా తీయలేని స్థితిలో ఉన్న ఆయనింకెలా మాట్లాడగలడు? రెండు కళ్లనుండి రెండశ్రువులు జారబోయి కళ్లలోనే ఇంకిపోయి, అల్లుడికి ధన్యవాదాలు ఎలా చెప్పాలో తెలియక తికమకపడుతున్నాడు. సుందరాన్ని ఓసారి గట్టిగా కౌగిలించుకుందామనుకున్నాడు. కాని ఆయనసలు కదల్లేకపోయాడు. చేతిలో నోట్లకట్టలు ఉన్నవన్న సంగతికూడ మర్చిపోయాడు. "అలా స్టేషను వెళ్లివస్తా" అని సుందరం లేచాడు. వెంకట్రామయ్యగారు ఏం మాట్లాడకుండా ఓసారి ముఖమెత్తి చూచారు. సుందరం వెళ్లిపోయాడు. ఈవార్త భార్యతో చెబుగామనుకుని వెంకట్రామయ్యగారు లేవలేకపోయారు. నోట్లు ఎన్నో లెక్కపెట్టడం కూడ మర్చిపోయారు.

తర్వాత సుందరం అక్కడున్న నాలుగు రోజులూ వెంకట్రామయ్యగారు అల్లుడికి ముఖం చూపించడానికి సిగ్గుపడేవారు. అల్లుణ్ణి తనలో తనే ఎంతగానో ప్రశంసించుకున్నారు. కాని పైకి ఏమీ అనలేకపోయారు. ఆ అప్పు తీర్చేదాకా అల్లుణ్ణి గురించి ఏమీ మాట్లాడలేదు ఆయన

సుందరం ఈ సంగతి ఇంటిదగ్గర ఎలా చెప్పాలా అని నాలుగురోజులాలోచించాడు ఇంటికి వెళ్లిన తర్వాత. ఏమీ దారి దొరుకలేదు. అసలు చెప్పకుండా ఉండి వెంకట్రామయ్యగారిచ్చిన తర్వాత మళ్లీ బ్యాంకులో వేద్దామనుకున్నాడు.

సుందరం పనిచేసే కంపెనీయొక్క పారుగూరి బ్రాంచిమేనేజరు రెండు నెలలు సెలవు పెడితే సుందరాన్ని అందాకా అక్కడవేశారు. నాలుగురోజుల్లో వెళ్లాలి. జీతంకూడ ఎక్కువొస్తుంది. సుందరం అక్కడికెళ్లిన తర్వాత వెంకట్రామయ్యగారికి అప్పిచ్చినట్లు వ్రాద్దామనుకున్నాడు. కాని వచ్చిన వెంటనే ఏదో గలభా జరుగుతుంది. అంచేత ఇప్పుడు చెప్పేసి ఆచివాట్లు నాలుగూ తినేసి అక్కడికి పోయి మర్చిపోదామనుకున్నాడు. ఇది ఇంకోకందుకుకూడ మంచిది. వెంకట్రామయ్యగారు ఇస్తారని నమ్మకముంది గాని, ఒక వేళ ఏమీ ఇవ్వకపోయినా చెప్పినందువల్ల భయం లేదు. రేపు ప్రయాణమనగా తల్లితో చెప్పాడు. యశోదమ్మ ఒక్కసారి కొయ్యబారిపోయింది. "అదేమిట్రా? ఎప్పుడిచ్చావు? నాన్నతో చెప్పావా? నీదేనేమిటి పెత్తనం? మళ్లీ యిస్తాడనే! ఏమిటి ఇలా చేసే వేమిటిరా? అయినా అది బ్యాంకులో నీ పేరను వేయడమేమిటి?" యశోదమ్మ నెత్తీ నోరూ బాదుకుంది. "వాడికి ముందొచ్చే ముప్పూ వెనుకొచ్చే తప్పూ తెలియడంలేదు" అన్నాడు నాన్న. ఎవరెన్ని అన్నాపడ్డానికి సిద్ధంగా ముందే ఉన్నాడు కాబట్టి సుందరం అవన్నీ ఒకసారి దులిపేసుకున్నాడు. అయినా నాన్న అన్నమాటలు మెదుల్తూనే ఉన్నయ్ మనస్సులో.

సాయంకాలం సుందరం బయటికెళ్లాడు. అదేంట్రా అత్తవారిచ్చిన కట్నం తిరిగిచ్చేసే వేమిటి అన్నాడు సుబ్బన్న.

"అబ్బే! ఎవరన్నారు? అప్పిచ్చాను."

"ఆఁ! అదేలే. అప్పు అప్పే. దాని పనింకంతే. అత్తవారి వల్లో పడ్డావు?" అసలీ విషయం సుబ్బన్నకెలా తెలిసింది? రెండిళ్లు దాటాడో లేదో నారాయణ కూడ ఇలాగే అడిగాడు. సుందరానికి ఆశ్చర్యం ఎక్కువైంది. పూర్తిగా రెండుగంటలు కాలేదు ఇంటిదగ్గిర చెప్పి అప్పుడే వీధంతా అగ్గిలా పాకేసింది. లాభంలేదని సుందరం వెనక్కిపోయి మళ్ళీమర్నాడు ట్రయిను టయిమయ్యేవరకూ బయటికిరాలేదు. సరాసరి జట్కాలో స్టేషనుకు పోయాడు. ★

ఆమె చూపులు

(15-వ పేజీ తరువాయి)

రెంత"...అవి నాకక్కర్లేదు. "అనేశాను... యింకా ఆ పైవాక్యం "అవి మీరేవుంచుకోండి నే నీగడపతొక్కను" అనబోతున్నాను. కాని; ఆ కళ్లు ఏదో మంత్రంతో నానోటికి తాళం వేశాయ్.

వేటగాడు గురిపెట్టిన విల్లును చూస్తున్న లేడి ఆ కళ్ళలో స్పష్టంగా కనిపించింది. ఒకసారి అటు నిటు వూగి మూయబడిన కళ్లు తుఫానును గుర్తుచేశాయ్. మూసిన రెప్పలు అతి నెమ్మదిగా తెరవడంలో భక్తులమోకరింపు ప్రార్థనలు గుర్తుకొచ్చాయ్. అలాగే చూస్తున్నాను. చెవుల్లో ఆర్ద్రవాక్యాలు ప్రతిధ్వనించాయ్. మామగారు "ఆడపిల్ల తండ్రిని చూస్తే అందరికీ లోకువే.. మంచివాడు, బుద్ధిమంతుడు అనుకుంటే నువ్వుకూడా యింత కఠినంగా.. "ఏదో అంటున్నాడు. ఏముందీ...మామూలుపొరపే...మానాన్న చెప్పినట్లు యీయన నన్ను తన చెప్పుకింద పెట్టుకునేందుకే చూస్తున్నాడు. ఆయనతో వ్యవహారం యిలా కాదు.. చకచకా తలదువ్వుకుని బైటికి దొవతీశాను. ఆయన దారికడ్డం వస్తే ప్రక్కనుంచి తప్పించుకుని స్టేషన్కు నడిచాను.

* * *

మద్రాసులో వుద్యోగం చేస్తున్న యీ ఆరునెల్లనుంచీ పన్నెండు వుత్తరాలు వచ్చాయ్ మామగారి దగ్గర్నుంచి ఎంతో బాధతో, విచారంతో కృష్ణ మంచమెక్కిందని కూడా మొన్న వ్రాశాడు. తనంతట తాను ఆ కట్నం తెచ్చి నా పాదాలముందు పోస్తేనే తప్ప—నే వాళ్ళ ముఖం చూస్తానా? ఛా! ఇంత బతుకూ బతికి......

ఇవ్వాళ మళ్ళీ వుత్తరం. జబ్బు ఎక్కువయి రేపో మాపో నంటూందట. చనిపోయే ముందొక్కసారి నన్ను చూస్తే చాలునని గుటుగుటలాడుతూందట...ఇదొక ఎత్తు.. కాకపోతే యిప్పుడైనా కట్నం యిచ్చేస్తానని వ్రాయడేం?...చావనీయ్; పీడా వదులుతుంది. మా నాన్న చెప్పినట్లు ఆ మంత్రిగారి మేనగోడల్నయినా చేసుకోవచ్చు...ప్రమోషనైనా దొరుకుతుంది... లేక ఆ కురూపి కృష్ణతో......పెళ్ళాం అంటూ.. బీచికి ఎలా వెళ్ళగలను? ఛీ... వుత్తరం చించిపారేశాను.

ఫాన్ వేసి పడుకుంటే గోడమీది కేలెండర్ రెపరెపా కొట్టుకుంటూంది. ఇవ్వాళ ఎన్నో తారీఖూ?.. సినిమా తార ఎంతందంగా వుందీ! నసీమట...ఆమె కళ్లు.. ఇంతమందిని చూస్తున్నాను; ఇంతమంది తారల్ని చూస్తున్నాను; ఇన్ని ఫొటోలు చూస్తున్నాను...కాని ఆమె కళ్ళవంటి కళ్ళు కనిపించలేదు—నసీమ్ కళ్ళలో అందంవుంది. పుష్పవల్లి కళ్లు విశాలమైనవి. సులోచన కళ్ళలో చిలిపితనం వుంది. కాని - కృష్ణకళ్ళలో వలె వివిధ భావాలూ నాకే ఒకరి కంటిలోనూ కనిపించలేదు...కృష్ణ కళ్ళు—ప్చ్!!

నా కావిడంటే అభిమానంలేదు సరిగదా - అసహ్యం కూడాను. కాని, ఆకళ్లు మాత్రం నన్ను విడవడంలేదు. ఏ ఫొటో చూచినా, ఏ స్త్రీని చూచినా ఆ కళ్లు నన్ను వెటాడుతున్నట్లు ఫీలవుతున్నాను. ఇదేమీ వుపయోగకరంగా లేదు.. నాపట్టుదలో? కుటుంబగౌరవమో ??

* * *

నాలుగురోజులు శెలవుపెట్టి యింటికి వెళ్ళి అమ్మనూ, నాన్ననూ చూచి మళ్ళీ సంబంధం చూస్తానంటే సరేనని తిరిగొస్తూ తెనాలిలో మెయిలెక్కాను. సెకండ్ క్లాస్ అప్పర్ బెర్తు దొరికింది. ఫిల్మిండియా చూస్తూంటే రైలు కదిలింది. "అంగారే" ఎడ్వర్టయిజ్మెంటులో నర్గీస్ కళ్ళు మాత్రం - అటూయిటూ కత్తిరించి-వేశారు .. భయమూ, దైన్యమూ ఆకళ్ళలో గూడు కట్టుకున్నాయ్...ఆరోజున మామతో పోట్లాడేప్పుడున్న కృష్ణచూపులు గుర్తుకొచ్చాయ్...ఆమె కళ్ళను గురించే ఆలోచిస్తూ నిద్రోయాను.

సుళ్ళూరుపేటలో రైలాగే సరికి మసగ మసగ్గా తెల్లవారుతూంది. బెర్తుమీంచి దిగి దొడ్డికివెళ్ళివచ్చాక రైల్వేవారిఅద్దంలో చూచుకుంటూ తల దువ్వుకుంటున్నాను.

కుడివైపు బెర్తుమీద గల తెల్లని దుప్పటి యీ అద్దంలో స్పష్టంగా కనిపిస్తూంది. కుడి చెయ్యి తలమీద పెట్టుకునేసరికి మోచేయి క్రిందుగా రెండు గాజుల చేతులు కనిపించాయ్. ఆ చేతులు తమ అరచేతుల క్రింది కన్నుల్ని నులుమి తప్పుకున్నాయ్. ఉదయిస్తున్న సూర్యునికి స్వాగత మిస్తూ విచ్చుకుంటున్న పద్మంలాగా రెండు కళ్ళు విచ్చుకున్నాయ్. అవి అద్దంలోకే చూస్తున్నాయ్.

నిశ్చలంగా వున్న ఆ కళ్ళల్లో సూదిమొనలు ప్రతిబింబించా యనిపించింది. సూటిగా తీక్ష్ణంగా చూస్తున్న కనులలో ఎన్నో కోర్కె మార్కులు లేచి అణగిపోతూ ఆశ్చర్యార్థకాలకు స్థానం యిచ్చాయ్. ఆ ఆశ్చర్యార్థకాలను నృత్యం చేయించాయ్ చలించే రెప్పలు. ఆ కనులు అర్ధనిమీలితాలై రెప్పలను పైకి పంపడంలో స్వాగతార్థం స్ఫురించింది. కాని యిప్పుడా కనులమీద ఏదో మబ్బు ప్రాకుతూంది. కాగు.. అది కారు మేఘం...... అవిగో నీటి తుంపరలు...అదిగో వర్షధార.


"అయ్యో-పాపం!" ఆ కన్నీటిని నా చేత్తో తుడవకుండా వుండలేకపోయాను... ఇదేమిటి? ఇది అద్దంలో ప్రతిబింబం... అయితే నేం...ప్రతిబింబాన్ని తుడిచేసరికి ఆ కనులు స్వచ్ఛందంగా కనిపించాయ్. ఇప్పుడా కనులు శ్రుతిని సారించుకుంటున్న జంత్రవాయిద్యాలను గుర్తుచేస్తున్నాయ్. అదిగో రాగం సరిపోయింది గావల్ను—నృత్యం ప్రారంభమయింది. పసిపిల్లలు—కాదు గోపికలు.. విలాసనృత్యాలు చేస్తున్నారు. ఆ నృత్యంలో కలియకుండా వుండలేను.

వెనుదిరిగి ఆ దుప్పటిగల స్త్రీని చూచాను. దిండు మీదకు వాలుతున్న ఆ కళ్ళ తలను ఎడమచేత పట్టుకుని మెల్లగా వాల్చాను. ఆ కళ్ళు విశాలమై పసిపిల్లల నవ్వును గుర్తుచేశాయ్. ఇప్పుడా చూపులు నాకేదో అవాచ్యమైన కోరికలను కలిగించాయ్. ఆ కళ్ళే నాకు గిలిగింతలు పెట్టాయ్. నెమ్మదిగా నా కళ్లు ఆమె కళ్ల దగ్గరకు చేర్చాను. మా కళ్ళల్లోని ఛాయలు ఏకమై ఇంద్రధనస్సుల మయమయ్యాయ్.

"ముఖం కడుక్కున్నావా తల్లీ" అంటూ ఎవరో పెట్టెలోకి ఎక్కారు. స్పృహతో లేచి చూచాను. ఆమె కళ్లు తెరిచి తెరవనట్లుండి నన్ను చేతుల్లో బంధించి నట్లుంచినయ్. ఆయన మామగారే! "నువ్వానాయనా" అన్నారు.

* * *


హాస్పిటలుకు తీసుకు వెళదామని ఆ ప్రయాణం చేస్తున్న మామగార్ని కృష్ణతో నాయింటికి తీసుకొచ్చాను...పదిరోజుల్లో స్వస్థత చెందింది కృష్ణ...మళ్ళీ పెళ్లి ప్రయత్నాలు చేస్తున్న నా తల్లిదండ్రులకు నే వ్రాసిన వుత్తరం పిడుగులాపని చేసిందట ★



పండితుడు

★ శ్రీ కొనంభొట్ల కృష్ణమూర్తి

స్థానమందుకల
అందరు పండితుల
రప్పించె కొలువుకు
రాజాధిరాజు.
"పండితోత్తములార
పలుకుడు నిజముగ
పండితగుణము; మరి
పండితుం డెవ్వరో?"
రాజాధిరాజిటుల
రమ్యముగ నడుగగా
పండితు డొక్కండు
పలికె నీరీతి.
"వేదముల నాల్గింటి
వేడ్క చదివినవాడె
విజ్ఞుడనిపించుకొను
విశ్వమ్ములోన."
వేరొక్క పండితుడు
వెన్వెంటనే లేచి
ఖండించె దీనిని
ఖండితముగాను.
"భారత వేదంబు
భక్తితో పఠియింప
భుక్తి ముక్తియుగల్గు
భువిజనంబులకు.
సకలపురాణాల
సారమెరిగినవాడె
సత్యమగు విబుధుండు,
సర్వజ్ఞుడగును."
"పుక్కిటి పురాణాల
ప్రయోజనము లేదు
తర్కము శాస్త్రులకు
తలమానికంబు.
దాని నేర్వనివాడు
ధనమున్న పేదయే
తప్పదం" చనియెను
తర్కపండితుడు.
"చక్రవర్తీ వాని
వక్రబుద్ధిని చూడు
తర్కంబుచే వాని
తల చెదరిపోయె.
వ్యాకరణ శాస్త్రులు
వల్లెవేసినవాడె
నిక్కమగు పండితుం
డిది నమ్మవలయు"
పలువురీ విధముగా
పలికిరి కానదేలనో
ముసలి పండితుడొకడు
మాటాడ డేమియు.
అంత చక్రవర్తి
"ఆర్యా! మీయుద్దేశ్య
మేమొ తెల్పుడంచు"
వేడు కొనగాను.
ఆతడనియె "నాడు
అంత రంగమ్ములో
సందియము కలిగెనీ
సంగతిని గూర్చి.
నిజమగు పండితుడు
ఈజగంబున గలడె?
గ్రంథాలు చదువుటే
బుధ లక్షణంబ?
విశ్వ సృష్టికర్త
విపుల గ్రంథమ్ములో
ఎన్నవ వంతు మన
మెరిగి యున్నాము?
మిడి మిడి జ్ఞానాన
ముదముతో పొంగుచు
విర్రవీగుట వట్టి
వెర్రితన మౌను.
సర్వ విషయజ్ఞాన
సముపార్జన కెపుడును
పరితాప మందుటయె
పండితుల గుణము"




ఆ కళ్లుచూస్తేనే తెలుస్తుంది ఇవి ఎంత పిరికివో.

తెల్లజింకలు

తెల్ల జింకలు.

లేళ్లకు మాదిరిగా వీటికి పొడుగాటి కొమ్ములుండవుగాని మిగతా అన్ని విషయాల్లోను తెల్లజింకలు లేళ్లమోస్తరుగానే వుంటాయి. ఇవి ఎంత పిరికిజంతువులో చెప్పలేము. వీటికి తెలివి తేటలు కూడా శూన్యమే. హూష్ అని చిటికెవేస్సి బెదిరిస్తేచాలు, ముందు ఏమున్నదో కూడా చూసుకోకుండా దూసుకుని పారిపోతాయి. ఇల్లా భయపడి ఏ గోతులోనో పడటమో ఏ చెట్టుకో గుద్దుకోవటమో జరిగి ఇవి అనవసరంగా దెబ్బలుకూడా తింటాయి. వీటికళ్లు నిర్మలంగా, అమాయికంగా ఉంటాయి. ఎంత దూరానికైనా దృష్టి సారించగలవు. వీటికి వాసన పసికట్టే శక్తికూడా వున్నది. ఇవి గంటకి 49 మైళ్ల వేగంతో పరిగెత్తుతాయి.




మనదేశం పక్షుల్లోకల్లా ఇదే పెద్దది

సరస్సుకొంగ

సరస్సు కొంగ.

ఉత్తర భారతంలోను, మధ్య భారతం, గుజరాత్, పశ్చిమ అస్సాములలోను ఈకొంగ కనిపిస్తుంది. పెద్దపెద్ద సరస్సుల, నదుల ఒడ్డుల విహరిస్తూ ఉంటుంది. మన దేశపు కొంగల్లో ఇంత పెద్దది ఇంకోటి లేదు. ఆరడుగుల ఎత్తుంటుంది. సర్వసామాన్యంగా ఈకొంగలు జంటలు జంటలుగా సంచరిస్తాయి. ఆడ కొంగ, మగకొంగ ఒకసారి జత కూడాయంటే జీవితాంతం భార్యాభర్తలుగానే తిరుగుతాయి. ప్రేమ అద్భుతంగా ఉంటుంది. క్షణం విడిచివుండవు. ఒకటి ఏ కారణం వల్లనైనా చనిపోతే రెండోది అక్కడే రోజులు, నెలల తరబడి నిద్రా హారాలు మాని రోదన ధ్వనులు చేస్తూ తిరుగుతుంది. అలాగే చివరికి తనుకూడా చనిపోతుంది. ఇవి ఎక్కువ ఎత్తున ఎగరలేవు; కొంచెం కష్టపడితేగాని అసలు నేలనుండి లేవ లేవు కూడా. కాని ఎగిరితే మాత్రం బాణంలాగా దూసుకొని పోగలవు. ఆలు మగలు సంతోషంగా ఉన్నప్పుడు ఒకదాని చుట్టూ ఒకటి వలయాకారంగా నాట్యం చేయటం, మోకరించటం, రెక్కలల్లార్చటం వింతగా ఉంటుంది. జులై, డిసెంబరు నెలల మధ్య గుడ్లు పెడతాయి. గుడ్లను పొదిగే టప్పుడు మగకొంగ గూడు చుట్టూ కాపలా కాస్తుంది. రెమ్మలు కొమ్మలూ, గడ్డితో గూడు కట్టుకుంటాయి.



"నేను, నా అమ్మ"

కణుతులు


కణుతులు.

ఇవి భారతదేశ మంతటా — అటు హిమాలయాల్లో పదివేల అడుగుల ఎత్తైన అరణ్యాలనుండి కన్యాకుమారి అగ్రంవరకూ కనిపిస్తాయి. ఆసియా ఖండంలో కనిపించే లేళ్లన్నిటిలోకీ ఇదే పెద్దది. వేటగాళ్లకు ఈమృగాన్ని వేటాడటం ఎక్కువ ఇష్టం. ఇది సాధారణంగా వేసవికాలంలో పాతకొమ్ములను రాల్చి కొత్త కొమ్ములను పెంచుకొంటుంది. రెండు రోజులకొకసారి మాత్రమే నీళ్లు తాగుతుంది.

గూడకొంగ

ఈ కొంగకి ఉన్న తమాషా ఏమిటంటే ముక్కుకింద పొడుగ్గా తోలుసంచి వేళ్లాడుతూ వుంటుంది. పొట్టికాళ్లు, వేళ్లమధ్య బాతులకు మల్లే చర్మం ఉంటాయి. మన దేశంలో పశ్చిమ భాగంలో తప్ప అన్నిచోట్లా కనిపిస్తుంది. బర్మా, మలయా, ఆస్ట్రేలియా, అమెరికాలలో కూడా ఉంటుంది. సాధారణంగా చిన్న చిన్న గుంపులుగా తిరుగుతాయి ఈకొంగలు. నీళ్లలో ఈదుతూనో, నిశ్చలంగా తేలుతూనో, చేపలు పట్టుతూనో కాలం గడుపుతాయి. చేపలు పట్టడంలో వీటి నేర్పు అపారం. అర్ధచంద్రాకారంగా నీళ్లలో బారులుతీర్చి రెక్కలతో నీటిమీద తపతప బలంగా కొడతాయి. ఆవిధంగా చేపల్ని బెదరగొట్టి ఒడ్డుదాకా తరముకుని

(46-వ పేజీ చూడండి)



"నేను, నా పెళ్లాం"

గూడకొంగలు



(బొమ్మలు వాల్ట్ డిస్నీ ప్రొడక్షన్సు,
ఆర్. కె. ఓ. రేడియోవారి సౌజన్యంతో)

జరిగినకథ :

మాకు బ్రిస్టల్ నగరసమీపంలో ఒక హోటల్ ఉంది. ఒకరోజున మా హోటలుకు 'బిల్' అనే సముద్రపుదొంగ తనతోటి దొంగలనుండి తప్పించుకుని పారిపోయివచ్చాడు. అతడు మా హోటల్లో ఉన్నాడని మిగతా దొంగలకు తెలిసి, అతన్ని చంపేస్తామని బెదిరించారు. అతడు ఆ బెదిరింపుకే భయపడి చనిపోయాడు. ...అతని పెట్టెలోనే మాకు కాంచనద్వీప పటం దొరికింది. ఆపటాన్ని మా డాక్టరుగారికి, జమీందారుగారికి చూపాను... వెంటనే అక్కడి ధన నిక్షేపాలు సంపాదించే ఆశతో అక్కడికి ప్రయాణమయ్యాము. జమీందారుగారొక ఓడను సిద్ధం చేశారు. స్మాలెట్ అనే అతన్ని కెప్టెనుగాను, లాంగ్ జాన్ సిల్వర్ అనే వాణ్ణి వంటవాడుగాను కుదిర్చారు. సిల్వర్ అసలు సముద్రపు దొంగల్లో వాడే అయినందున, మిగతాకళాసులందరితో కలిసి మమ్మల్ని చంపడానికి పెద్దకుట్ర పన్నాడు. ఆకుట్ర నెదుర్కోటానికి మేము ఎదురు సన్నాహాలు చేసుకున్నాం. ఇంతలో కాంచనద్వీపం చేరాము. ... ద్వీపంలో నేను ఒంటరిగా తిరుగుతుండగా బెన్ గన్ అనే అడవిమనిషి కనిపించాడు. తన్ను తిరిగి ఇంగ్లండుకు ఓడలో తీసుకుపోయేట్లయితే గుప్తధనమంతా మీ కిచ్చేస్తానన్నాడు. నేను నామిత్రులతో ఈ విషయం మాట్లాడతానని వాగ్దానం చేశాను. ఈలోగా నా మిత్రులు అవసరమైన సామగ్రి అంతటితోను ఓడను వదిలి ద్వీపంలోవున్న మట్టికోటను ఆక్రమించుకున్నారు. అక్కడవాళ్ళని కలుసుకున్నాను.

20 సిల్వర్ రాయబారం.

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. చలికి ఒళ్లు కొయ్యబారి పోతున్నది; వేళ్లు కొంకర్లు పోతున్నవి. పొగమంచుకూడా ఇంకా దట్టంగా అలముకునే వున్నది.

గోడలోని కన్నాలలోంచి బయటికి తొంగి చూస్తున్న మమ్మల్ని చూసి కెప్టెన్ స్మాలెట్ లోపలికి పొమ్మని ఆజ్ఞాపించాడు. ఇందులో ఏదో మోసం వుందని అన్నాడు.

"ఎవ రక్కడ? అని సిల్వర్‌ను చూస్తూ గద్దించాడు కెప్టెన్.

"సంధిజెండా" అని కేక వేశాడు సిల్వర్.

కెప్టెన్ మళ్ళీ వెనక్కితిరిగి మాకేసి చూసి "డాక్టరుగారూ! మీరు ఉత్తరపువేపు గోడవద్ద నుంచోండి. జిమ్ తూర్పువేపు, గ్రే పడమటివేపు. మిగతావాళ్లు తుపాకులు దట్టించండి. జాగ్రత్త!" అని ఆజ్ఞాపించాడు.

"సంధిజెండాతో నీకేం పని?" అని ప్రశ్నించాడు సిల్వర్‌ను.

సిల్వర్ పక్కన నుంచున్న అనుచరుడు సమాధాన మిచ్చాడు:

"కెప్టెన్ సిల్వర్ మీతో సంధి చేసుకోవాలనుకుంటున్నాడు"

"కెప్టెన్ సిల్వరా? అత డెవరో ఎరగనే. ఎవడు వాడు?" అన్నాడు కెప్టెన్ కోపంగా. "కెప్టెనట కెప్టెన్! చేసింది చాలక వీడికి కెప్టెన్ పదవి కూడానా?" అని నెమ్మదిగా గొణుక్కున్నాడు.

సిల్వర్ సమాధాన మిచ్చాడు:

"నేనే నండి, లాంగ్‌జాన్ సిల్వర్‌ను. ఈ కుర్రాళ్లంతా కలిసి వద్దంటున్నా నన్ను కెప్టెన్‌ని చేశారండి. మీరు పారిపోయింతరవాత హిస్పానియోలాకు ఒక అధికారి అంటూ ఉండాలి గదండి. అందుకని—.మనం సంప్రదింపులు ప్రారంభించే ముందు మీరొక వాగ్దానం చెయ్యాలండి సార్. మమ్మల్ని ఇక్కణ్ణించి క్షేమంగా పోనివ్వాలండి. ఏమంటారు?"

అనువాదం: శ్రీ నండూరి రామమోహనరావు

"సిల్వర్! నీలాంటి విశ్వాస ఘాతకుడితో రాజీ సంప్రదింపులు చేసేటంత ఓర్పు లేదు నాకు. చెప్పేదేదో రెండుముక్కల్లో చెప్పెయ్. మేము మిమ్మల్నే మీ చెయ్యము. మీరుమాత్రం ఏదన్నా మోసం తల పెట్టా రంటే ఊరుకోము," అన్నాడు కెప్టెన్ స్మాలెట్.

"ఛచ్ఛా! మీలాంటి పెద్దమనుషులదగ్గిర అల్లాంటి పాడుపనులు చేస్తామటండీ. మీరు మా టిచ్చారు; అది చాలు నాకు," అంటూ సిల్వర్ ఆవరణ చుట్టూవున్న కంచెను లంఘించి లోనికి వచ్చాడు. అతని అనుచరుడు "వెళ్లవ"ద్దని ఆపబోయాడు కాని 'భయం లేదులే' అన్నట్టు సిల్వర్ వాణ్ణి వీపుమీద తట్టాడు. సిల్వర్ అంత ధైర్యంగా శత్రువులమైన మమ్మల్ని సమీపించటం నాకు అచ్చెరువు గొలిపిందనక తప్పదు.

సిల్వర్ మట్టికోటద్వారం సమీపించి చాల మర్యాదగా కెప్టెన్‌కు సెల్యూట్ చేశాడు.

"అక్కడేకూర్చో", అని ఆజ్ఞాపించాడు కెప్టెన్.

"బయట చాలా చలిగా వున్నదండి. లోపలికి వచ్చి కూర్చుంటాను," అన్నాడు సిల్వర్ నవ్వుతూ.

కెప్టెన్ ముఖం చిట్లించాడు: "సిల్వర్! నువ్వు సజావుగా ప్రవర్తించివుంటే మాకున్న సదుపాయా లన్నిటినీ నీతో పంచుకునే వాళ్లం. ఊహూ—నువ్వు కెప్టెన్ సిల్వర్‌వి గదూ — నీలాంటి గొప్పవాడికి సత్కారం చెయ్యగలమా మేము?"

"సరే పోనీండి, ఇక్కడే కూర్చుంటాను," అని సిల్వర్ అక్కడే ఇసకలో చతికిలపడ్డాడు. "చాలా బావుందండి ఇక్కడ. అదృష్టవంతులు మీరు— మాకంటే ముందే సంపాదించారు మట్టికోటని. ఓ— జిమ్ కూడా ఉన్నాడే. హలో జిమ్! కులాసాగా వున్నావా? డాక్టరుగారూ! నమస్కారా లండి. మీ అందర్నీ చూస్తుంటే సంతోషంగా ఉందండి. కులాసాగా ఒక కుటుంబంలో వాళ్లలాగా వున్నారు," అని సోదిగా మాట్లాడసాగాడు సిల్వర్.

"నువ్వు చెప్పదలచుకున్న దేదో త్వరగా చెప్పు," అని గద్దించాడు కెప్టెన్ స్మాలెట్.

"అరెరె. తొందరపడతా రేమిటండి స్మాలెట్ గారూ! కిందటి రోజు యుద్ధంలో మీరే గెల్చారని ఒప్పుకుంటాను. ఒప్పుకోక తప్పదుకనక ఒప్పుకుంటాను. ఎందుకంటే మావాళ్లకి కాస్త వణుకు పుట్టినట్టుంది. నాకూ్కడా వణుకు పుట్టిందేమో తెలియదు. ఏమైనా మీతో రాజీబేరాలు ఆడదామనే వచ్చాను. అసలు మారహస్యం మీరు కనిపెట్టారని నాకు తెలియలేదు గాని, ఏమాత్రం ముందు తెలిసినా, తస్సదియ్య, మిమ్మల్ని ఒక ఊపు ఊపేవాణ్ణి."

"ఇంతకీ ఏమిటీ?—" అన్నాడు కెప్టెన్.

"ఏమీ లేదు. ఫ్లింట్ డబ్బు మాకు్కావాలి. ఆకాశం విరిగిపడ్డా ఆ డబ్బును మేము కొట్టెయ్యదలుచు

కున్నాం. మీకు ప్రాణాలపై తీపివుంటే మాతో రాజీకి రండి. మీ దగ్గిరొక పటంవుంది కదూ?"

"ఉంటేఉండచ్చు. లేకపోతే లేకపోనూవచ్చు—"

"మీదగ్గిర ఆ పటం వుందన్న సంగతి నాకు తెలుసు. మా కాపటం ఇచ్చెయ్యండి. అదీ నేను కోరేది."

"సిల్వర్! నిన్ను గడ్డిపోచకింద పరిగణిస్తున్నాను. తరవాత నీయిష్టం," అంటూ కెప్టెన్ స్మాలెట్ తీరిగ్గా తన పొగాకుపైప్ నింపుకోసాగాడు.

కెప్టెన్ స్వరంలోని కఠినధోరణి గమనించి సిల్వర్ వెంటనే ఏమీ మాట్లాడలేకపోయాడు. తనుకూడా జేబులోంచి పైప్ తీసి పొగాకు నింపుకుని అంటించాడు. ఇద్దరూ తాపీగా పైప్‌లు కాలుస్తూ, ఒకళ్ల మొహాలు ఒకళ్లు చూసుకుంటూ, మధ్య మధ్య ముందుకు వంగి ఉమ్ములువేస్తూ గడిపారు. కొన్ని నిమిషాల తర్వాత సిల్వర్ ప్రారంభించాడు:

"స్మాలెట్ గారూ! మళ్ళీ చెబుతాను వినండి. పటం మాకు స్వాధీనం చెయ్యండి. మా కుర్రాళ్లను తుపాకులతో కొట్టడం మానెయ్యండి. డబ్బు మేమే తవ్వి ఎత్తుకుంటాము. అదంతా ఓడలోకి చేర్చిన తర్వాత, మిమ్మల్నికూడా ఓడలోకి ఎక్కించుకుంటాము. క్షేమంగా ఏదో దేశంలో దింపుతాము. అక్కణ్ణించి మీరు ఇంగ్లండుకు ఎల్లా చేరుకున్నా సరే. అసలు నేను మంచివాణ్ణి కనుక మిమ్మల్ని ఓడలో తీసుకుపోతా నంటున్నాను. మావాళ్లు అందుకు ఒప్పుకోక పోవచ్చు. అల్లాగైతే మీ రీ ద్వీపంలోనే ఉండిపోవలసి వస్తుంది. కాని ఒక సహాయం మాత్రం చేస్తాను. మాకు కనిపించిన మొదటిఓడను ఆపి వాళ్లతో మాట్లాడి మీకోసం దాన్ని ఇక్కడికి పంపించగలను. ఏమంటారు? నేను చెప్పేదాంట్లో జేసబబు ఏమన్నా వుందా? నామాటలు లోపలవాళ్లంతా వింటున్నారనుకుంటున్నాను. ఒకరితో చెబితే అందరితో చెప్పినట్లే. నేను చెప్పింది నచ్చినవాళ్ల నెవరైనా మాలోకి తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాను," అని గొంతు హెచ్చించి చెప్పాడు సిల్వర్.

కెప్టెన్ స్మాలెట్ లేచి నుంచుని పైప్‌లోని బూడిద దులుపుకున్నాడు.

"అంతేనా?" అని అడిగాడు.

"అంతే. ఇదే ఆఖరుమాట. ఒప్పుకోకపోయారా, తస్సదియ్య, ఈ మట్టికోటతో సహా మిమ్మల్నందర్నీ ధ్వంసం చేసిందాకా నిద్రపోను."

కెప్టెన్ సౌమ్యంగా ఇలా హెచ్చరించాడు:

"సరే. నేను చెప్పేది విను. మీరంతా ఒకళ్ల తర్వాత ఒకళ్లు చేతిలో ఆయుధ మేమీ లేకుండా ఇక్కడికి వచ్చినట్లయితే సంకెళ్లువేసి బంధించగలనని వాగ్దానం చేస్తున్నాను. ఓడలో అందర్నీ ఇంగ్లండు తీసుకుపోతాను. అక్కడ కోర్టులో విచారణ జరిపించి అందర్నీ ఉరితీయించినదాకా నిద్రపోననికూడా వాగ్దానం చేస్తున్నాను. ఈ పద్ధతి మీ కిష్టంలేకపోతే మీగతి నక్కలకీ కుక్కలకీ ఎరుక. మీరు ఎన్ని రోజులు వెదికినా డబ్బు పట్టుకోలేరు. మీలో ఒక్కడికీ ఓడ నడిపించటం తెలియదు. అసలు మీరు మాతో యుద్ధమే చెయ్యలేరు. గెలుపు మాదే. ఇక పో. ఈప్రాంతంలో మళ్ళీ నీ ముఖం కనిపించిందంటే నీ రెండు గుడ్లల్లోకీ రెండు గుండ్లు గురిచూసి వదులుతాను. ఏం బావుందా నే చెప్పింది? ఇవే నా ఆఖరి మంచిమాటలు. ఊఁ. లే. వెనక్కి తిరుగు. కుంటికాలు ఆడించుకుంటూ పరుగెత్తు."

కెప్టెన్ స్మాలెట్ యిచ్చిన ఈ ఉపన్యాసంతో సిల్వర్ అవతారం పూర్తిగా మారిపోయింది. మొహంలో కత్తివాటుకి నెత్తురుచుక్క లేదు. పైప్ బూడిద దులుపుకున్నాడు. లేవబోతూ, "కాస్త చెయ్యి అందివ్వండి," అన్నాడు.

"నేనా? నీకా? ఫో అవతలికి," అని కసిరాడు కెప్టెన్.

"ఏయ్ లోపలున్నవాళ్లూ! ఎవరన్నా వచ్చి నాకు చెయ్యి అందిస్తారా?" అని గర్జించాడు సిల్వర్. మే మెవ్వరం కదల్లేదు.

తనలో తను పరమబూతులు తిట్టుకుంటూ దొంగల నాయకుడు ఇసుకలో పాకుతూ కంచెవరకూ వెళ్లాడు. కంచె పుచ్చుకునిలేచి అక్కడ వదిలిపెట్టిన ఊతకర్రను తిరిగి పుచ్చుకున్నాడు. ఒక్క ఉదుటున అవతలికి లంఘించి మాకేసి తిరిగి,

"తస్సదియ్య! మిమ్మల్నందర్నీ ఊచకోత కోయిస్తా. నవ్వండి అల్లాగే నవ్వండి. రేపీ పాటికి మీలో ఒక్కణ్ణికూడా మిగలనివ్వను," అంటూ అకి

వేగంగా చెట్ల గుబురులోకి నడిచి తన అనుచరుడితో సహా మాయ మయ్యాడు.

21. రెండోరోజు యుద్ధం

సిల్వర్ పోకడను జాగ్రత్తగా గమనిస్తున్న కెప్టెన్ అతడు కనుచూపు దాటిపోగానే వెనక్కి తిరిగాడు. అతడు మొదట ఆజ్ఞాపించిన ప్రకారం మాలో ఎవ్వరం ఉండవలసిన చోట్ల లేము—ఒక్క అబ్రహాంగ్రే తప్ప. కెప్టెన్‌కు మామీద కోపం రావటం మొదటిసారిగా చూశాను.

"పొండి, ఎవరిచోట్లలో వాళ్లు ఉండండి. గ్రేగారూ! మీ ప్రవర్తన ఆశ్చర్యకరంగా ఉంది. లివ్‌సేగారూ! మీరు వైద్యులు. మీరుకూడా ఇల్లా క్రమశిక్షణ మర్చిపోతా రనుకోలేదు. అబ్రహాంగ్రే! నువ్వొక్కడివే నిజమైన కళాసీవి. నీ పేరు నా డైరీలో రాసుకుంటాను."

కెప్టెన్ వెనక్కి తిరగ్గానే మేము ఎవరిచోట్లకు వాళ్లం పోయి నుంచున్నాము. సిల్వర్ రాయబార సంప్రదింపులను వినే కుతూహలంలో మేము మాకు తెలియకుండానే వచ్చి కెప్టెన్ వెనక నిలబడ్డాం. మేము మాస్థానాల్లోకి మళ్ళీ పోయి నుంచోటం చూసి కెప్టెన్ సంతృప్తితో అన్నాడు:

"సిల్వర్ రాయబారం మీరు విన్నారు. ఇంక కాసేపట్లో మళ్లీ పోట్లాట ప్రారంభంకావచ్చును. వాళ్లకి సంఖ్యాబలం ఉన్నమాట నిజమే. కాని మనకి మట్టికోట రక్షణ వున్నది.

మనం గనక క్రమశిక్షణ చెడకుండా నిలబడి వుట్లయితే శత్రువులను దుమ్ము చెయ్యగలమని నాకు నమ్మకమున్నది"

తరవాత కెప్టెన్ నలుపక్కలా తిరుగుతూ మట్టికోటను పరీక్షించాడు. తూర్పు, పడమర వేపు గోడలకు రెండేసి కన్నాలు మాత్రమే ఉన్నాయి. దక్షిణపు గోడకు, ద్వారంగాక మరి రెండు కన్నాలున్నాయి. ఉత్తరపు గోడకు అయిదు కన్నాలున్నాయి. మా ఏడుగురికీ మొత్తం ఇరవై తుపాకులున్నాయి. ఇంటి మధ్యలో కర్రల బల్ల వున్నది. దానిమీద తుపాకులను పేర్చాము. ప్రతి గోడవద్దను కూడా అలాంటి బల్లలున్నాయి. వాటిమీద కూడా తుపాకులను, కత్తులను రెడీగా అమర్చాము.

"చలిమంట ఆర్పివెయ్యండి. సూర్యుడు బాగా పైకొచ్చాడు. మనకళ్లకి యీ పొగ అడ్డంకూడా ఎందుకూ?" అన్నాడు కెప్టెన్. నన్నుచూసి "జిమ్! నువ్వు ఏమీ తినలేదల్లే వుంది. నిన్నేటు తీసుకుపోయి నీవోటులోనే కూర్చుని తిను. జాగ్రత్త! తిండిలోపడి బయటికి చూడటం మరిచిపోయేవు. ఏక్షణానైనా చెట్లలోంచి తుపాకి గుండ్లు రావచ్చును. హంటర్! అందరికీ తలోక గ్లాసు బ్రాందీ అందించు," అని కెప్టెన్ ఆజ్ఞాపించాడు.

"డాక్టర్! మీరు ద్వారంవద్ద నిలబడండి. గోడచాటున మాత్రమే వుండండి గాని బయటికి కనిపించకండి. హంటర్! నువ్వు తూర్పున కాపలా కాయ్. జాయిస్ నువ్వు పడమటి గోడవద్ద. ట్రిలానీ గారూ! మాలోకల్లా మీరే తుపాకీ విద్యలో సమర్థులు. మీరూ, గ్రే ఉత్తరపు గోడను రక్షించండి. జాగ్రత్త! ఆ వేపున అయిదు కన్నాలున్నాయి. శత్రువులు ఆ గోడను సమీపించారంటే మనపని ఆఖరు. మనగోడలోనుండి మనచే రాలగొడతారు. జిమ్! నువ్వూ నేను తుపాకీల



"ఖాళీ తుపాకీలు నింపి మీకే అందిస్తూఉంటమే మన పని."

దణ్ణం పెట్టవలసినవాళ్లమే కాబట్టి ఖాళీ తుపాకీలు నింపి వీళ్లకి అందిస్తూ ఉంటమే మనపని."

కెప్టెన్ అపరిమితోత్సాహంతో ఇలా ఆజ్ఞలిస్తోంటే మాక్కూడా ఆ ఉత్సాహం వ్యాపించింది. ఓ మహాయుద్ధంలో పాల్గొంటున్నంత ఉత్సాహంతో నిలబడ్డాం.

ఒక గంట గడిచింది. ఎంతసేపటికీ శత్రువు దర్శనం కాకపోయేసరికి మాకు విసుగుపుట్టింది. ఆవలిస్తూ బయట చెట్లమీద పక్షులకేసి చూస్తూ ఎంతసేపు గడపగలం. ఇంతలో జాయిస్ అతి అమాయకంగా అడిగాడు:

"కెప్టెన్! ఎవడన్నా కనిపిస్తే పేల్చమంటారా?"

మాకా ప్రశ్నకు నవ్వు వచ్చింది. కెప్టెన్ నవ్వును పెదవులనుండి తొలగించుకుంటూ సమాధానమిచ్చాడు:

"పేల్చటానికే నీ చేతులో ఆ తుపాకీ. దాంతో ఫిడేలు వాయిద్దామనుకుంటున్నావా?"

"సరే నండి సార్," అన్నాడు జాయిస్ అంతే అమాయకంగా. జాయిస్ మాటతో మళ్లీ అందరికీ ఉత్సాహం వచ్చింది. కొన్ని సెకన్లు ఊపిరి బిగపట్టి నిరీక్షించాము. హఠాత్తుగా జాయిస్ తుపాకి పేల్చాడు. వెంటనే చెట్ల చాటునుండి టపటప తుపాకులు పేలి గోడలకు చాలగుండ్లు కొట్టుకున్నాయి. ఒక్కటీ లోపలికి రాలేదు. పొగ చెదరిపోగానే చూశాము; కాని చెట్లలో ఒక్కడుకూడా కనిపించలేదు. మళ్ళీ నిశ్శబ్దం ఆవరించుకుంది.

"ఒకణ్ణన్నా కొట్టావా?" అడిగాడు కెప్టెన్.

"లేదనుకుంటానండి," అన్నాడు జాయిస్.

"జిమ్! జాయిస్ కింకో తుపాకీ యిచ్చి ఖాళీ తుపాకి నింపు. డాక్టర్! మీవైపున ఎందరున్నారనుకుంటున్నారు?"

"ముగ్గురు. మూడుసార్లు మెరుపు కనిపించింది; మూడు తూటాలు ఈవైపు పడ్డాయి," అన్నారు డాక్టరుగారు.—

"ముగ్గురా? మీ వైపున ఎందరండి ట్రెలానీ గారూ?"

కాని ఉత్తరపు వైపున ఎందరు కేంద్రీకరింపబడిందీ అంత తేలిగ్గా లెక్కకట్టటానికి వీల్లేకపోయింది. జమీందారుగారి లెక్కప్రకారం ఏడుగురు; గ్రే లెక్కప్రకారం ఎనిమిదిమందో, తొమ్మిదిమందో. తూర్పు పడమరల ఒక్కొక్క శత్రువే ఉన్నట్లు తేలింది. కనుక ఎక్కువమంది ఉత్తరపు దిక్కున కేంద్రీకరింపబడ్డారనీ, ఆవైపునే యుద్ధం ముమ్మరంగా జరగవచ్చనీ భావించాము. ఆ దిక్కును జాగ్రత్తగా రక్షించాలనీ, తిరుగుబాటుదార్లు ఏ ఒక్కకన్నం స్వాధీనపరుచుకున్నా, లోపలి వాళ్లపని ఆఖరేనని కెప్టెన్ హెచ్చరించాడు.

ఇంతలో ఉత్తర దిశనున్న వృక్షసమూహం నుండి కొందరు తిరుగుబాటు దార్లు వెర్రికేకలు వేసుకుంటూ, చెంగు చెంగున ఎగురుతూ మట్టికోటకు అభిముఖంగా రాసాగారు. అదే సమయంలో డాక్టరుగారున్న దిశనుండి తుపాకి తూటాలు వచ్చి ఆయన చేతిలోని తుపాకిని తుత్తునియలు చేశాయి.

జమీందారుగారు, గ్రే మరల మరల తుపాకీలు కాల్చారు. ముగ్గురు దెబ్బతిని నేల కొరిగారు. పడినవారిలో ఒకడు లేచి తూల్తూ వెనక్కి పారిపోయాడు. మిగతా నలుగురు కంచెదాటి ఆవరణలో ప్రవేశించారు. చెట్ల చాటునుండి తుపాకులు పేలుస్తున్నవాళ్లు ఈ నలుగుర్నీ ఉత్సాహపరుస్తూ అరుస్తున్నారు.

తండేలు జాబ్ ఆండర్సన్ తలకాయ కనిపించింది. "పేల్చండిరా, వీళ్ల పని పట్టాలి," అని అరిచాడు. మరుక్షణంలో ఒకడు హంటర్ చేతులోనుండి తుపాకి లాక్కుని దాని మడమతో అతన్ని కొట్టాడు. ఇంకొకడు ఇంటిచుట్టూ పరిగెత్తి ద్వారం వద్దకువచ్చి కత్తితో డాక్టరుమీద కలబడ్డాడు.

మా పరిస్థితి క్షణంలో తారుమారైంది. ఒక నిమిషం కిందవరకూ మా స్వాధీనంలోవున్న మట్టికోటలోకి శత్రువులు ప్రవేశించి మమ్మల్నే తరుముతున్నారు.

"బయటికి పదండి. అవతలికి పోయి వాళ్లతో పోరాడండి. కత్తులు తీసుకోండి," అని కెప్టెన్ అరిచాడు.

కత్తుల కట్టనుండి ఒకటి లాగి పట్టుకున్నాను. అప్పుడే ఇంకొక రెవరో ఇంకో కత్తి లాగారు. లోపల

(38-వ పేజీ చూడండి)

పంతులుగారి పేరు

మా మేష్టారుగార్కి అంతా కలిసి 'వుల్లిపాయ'ని పేరు పెట్టారు. ఆ పేరెలావచ్చిందంటారేమో!——ఒకరోజు పంతులుగారు క్లాసుకు హడావిడిగా రావటంలో చాక్‌పీసు — డస్టరు మర్చిపోయివచ్చారు.


అప్పుడు గోపిని పిలిచి——"అరేయ్ గోపీ!...టీచర్సు రూంలో కుర్చీకోడుకి నా కోటు తగిలించి వుంటుంది. ఆ కోటు జేబులో చాక్‌పీసు- డస్టరువుంటాయ్... వాటిని త్వరగా"తిసుకురారా... అన్నారు - పంతులుగారు.

"అలాగేసార్!..." అంటూ పరుగెత్తాడు - గోపి.

మేష్టారుగారింటికి, మాబడికి మధ్యదోవలోనే బజారు. ఆయన ప్రతిరోజూ, సాయంత్రం ఇంటికెళ్లే ముందు - మరనటి రోజుకు కావల్సిన వెచ్చాలన్నికోటు జేబుల్లో నింపుకు మరీ వెళ్లేవారు.

ఆహామాంబాపతుల్లో పొరబాటున ఆరోజు, కోటు జేబులో - ఒక వుల్లిపాయ మిగిలివుంది. అది మన గోపికంటపడింది. ఇక వూరుకుంటాడా! - అసలే అల్లరివాడు. ఎప్పుడూ వసపిట్టలాగ వాగుతూనే వుంటాడు. అందులో 'నిక్‌నేమ్సు' పెట్టటంలో మా నేర్పరి - చదువులో బండైనా.

గోపి తిరిగివచ్చి "చాక్‌పీసూ - లేదు - డస్టరూ లేదు సార్!... కానీ!..." అని ఆపేశాడు.



"కాని ఏమిట్రా!...ఏముందేమిటి అందులో?"

"ఇదిగోండి!...ఈ 'వుల్లిపాయ' మటుకువుందండీ" అంటూ జేబులోంచి ఒక పెద్ద 'వుల్లిపాయ' తీసి టేబులుమీద పెట్టాడు.

అమాంతంగా పిల్లలంతా ఘొల్లుమన్నారు. క్లాసంతా ఇష్టమొచ్చినట్లు గుసగుసలు మొదలు పెట్టారు.

మేష్టారు నిర్ఘాంతపోయి వూరుకున్నారు. వూరోకక ఏంచేస్తారు? - క్లాసంతా అల్లరిమూకౌతే! ఆ పిరుడెలాగో గడిపేసి వెళ్లిపోయారు.

* * *

కొన్నాళ్లకు దీపావళి పండుగ వచ్చింది. పండుగ యింకా వారం రోజులు వుందనగానే టపాకాయల కొట్లన్ని పెట్టారు. ఇక పిల్లలంతా తలోరకం టపాకాయలు తెచ్చి బళ్ళో కాల్చటం మొదలుపెట్టారు.

పండగ రేపుకాకమాపనగా—— గోపి నాల్గు 'వుల్లిపాయ'లు (అదొకరకం టపాకాయ) తెచ్చి, మేష్టారు రాకముందే - నాల్గుకుర్చీ కోళ్ళక్రింద, నాలిగిటిని పెట్టివుంచాడు.

"అరేయ్! ఎవ్వరూ మాట్లాడకండ్రా...ఎవరిమటుకు వాళ్లు

(34-వ పేజీ చూడండి)

శ్రీ మరకాని నిరంజనరావు

మహాకవి గురజాడ

"దేశమును ప్రేమించుమన్నా మంచి యన్నది పెంచుమన్నా"

అనే గేయం మన తెనుగునాట పల్లె పల్లెనా వాడ వాడనా మారు మ్రోగుతోంది. విశ్వకవి టాగూర్ వ్రాసిన "జనగణ-మన అధినాయక జయ హే" "అనే జాతీయ గేయంకన్నా తేట తెనుగులో మన గురజాడ వ్రాసిన ఈ గేయం తెలుగు వెలుగుల్ని దేశం నాల్గు చెరగులా వెదజల్లింది. పైగేయంలో ఒక్కొక్క పాదం నిజముగా ఒక్కొక్క ముత్యం లాంటిది. అందుకే "మహాకవి గురజాడ మాకవి" అని చెప్పకొని ప్రతి తెలుగుబిడ్డా ఆనందంతో పొంగి పోతాడు.

ఆయన 1861 నవంబరు 30 న విశాఖ జిల్లా రాయవరంలో సామాన్య కుటుంబంలో జన్మించారు. విజయనగరంలో 1886 దాకా చదివి-బి.ఏ. పూర్తిచేశారు. చదువుకొనే రోజుల్లోనే ఇంగ్లీషు కవిత్వం అల్లి-పేపర్లకు పంపించేవారు. తాను చదివిన కాలేజీలోనే లెక్చరరుగా చేరారు. విద్యా బోధనలో సాటిలేని ప్రతిభనూ-నేర్పును చూపేవారు. కాలేజీలో ఉద్యోగం చేస్తున్నా-సంఘ గమనాన్ని వేయి కళ్ళతో గమనించేవారు. తల్లిదండ్రులు ఆడపిల్లల పెళ్ళి కట్నాలు ఇవ్వలేక నానా యాతనలు పడడం చూచి - సహించలేక పోయింది ఆయన జాలిగుండె. సంఘ పెద్దలకు బుద్ధి చెప్పాలని "కన్యాశుల్కం" వ్రాశారు. ఈనాటికి దానికి దీటైన నాటకాన్ని మరెవరూ వ్రాయలేదు.

ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో వెనుకంజ వేసి కునికిపాట్లుపడే ప్రజలకు మేల్కొలుపు పాడుటకే "దేశభక్తి" అనే గేయం వ్రాశారు. అంతచక్కని జాతీయగేయాన్ని-అన్ని కాలాలలో అన్ని దేశాలకు

శ్రీ ముద్దులగారి రామకృష్ణ

అందరు ప్రజలకీ దేశభక్తిని ప్రేరేపించే అల్లాంటి గేయాన్ని మరే దేశపుకవి వ్రాసినట్లుగ మనకు తెలియదు.

బాల్య వివాహాలు, మూఢాచారాలు, అంటరానితనం, కుల తత్వాలు, సానిమేళాలు మొదలగు దురాచారాలతో ఉన్న సమాజాన్ని సరిగ్గా అర్థంచేసికొని గురజాడ తమ రచనలతో మన సంఘాన్ని వెలుగుత్రోవల్లో నిలిపారు అప్పుడే "ముత్యాల సరాలు" "కన్యక" "పూర్ణమ్మ" వెలువడినయి. అవి చదువుతూవుంటే చదివేవారి గుండెలు ఝుల్లుమంటాయి. కన్నీళ్ళు బొటబొట కారుతాయి ఆయన మతంపేరిట పెద్దలు చేసేమోసాలను గొంతెత్తి చాటారు. ప్రాతకాలపు పిచ్చినమ్మకాలను తీవ్రంగా ఖండించారు. కవి అయినవాడు తన రచనల ద్వారా జాతిని ముందుకు నడిపించుకుపోవాలి. అందుకే అప్పరాయకవి అభ్యుదయరచన సాగించారు.

సమకాలిక విద్వాంసుల ఛాందసభాషావాదనకు ఎదురుతిరిగి-ప్రజల భాషలోనే పుస్తకాలు వ్రాయ మొదలుపెట్టారు గురజాడ. జనుల వాడుకభాషలో రచనలు సాగించాలని వారిపట్టుదల.

అప్పారాయకవి వ్రాసినవి కొద్ది అయినా ఆ కొద్ది పాటలు, కథలు "కన్యాశుల్కం"మున్నగు రచనల ద్వారా సంఘ సమస్యల నన్నిటిని తరచి తరచి చూశారు.

తేటతెనుగులో సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో ఉంటవి వారి రచనలు. వారి రచనల్లో ఏపదం పట్టుకొన్నా తెలుగుదనం ఉట్టి పడుతుంది. కొద్ది మాటల్లో గొప్ప భావాన్ని సూటిగా గుండెకు తగిలేటటు చేస్తారు.

జాతి పురోగమనంకోసమే అప్పరాయకవి "ప్రాతకొత్తల మేలు కలయిక," తో ఒక చక్కని సాహిత్యాన్ని సృష్టించారు.

"దేశమంటే మట్టిగాదోయ్
దేశమంటే మనుషులోయ్–
ఈసురోమని మనుషులుంటే
దేశ మేగతి బాగుపడునోయ్?"

అని తెలుగుజాతికి మేలుకొలుపులు పాడారు. దేశభక్తి గీతాలతో ఆయన దేశాన్ని ఉఱ్ఱూతలూగించారు.

నిజంగా ఆయన తెలుగు లోకానికి ఒక క్రొత్త ప్రొద్దుపొడుపు! వీరు 1915లో చనిపోయారు! ఆ మహాకవి భారతదేశపు ఉత్తమ కవులగు టాగూర్, ఇగ్బాల్ మొదలగు వారితో సరితూగవలసిన వారు. తెలుగు పొలిమేరలు దాటి సాహిత్యరంగంలో ప్రపంచపు అంచులదాకా తెలుగువారి ప్రతినిధిగా నిలబడగలిగింది గురజాడ ఒక్కడే. ఆ మహాకవిని తలచుకొని–

"దేశాభిమానం నాకు కలదని
వట్టి గొప్పలు చెప్పకోకోయ్!
పూని యేదైనాను ఒక మేల్
కూర్చి జనులకు చూపవోయ్!

అని ప్రతిన బూనుదాం. ★

పంతులుగారి పరాకు

(32-వ పేజీ తరువాయి)

గఫ్ - చీఫ్‌గావుండండి. పంతులుగారువచ్చి చూడకుండా కుర్చీలో కూర్చుంటారు. అప్పుడు నాల్గు, నాల్గు ఫిరంగుల్లా మ్రోగుతాయ్. ఇక మన పంతులుగారి పని చూచుకోండినాయనా..." అని పకపక నవ్వాడు గోపి.

"హ్హా...హ్హా...హ్హా...భలే!" అని అందరూ ఇరగబడి నవ్వారు - రాబోయే సంఘటనగూర్చి.

పంతులుగారు, ఆవాళ స్కూలుకు పదినిమిషాలు లేటుగా రావటంవల్ల, గబ - గబా క్లాసుకు వచ్చి - గభాలున కుర్చీలో చతికిల పడ్డారు.

"ధన్ ... ధన్...ధనా ... ధన్" అంటూ వొకదానివెంట మరొకటి ఫిరంగుల్లా మ్రోగాయ్. అమాంతంగాపంతులుగారు వులిక్కిపడ్డారు. వంటినిండా ముచ్చెమటలు పోసినాయ్. పిల్లలు ఆయనవంక చూసి నవ్వుతూంటే - ఆయనకు పట్టలేనంతకోపం వచ్చింది.

కాసేపటికి, పిల్లలంతా గుమిగూడారు. హెడ్ మేష్టారువచ్చి - నేరస్థుడు గోపిని శిక్షించటం అంతా జరిగిపోయింది...

మరుసటిరోజున పంతులుగారు నవ్వుతూ - "అరేయ్! నిన్నకోళ్ళ క్రిందపెట్టిన టపాకాయల పేరేంటిరా?" అని తెలీక అడిగారు.

అంతా ఏకగ్రీవంగా, కలిసి - "వుల్లిపాయ" అని బిగ్గరగా అరిచారు.

మేష్టారుమొఖం తిరిగి చిన్నబోయింది!!!

చూచారా! బాలలూ!! పంతులుగారి పరాకు (మతిమఱపు) ఆయన జీవితమంతా ఎలా వెంటాడుతుందో!!! ★

సవరణ

21-11-51 ఆంధ్ర వారపత్రికలో ప్రకటించబడిన శ్రీ సత్యదేవ్ ఫజిలు నెం. 19 ఆధారములలో అడ్డము—9. ఆడుది. నిలువు—14. కామములేనివాడు అని గమనించవలెను.

విచిత్ర సంభాషణ

(9-వ పేజీ తరువాయి)

ద్రావనొక్క చుక్క ధరణిబడియె
దానినుండిపుట్టె వేనవేల్ దోమలు
లేరు దోమబాధ లేనివారు."

పేను: అల్లా అయితే వామీదా ఒక పద్యం రాశారు వినండి.

"సూర్యకిరణములను జూడనివారును
వానచినుకుమేన బడనివారు
పేనుబాధచేత బెగడునొందనివారు
కానరారు ముజ్జగంబులందు."

దోమ: బలే! డోలుకంతవాడు లేడు వీరణాని కింతవాడు లేడన్నట్లు మనం ముగ్గరమూ ఒకళ్ళకు ఒకళ్లు తీసిపోయేవాళ్ళం కాదు. మనం ముగ్గరం స్నేహంగా ఉండి, ఈ మనుష్యుల్ని ముప్పతిప్పలూ పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించాలి.

నల్లి: అందుకు నేను సిద్ధమే.

పేను: నేనూనూ.

ఈమాటలు వినేటప్పటికి నాకు అరికాలిమంట నెత్తికెక్కిపోయింది. ఈ మూడూ కలిస్తే ఇంకేమైనా ఉందా? వీటి నెల్లాగైనా నాశనంచేసెయ్యాలనుకున్నాను. (ఆకోపంలో పది అంకెలు లెక్కపెట్టాలన్న విషయమే జ్ఞప్తికి రాలేదు సుమా!) వెంటనే మంచంమీదనుంచి కిందికి దూకి, దీపం పెద్దదిచేసి, పెద్ద కఱ్ఱ ఒకటి తీసుకుని, పంచె ఎగగట్టి, మీసం దువ్వి, మంచందగ్గిరికి వచ్చాను. (వీటిని చంపడానికి దుడ్డుకఱ్ఱ ఎందుకని కొందరు తెలివితక్కువవాళ్లు అనుమానం రావచ్చు. కాని, చిన్నపామునైనా పెద్ద కఱ్ఱతో కొట్టాలనే సూత్రం తెలిసిన మహాత్ములకి అందులో ఆశ్చర్యం ఏమీ ఉండదు.) తస్సాదియ్యా! అవి నా అసాధారణ పౌరుషాన్ని, అమానుష ప్రజ్ఞను చూసి, ఇంక అక్కడ క్షణం నిలుస్తే చంట్లు తీరతానని భయపడి కాబోలు ఏమూలలోనో నక్కాయి. కాని, అప్పుడే కనక అవి నా కంటపడ్డాయా హరి హర బ్రహ్మాదులు అడ్డువచ్చినా వాటిని బ్రతికించలేకపోదురు. అక్కడికీ నేను ఆరాత్రంతా మహాదీక్షతో నా గదినంతనీ ఆ ముగ్గురు శత్రువులకోసం వెతుకుతూనే ఉన్నాను. మన ఆంధ్రుల దురదృష్టంవల్ల అవి కనబడలేదు. ఏంచేస్తాం మరి? ★

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

(7-వ పేజీ తరువాయి)

కరువై పోయింది. నేను కూడా చెప్పరాని వ్యథ అనుభవించాను ఎడ్మండ్! నిజంచెప్తున్నాను. స్మరించుకోడానికి ఒక్క నాటి సుఖం కూడా కరువైన జీవితం నరకమే. ఒక్క ఆశకూడా మిగల లేదు. కాని ఇందువల్లనే అనుకుంటున్నాను ఎడ్మండ్! ఇంకా అంతా పూర్తిగా ముగిసిపోలేదనిపిస్తుంది. ఇంకా హృదయంలో వెలుగు మెరుపులు మిగిలి ఉన్నాయి. ఎడ్మండ్! నువ్వానాడు చేసినది మహోత్కృష్టమైనది. ఇదే నాజీవనసంధ్యలో ధృవ తారగా వెలుగుతుంది."

"మర్సిదా! ఇప్పుడిలా అంటున్నావు. కాని నేను దేనిని త్యాగంచేస్తున్నానో, అదెంతటిదో నువ్వు పూర్తిగా గ్రహిస్తే ఏమంటావు? కాని వద్దు. నువ్వు గ్రహించలేవు. ప్రాణ త్యాగం వల్ల నేనెంత పోగొట్టుకుంటున్నానో నువ్వు తెలుసుకోలేవు."

"ఎడ్మండ్! నేనింక చెప్పేది ఒక్కటే మాట!" అంది మర్సిదా. మాంట్ క్రిస్టో విషాదభరితమైన చిరునవ్వు నవ్వాడు. మర్సిదా ఇలా అంది: "ఎడ్మండ్! నిన్ను మళ్ళీ చూశాను. ఎప్పటి మాదిరిగానే నువ్వు మహాపురుషుడివేననీ, నీలో మార్పు రాలేదనీ గ్రహించాను. ఇక నేను వెడుతున్నాను ఎడ్మండ్. నీకు కృతజ్ఞురాలను."

మాంట్ క్రిస్టో జవాబివ్వలేదు. మర్సిదా మెల్లిగా లేచి వెళ్లి పోయింది. మాంట్ క్రిస్టో ఆమె వెళ్లినవైపే చూస్తున్నాడు.

78

శత్రుజాలని పగ వెంటాడగా, ముసురుకుని వచ్చిన యోచనా పరంపరనుంచి మాంట్ క్రిస్టో మేలుకొనేసరికి దూరాన ఒంటి గంట కొట్టిన ధ్వని వినవచ్చింది. "అయ్యో! ఎంత అవివేకిని! పగ తీర్చుకోవాలని ప్రతిజ్ఞ తీసుకున్న నా హృదయం గుండెలు చీల్చుకోలేదే!" అనుకున్నాడు.

మర్సిదా వెళ్లిపోగానే తనచుట్టూ అంధకారం అలుము కున్నట్లు అతనికి అనుభవమయింది. తనలో ఇలా యోచించనారం భించాడు: ఇంతకాలం కృషించి నిర్మించుకున్న ఈ ఆశాసౌధం ఇలా కూలిపోవలసిందేనా? ఇన్నేళ్లు అడుగడుగునా జాగ్రత్తగా పరిశీలించి నిర్మించిన ఇంత వ్యూహం ఒక్క వూపుతో, ఒక్క నిట్టూర్పుతో ధ్వంసం కావలసిందేనా? మృత్యువనగా ఏమిటి? విశ్రాంతి కొక్కపై మెట్టు! జీవించాలనే కోరిక నాలో ఉన్నదని కాదు. నేను తలపెట్టిన ఈ మహాకార్యం విఫలమైపోవలసిందేనా? పధ్నాలుగేళ్లు నిరాశలోనూ, పదేళ్లు ఆశలోనూ భగవద్విధిత కర్తవ్యంపట్ల నిర్మించు కున్న విశ్వాసం ఒక్కసారిగా తిరిగి నేను దుష్కర్మకు తలొగ్గవలసిందేనా? ఎందుకు? ఏనాడో చచ్చినదనుకున్న హృదయం నిజంగా చచ్చిపోలేదు, నిద్రాణస్థితిలో మాత్రమే ఉంది. అది తిరిగి మేల్కొని స్పందించినందువల్లనే కదా! ఒక వనిత కాతరస్వరం విని కనికరానికి లొంగిపోయాను. ఆమెవంటి ఉదాత్త ప్రకృతిగల వనిత కేవలం స్వార్థంకోసం నా చావుకి సమ్మతిస్తుందా? కాదు. ఆమె ఏదో చెయ్యదల్చుకుంది. ద్వంద్వ యుద్ధంలో తరుణానికివచ్చి యిద్దరిమధ్యనూ నిలిచి ప్రాణత్యాగం చెయ్యదలిచిందేమో! ఇప్పుడు మహాత్యాగమనిపించినది రేపు అవహేళన కావచ్చును. దీనికి బదులు నేను చావడమే మేలు.

మరునాడు సంభవించగల దుర్ఘటన గురించి పరిపరివిధాల ఆలోచించాడు. తానై తాను యువకుని పిస్తోలుకు గురై మరణించినా, అది ఆత్మహత్య అని ఆల్బర్ట్ కాని లోకం కాని గ్రహించదు. ద్వంద్వ యుద్ధంలో యువకుని చేతిలో మరణించాడని లోకం భావిస్తుంది. తనంతట తానే చావుకోరి ద్వంద్వయుద్ధానికి వచ్చినట్లు అందరికీ తెలియాలి. అందువల్ల తన చేతిపిస్తోలుతోనే తన కణతిపై పేల్చుకుని మరణించాలని మాంట్ క్రిస్టో నిశ్చయానికి వచ్చాడు.

పారిస్ నగరానికి వచ్చినప్పుడే వ్రాసి ఉంచిన తన వీలు నామా తీసి, అందులో ఆఖరున తన ఆత్మహత్యాయత్నవృత్తాంతాన్ని చేర్చి వ్రాశాడు. అప్పటికే తెల్లవారుతోంది. మాంట్ క్రిస్టో వ్రాత ముగించి దాచివచ్చేసరికి ప్రక్కగదిలో నిట్టూర్పు వినపడినట్లయింది. మెల్లిగా తలుపు ఒత్తిగించి చూశాడు. ఒక సోఫాలో అలసట చెంది నిద్రపోతున్న హైదీ కనపడింది. మాంట్ క్రిస్టో ఆమెను సమీపించాడు. ఆమెకు మెలకువ రాలేదు. "మర్సిదా తన కొక కొడుకున్నాడన్న మాట విస్మరించ లేదు. కాని నాకొక కూతురున్నదని నేను మాత్రం విస్మరించాను. పాపం! నాతో మాట్లాడాలని కబురుపంపింది. ఆమె నెవరికో ఒకరి కొప్పగించనిదే నేను చావకూడదు." అనుకున్నాడు. తిరిగి తనగదిలోకి వెళ్లి వీలునామా తీశాడు. వీలునామాలో ఇదివరకే తన ఆస్తినంతటినీ హైదీకి, సంక్రమింపచేస్తూ వ్రాశాడు. ఇప్పుడా క్రింద మరి కొన్ని వాక్యాలు చేర్చాడు. మారెల్ హైదీని వివాహంచేసుకోడం తన తుది కోరిక అని వ్రాశాడు. వ్రాత ముగియగానే అతని వెనుక ఎవరో నిలబడినట్లు అతనికి తట్టింది. వెనుతిరిగి చూశాడు: "హైదీ! నువ్వా? ఇది నువ్వు చదివావా?" అన్నాడు తెల్లబోతూ.

"ఇటువంటి వేళ అటువంటి వాక్యాలు మీరెందుకు వ్రాయవలసి వచ్చింది? నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతున్నారా?" అని అడిగింది హైదీ కలవరపాటుతో.

మాంట్ క్రిస్టో మృదువైన మాటలతో చెప్పాడు: "నేనొక ముఖ్యమైన ప్రయాణంమీద ఉన్నాను హైదీ. నాకే ప్రమాదం సంభవించినా నా కుమార్తె క్షేమంగా ఉండాలని జాగ్రత్త పడుతున్నాను. అంతే."

"మీకు చనిపోవాలని కోరిక కలిగిందా." అంది హైదీ.

"క్షేమంచి మెలెంచాలి హైదీ!"

"మీరు చనిపోయేపక్షంలో మీ సంపదని మరొకరికి వ్రాయండి. మీరు లేనప్పుడు నాకేదీ వద్దు." అంటూ ఆమె పత్రం అందుకుని ముక్కలు ముక్కలుగా చించివేసింది. మాంట్ క్రిస్టో చూస్తూ ఊరుకున్నాడు. తరవాత మెల్లిగా లేచి నిలబడి ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. రెండు చేతులనూ ఆమె చెంపలకు చేర్చి, ఆమె ముఖమెత్తి చూశాడు. ఆ అమాయికముఖం చూడగానే అతనికి సంశయం కలిగింది "నిజంగానే ఈమె నన్ను తన తండ్రిగా కాక మరొక దృష్టితో ప్రేమిస్తున్నదేమో! అప్పుడైనా నాకు చింత లేకపోయేది" అనుకున్నాడు తనలో. మెల్లిగా ఆమెను ఆమె గదిలో చేర్చి పరిచారకులకు ఒప్పగించాడు. తిరిగి తన గదిలోకివచ్చి, చింపివెయ్యబడిన వీలునామాను తిరిగి వ్రాశాడు. అది ముగించినంతలోనే మాక్సిమిలియన్ మారెల్, ఇమాన్యూల్ బగ్గీ దిగివచ్చారు. "వేళకాకముందే వచ్చామనుకుంటాను కౌంట్! కాని రాత్రి తెల్లవారే వరకూ నాకు కంటిపై కునుకు పట్టలేదంటే నమ్మండి. మిమ్మల్ని చూసేవరకూ నాకు మనసు మనసులో లేదు" అన్నాడు మారెల్.

"నీవంటి వ్యక్తి ఒకడు నాకోసం పరితపించేవాడున్నాడని తెలిస్తే నాకిప్పుడూరట కలుగుతోంది" అన్నాడు మాంట్ క్రిస్టో.

ఆలీని పిలిచి అతనికి తన చేతిలోవున్న పత్రాన్ని అందించాడు: "ఇది నా మరణశాసనం మారెల్" అన్నాడు. "నేను చనిపోయిన తరవాత దానిని ఆలీవద్ద తీసుకుని చదువు."

"మీరు చనిపోవడమా ?"

"దేనికైనా సిద్ధపడ్డం మేలుకదా మరెల్ !"

మారెల్ నిరుత్తరుడైనాడు. మాంట్ క్రిస్టో పిస్తోలు తీసి లోవరండాలోకి వెళ్లాడు. మారెల్ అతని ననుసరించాడు. అక్కడ కొన్ని గజాలదూరంలో ఇనుప చట్రం ఒకటుంది. "నేను పిస్తోలు కాల్చగా ఎప్పుడైనా చూశావా ?" అన్నాడు మాంట్ క్రిస్టో.

"లేదు."

"అయితే చూడు" అంటూ మాంట్ క్రిస్టో ఇనుపచట్రంపైన కళావరు ఆసు అంటించాడు. తరవాత దూరంగా నిలబడి పిస్తోలు తీసి గురిచూసినట్లయినా తడుముకోకుండా మూడుమార్లు పేల్చాడు. ఒక్కొక్కటిగా కళావరుచుక్కలోని మూడుఖండాలూ అంతర్ధానమైనాయి. మారెల్ ముఖం పాలిపోయింది "అబ్బ !" అన్నాడు. "ఎంతగురి !" "ఆల్బర్ట్‌ని పాపం చంపకండి కౌంట్ ! అతని కొక తల్లి ఉంది."

"అవును. నువ్వు చెప్పింది నిజం" అన్నాడు మాంట్ క్రిస్టో "నాకు తల్లి లేదు." ఈ మాటలతో మారెల్ కంపించిపోయాడు.

మాంట్ క్రిస్టో ఇలా అన్నాడు: "మారెల్ ! నన్నెవ్వరూ బతిమాలనవసరం లేదు. ఆల్బర్ట్ బ్రతుకుతాడు. క్షేమంగా తిరిగి తల్లిని చేరుకుంటాడు."

"అంటే ?"

"అంటే, ఆల్బర్ట్ రేపు నన్నే చంపుతాడు."

"ఒక్క రాత్రిలో మీలో ఇంత మార్పు ఎందుకు వచ్చింది?"

"రాత్రి ఒక దేవదూత కనపడింది. నేనింక జీవితం చాలించవలసిన సమయం వచ్చిందని బోధించింది. ఇంక వెడదాంరా. వేళ కావచ్చింది."

ముగ్గురూ కలిసి బగ్గీలో కూర్చున్నారు. సరిగ్గా ఎనిమిదిగంటలకు బగ్గీ మైదానం చేరింది. మారెల్ మైదానం కలయచూసి, "ఇంకా ఎవ్వరూ రాలేదే!" అన్నాడు. అదే సమయానికి దూరంగా చెట్లమధ్యనుంచి వస్తున్న బగ్గీఒకటి కనపడింది. మాంట్ క్రిస్టో బగ్గీ దిగాడు. "మారెల్ ! మాట" అన్నాడు. ఇమాన్యూల్ కూడా బగ్గీ దిగి అక్కడే నిలబడ్డాడు. మారెల్, మాంట్ క్రిస్టో కలిసి పదిఅడుగులు చెట్లమధ్య దారిలో నడిచారు. "మారెల్ ! నువ్వెవరినైనా ప్రేమించావా ?" అని అడిగాడు మాంట్ క్రిస్టో.

"నీ రహస్యాలు చెప్పమని నే నడగడం లేదు. అవునో లేదో చెప్పితే చాలు."

"నే నొక యువతిని ప్రేమిస్తున్నాను కౌంట్ !"

"ఈ ఆశకూడా భగ్నమైపోయిందన్నమాట" అని తనలో గొణుక్కున్నాడు మాంట్ క్రిస్టో. "పాపం! హైదీ" అనుకుని గాఢంగా నిట్టూర్చాడు.

"కౌంట్ ! మీ రెప్పటిమాదిరిగా లే రెందుచేత? మీ కీ అధైర్యమేమిటి ?"

"ఒకరిని ఒంటరిగా విడిచిపెట్టిపోతున్నందుకు విచారిస్తున్నందుకు అధైర్యపడుతున్నా ననుకుంటున్నావా మారెల్ ! నువ్వు సిపాయివి. నీ కింతకంటె బాగా తెలియాలి. ఈ జీవితంపైన నాకు వ్యామోహం ఉందనుకొన్నావా? ప్రపంచం ఒక నాటకరంగం. రంగభూమినుంచి గౌరవంగా విశుద్ధాంతఃకరణతో నిష్క్రమించాలి. మనం తీర్చవలసినవన్నీ తీర్చి, కర్తవ్యం నెరవేర్చి పరువుగా తప్పుకోవాలి."

రెండో బగ్గీ సమీపించి ఆగింది. బోశాంప్, ఛాతో-రీనా దిగారు. వెనువెంటనే మరొక బగ్గీ వచ్చింది. ఫ్రాంజ్, డిబ్రే దిగారు. "మీ రెట్లా వచ్చా రిక్కడికి?" అన్నాడు బోశాంప్.

"ఇవాళ చీకటితోనే ఆల్బర్ట్ మాకు కబురుపంపి ఇక్కడికి రమ్మన్నాడు."

"కాని ఇన్ని ఏర్పాట్లూ చేసి అతను రా డెందు కింకా?" అన్నాడు బోశాంప్. "ఇప్పటికే పది నిమిషాలు ఆలస్యమయింది. అదుగో వస్తున్నాడు. అదేమిటి. గుర్రంమీద స్వారిచేస్తూ వస్తున్నాడు? ద్వంద్వయుద్ధంకోసం వచ్చేవాడు ముందే అలసిపోకూడదని అతనికి బోధించినదంతా వ్యర్థమయిపోయిందే !"

ఆల్బర్ట్ అతివేగంగా వచ్చాడు. గుర్రం దిగి ఒగర్చుకుంటూ మిత్రుల్ని సమీపించాడు. "ఆలస్యమైనందుకు క్షమించండి" అన్నాడు మిత్రులతో. "ముందు నేను మాంట్ క్రిస్టోతో రెండుమాటలు చెప్పాలి."

అందరూ ఆశ్చర్యపడి చూశారు. మారెల్ మాంట్ క్రిస్టోని పిలిచాడు. మాంట్ క్రిస్టో సమీపించగానే ఆల్బర్ట్ మిత్రులందరినీ దగ్గరకు చేరబిలిచి, "నే నిప్పుడు చెప్పేది మీరందరూ జాగ్రత్తగా వినండి" అన్నాడు. మాంట్ క్రిస్టోవంక తిరిగి ఆల్బర్ట్ ఇలా అన్నాడు: "మీపట్ల పల్లెకారి ఫెర్నాండో చేసిన అపచారానికి మీరు చేసిన ప్రతీకారం న్యాయమైనదే నని అంగీకరిస్తూ మనిద్దరం పరస్పరం క్షమార్హులని అందరి సమక్షంలోనూ ప్రకటిస్తున్నాను. ఇంతకంటె తీవ్రప్రతీకారం తీసుకోనందుకు ఫెర్నాండో తరఫున ఆయన కుమారుడనైన నేను మీకు కృతజ్ఞత తెలుపుతున్నాను. ద్వంద్వయుద్ధంనుంచి విరమించుకుంటున్నాను."

ఈమాటలు విని అందరూ స్తంభితులై పోయారు. మాంట్ క్రిస్టో ఆకాశం వంక చూశాడు. అతని కన్నులలో మర్సిడా ప్రియరూపం తాండవమాడింది. ఆల్బర్ట్ అతని చేతులు రెండూ పట్టుకున్నాడు: "నేను మిమ్మల్ని క్షమార్పణ కోరుతున్నాను. కాని నావల్ల మానవ సహజమైన దోషం తప్ప మరేమీ లేదనుకుంటాను. మీరు మాత్రం అతీతమైన సహనశక్తి చూపారు. దుర్విధివల్ల మన మింక దూరమై పోతున్నప్పటికీ పరస్పరమైత్రిని మరచిపో నవసరం లేదు."

మాంట్ క్రిస్టో కన్నులు చెమ్మగిలినాయి. చేయెత్తి ఆల్బర్ట్ భుజం తట్టాడు.

"ఏమిటి? ఏం జరిగిందోయ్ ఇంతలో." అన్నాడు బోశాంప్. ఆల్బర్ట్ జవాబివ్వలేదు. ఇరవైనాలుగేళ్ళ అనుభవాలు స్మృతిపథాన ముసురుకురాగా మాంట్ క్రిస్టో విచలితుడైనాడు. హృదయభారంతో మెల్లిగా నడిచివెళ్లి బగ్గీ ఎక్కాడు. ప్రణయరహస్యాన్ని కుమారునికి తెలియపరిచి, అతని హృదయంలో పితృపూజ్యభావాన్ని నాశనంచేసిన మాతృమూర్తి అతనికి కళ్ళకు కట్టినట్లయింది. "భగవత్కార్యం నెరవేర్చడానికే జీవించి ఉన్నానన్న విశ్వాసం ఈనాటికి ధృవపడింది" అనుకున్నాడు తనలో.

79

బగ్గీ కదలిపోవడం ఆల్బర్ట్ గమనించాడు. అది దృష్టికి దూరం కాగానే అతని శిరస్సు వాలిపోయింది. ముఖమెత్తి మిత్రుల వంక చూడలేకపోయాడు. బోశాంప్ ఇలా అన్నాడు: "ఆల్బర్ట్! ఇది ఇల్లా జరగడం నిజంగా అదృష్టం సుమా! కాని నీది ఎంత ఉన్నత హృదయం? ఒక్క రాత్రిలో నీలో ఇంత మార్పెల వచ్చింది ?"

"మార్పె వచ్చింది బోశాంప్ ! అది నీకు తెలియదు."

"నిజమే. ఇది అర్థంకావడం కష్టం. కాని నా సలహా ఒ!

టుంది. దేశాంతరం వెళ్ళి కొంతకాలం గడిపి శాంతి చేకూర్చుకో. కొన్ని ఏళ్ళతర్వాత తిరిగి ఫ్రాన్సు రావచ్చును."

"అవును బోశాంప్! నేనది ముందే నిశ్చయించుకున్నాను."

మిత్రులందరూ నిష్క్రమించారు. ఆల్బర్ట్ కూడా ఇంటికి చేరుకున్నాడు. వీధిలో ఉండగానే అతనికి మేడపైన ఒక కిటికీలో తండ్రి ముఖం కనపడింది. నిట్టూర్పుతో ఆల్బర్ట్ తల వంచుకుని లోనికి వెళ్ళాడు. తిన్నగా తన గదికి వెళ్ళి సామానులన్నీ సర్దుకో నారంభించాడు. పరిచారకుడు వచ్చాడు: "ఏమి జరిగిందో మీ తండ్రిగా రడగమన్నారు" అన్నాడు.

"మాంటెక్రిస్టోవద్ద నేను క్షమార్పణ కోరివచ్చానని చెప్పు" అన్నాడు ఆల్బర్ట్.

కొంతసేపైన తరవాత వీధిలో బగ్గీ కదలిన చప్పుడు విన వచ్చింది. ఆల్బర్ట్ కిటికీలోనుంచి చూశాడు. తన తండ్రి బగ్గీ ఎక్కడం కనపడింది. కిటికీ మూసి ఆల్బర్ట్ తల్లివద్దకు బయలుదేరాడు. తల్లిగదిలోకి వెళ్ళేసరికి ఆమెకూడా తన సామాన్లు సర్దుకోడం గమనించాడు. ఇద్దరికీ ఒకే ఆలోచన తట్టింది. ఆల్బర్ట్‌కి దుఃఖం పొంగివచ్చింది. "అమ్మా! నీ దగ్గిర సెలవు తీసుకోడానికి వచ్చాను" అన్నాడు.

"నేనూ వెళ్ళిపోవాలనుకున్నాను నాయనా! నా కూడా నువ్వు వస్తావనుకున్నాను."

"కాని నా మాదిరిగా కష్టాలు దారిద్ర్యం నువ్వనుభవించ గలవా? అలా వీల్లేదు. నా కిప్పటికి కావలసిన ధనం ఋణ మివ్వమని ఫ్రాంజ్‌ని అడగా లనుకుంటున్నాను."

"నీకా దారిద్ర్యం? నువ్వు ఆకలిబాధ సహిస్తావా ఆల్బర్ట్! నే నది సహించగలనా?"

"అదేముందమ్మా? నేనింకా వయసులో ఉన్నాను. నేను దేనికీ భయపడను. నిన్నటినుంచీ నిగ్రహంకూడా నేర్చుకున్నాను. నే నీ క్షణంతో గతజీవితాన్ని మరిచిపోదల్చుకున్నాను. గతంతో నాకింక నిమిత్తం లేదు. నా తండ్రి పేరు, నా యింటి పేరు త్యజిస్తున్నాను."

మర్సిడా నిట్టూర్పు విడిచింది. "నే నేం చెప్పగలను ఆల్బర్ట్! స్వయంకృషివల్ల నే ఉన్నతికి రాగలవని ఆశతో ఉంటాను. నా కింక ముందు ఏ ఆశా లేదు. ఈ యింటిగుమ్మం దాటిన తరవాత నా కింక గోరీయే శరణ్యం."

"అమ్మా! నీ కొడుకు ననిపించుకోడానికి కృషిచేస్తాను. కాని ఇంక మనం జాప్యం చెయ్యవద్దు. ఇప్పుడే తండ్రిగారు ఎక్కడికో వెళ్ళారు. తిరిగి వచ్చేలోగానే మన మీ యిల్లు విడిచి పోవాలి.

"నేను సిద్ధమే ఆల్బర్ట్!" అంది మర్సిడా. ఆల్బర్ట్ వెళ్ళి చిన్న అద్దెబండి ఒకటి తెచ్చాడు. పారిస్‌లోనే మధ్యతరగతి కుటుంబాలు నివసించే ఒక పేటలో ఒక చిన్న ఇల్లు అద్దెకుందని ఆల్బర్ట్ తెలుసుకున్నాడు. తల్లిని అక్కడకు తీసుకువెళ్ళాలని ఆల్బర్ట్ సంకల్పించాడు. వీధిలో బండిపైన సామాను చేరవేస్తున్న సమయంలోనే మాంటెక్రిస్టో పరిచారకుడు వచ్చి ఒక లేఖ ఇచ్చాడు. లేఖ తీసుకుని తల్లివద్దకు వెళ్ళాడు. తల్లి ఆ లేఖ తీసుకుని ఇలా చదివింది. "ఆల్బర్ట్! నీ సంకల్పం నాకు తెలియకపోదు. కాని ఒక్కసారి ఆలోచించుకో— నీతల్లిస్థితిని గ్రహించు. నువ్వు యువకుడవు! సమరుడవు! ఎన్నికష్టాలైనా పడగలవు. దారిద్ర్యాన్ని చిరునవ్వుతో సహించగలవు. కాని నీతల్లి భరించగలదా? ఆమె నీస్థితినుంచి కాపాడ్డం నీధర్మం. ఇరవైనాలుగేళ్ళకిందట నాకొక ప్రియురాలుండేది. నావికుడుగా కష్టపడి ఆర్జించిన ధనం నూటయేభైబంగారు నాణేలు మూటకట్టి ఒకరోజున స్వదేశం తిరిగివచ్చాను. సముద్ర ప్రయాణాలలో ఏరోజు కే ముప్పు సంభవిస్తుందోననే ఆలోచనతో ఆ ధనాన్ని మార్సెల్స్‌నగరం లో మేలాన్ వీధిలో నాతండ్రి నివసించిన గృహంలో ఒక చెట్టుమొదట పాతిపెట్టాను. ఆయిల్లు నీతల్లికి బాగా గుర్తే. ఇటీవలనే అక్కడకు వెళ్ళి చెట్టు కింద తవ్వి చూశాను. ఆ ధనం ఇంకా అక్కడే ఉంది. ఆ ధనాన్ని నీ తల్లికియ్యి ఆల్బర్ట్! నేను లక్షలివ్వగలిగినా నీ తల్లి తీసుకోదు. కనీసం ఇదైనా తీసుకోమని చెప్పు. నీ కిది అవమానకరంగా తోచవచ్చును. కాని ఆకలితో అటమటించి ప్రాణాలు వీడిన తండ్రిని కాపాడలేకపోయిన వ్యక్తి ఇచ్చే ఈ సహాయాన్ని నిరాకరించడం ధర్మం కాదు."

ఆల్బర్ట్ ముఖం పాలిపోయింది. మర్సిడా కన్నులెత్తి భగవంతుని తలుచుకుంది. "నే నిది స్వీకరిస్తాను. కట్నమిచ్చే హక్కు అతని కుంది." అంది. తరవాత కుమారుని చెయ్యి అందుకుని వీధిలోకి నడిచి వెళ్ళిపోయింది.

సరిగ్గా ఇదే సమయంలో కౌంట్ మార్సెర్ఫ్ బగ్గీలో తిరిగి వచ్చాడు. తల్లీ కొడుకులను చూసి తటాలున ప్రక్క వరండాలోకి తప్పుకున్నాడు. బగ్గీవద్ద తల్లిని కొడు కూరడించడం అతనికి విన వచ్చింది. "అధైర్యపడకమ్మా! ఇంక ఇది మన యిల్లుకాదు" అంటున్నాడు ఆల్బర్ట్.

మార్సెర్ఫ్ ముఖంలో భీతి తాండవమాడుతోంది. గజగజ వణికిపోతున్నాడు. భార్యాబిడ్డల సంకల్పం గ్రహించాడు. కాని వారిని నివారించే ధైర్యం అతనికి లేకపోయింది.

మార్సెర్ఫ్ అప్పుడే మాంటెక్రిస్టో ఇంటివద్దనుంచి తిరిగి వచ్చాడు. ఆల్బర్ట్ సామాను సర్దుకుంటున్నప్పుడు బగ్గీలో బయలుదేరిన మార్సెర్ఫ్ తిన్నగా మాంటెక్రిస్టో ఇంటికే వెళ్ళాడు. పరిచారకుని పిలుపుతో నిమిత్తంలేకుండా గబగబ లోనికి చొరబడ్డాడు. మాంటెక్రిస్టో అతని వైఖరి గమనించాడు.

"ఇటువంటి వేళకాని వేళ నాపైన మీ కింత దయ ఎలా కలిగింది?" అన్నాడు మాంటెక్రిస్టో.

"ఉదయం ద్వంద్వయుద్ధం జరగలేదా?" అన్నాడు మార్సెర్ఫ్. నిగ్రహించరాని రోషంతో మార్సెర్ఫ్ కంపించిపోతున్నాడు.

"మీరే చూస్తున్నారుగా. అతను నన్ను చంపలేదు, అతను నాతో యుద్ధమే చెయ్యలేదు."

"ఎందువల్ల?"

"ఎందువల్ల? ఏమో! నాకంటె శిక్షార్హులు మరొకరున్నారని భావించాడు కాబోలు."

"మరొక రెవరు?"

"అతని తండ్రే"

"పరమ శత్రువుని చూసి చంపకుండా విడిచిపెట్టినవాడు పిరికిపంద! ఇక్కడుంటే వాడికామాట చెప్పఉండేవాడిని."

"మీ కుటుంబకలహాలు నాకు నివేదించుకోడానికే ఇక్కడికి వచ్చారా? ఆమాట ఆల్బర్ట్‌నే మీ రెందు కడగకూడదు?"

"ఓహో! అదెల్లా జరుగుతుంది? నే నందుకోసం రాలేదు" అన్నాడు మార్సెర్ఫ్ విషపూరితమైన వక్రహాసంతో. "నా పరమ శత్రువుని చూడాలనే వచ్చాను. యువకులు ద్వంద్వయుద్ధానికి జంకుతున్నారు. అందువల్ల మనమే అందుకు సిద్ధపడాలి. అంతేనా?"

"తప్పకుండా"

"అయితే ఇప్పుడే కత్తి తియ్యండి. మనకి సాక్షులుకూడా అవసరం లేదు."

"అవును, మీ రెవరో నాకు తెలుసు. నే నెవరో మీకు తెలుసు."

"కాదు. మీ రెవరో నాకు బొత్తిగా తెలియదు."

"ఎందుకు తెలియదు? వాటర్లూ యుద్ధంలో శత్రువులపక్షాన చేరి దేశద్రోహంచేసిన సిపాయి ఫెర్నాండో మీరే. స్పెయిన్‌లో ఫ్రెంచి సైన్యంపక్షాన గూఢచారిగా మాతృదేశానికి ద్రోహంచేసిన లెఫ్టినెంట్ ఫెర్నాండో మీరే. ఆలీపాషా ఉప్పు తిని అతన్ని శత్రువులకు అమ్మివేసి హత్యచేసిన కెప్టెన్ ఫెర్నాండో యెవరు? మీరేకదా! ఇన్నీ చేసి ధనం ఆర్జించి ఫ్రాన్సు చేరి కౌంట్ మార్సెర్ఫ్‌గా తల విసురుకుంటూ సంచరించేది మీరే కదా?"

"ఆ!" అన్నాడు మార్సెర్ఫ్. అతనికి కోపం రెచ్చిపోయింది. కన్ను లెర్రబడ్డాయి. కత్తి దూశాడు: "నాచరిత్ర చూపి నన్ను అవమానిస్తున్నావా? నన్ను గురించి నీ కంతా తెలుసునని నాకు తెలుసు. కాని నన్ను వెన్నంటి తిరిగే నువ్వెవరో నాకు తెలియదు. కోటీశ్వరుడివలె ధనంలో మునిగి తేలుతూ పారిస్‌లో కౌంట్ ఆఫ్ మాంట్‌క్రిస్టో అని పేరుపెట్టుకుని తిరుగుతున్నావు. ఇటలీలో సింద్‌బాద్ పేరుతో దోపిడిదొంగలతో చేరి తిరిగావు. కాని నాకు కావలసింది నీ నిజమైన పేరు. నీ పేరుచ్చరిస్తూ నీగుండెలు చీల్చాలి. చెప్పు నువ్వెవరు?"

ఈమారు మాంట్‌క్రిస్టోకి కూడా పట్టరాని కోపం వచ్చింది. ఒక్క ఉదుటున తన గదిలోకి వెళ్లి బీరువా తెరిచాడు. పైకోటు విప్పివేసి నావికుల దుస్తులు తీసి ధరించాడు. నావికుని టోపీ పెట్టుకుని సావడిలోకి వచ్చాడు. ఛాతీపై చేతులు కట్టుకుని నిలబడ్డాడు. "ఫెర్నాండో! నాకున్న అన్ని పేర్లలోనూ ఒక్క పేరు చెప్తే చాలు—నీ గర్వం అణిగిపోతుంది. కాని నువ్వే జ్ఞప్తికి తెచ్చుకో. నే నెవ్వరిని? జ్ఞాపకం లేదా?" అన్నాడు.

మార్సెర్ఫ్ అతన్ని చూసి నిశ్చేష్టుడైనాడు. చేతిలోని కత్తి జారి కిందపడింది. ఈమారతన్ని భీతి ఆవహించింది. ఆధారం కోసం తడుములాడుతూ తూలుతూ గోడదరి చేరాడు. "ఎడ్మండ్ డాంటే!" అని గొణిగాడు. తూలుతూ వెళ్లి బగ్గీలో కూలబడ్డాడు. ఇంటివద్ద బగ్గీదిగి లోనికి ప్రవేశించేటంతలో నే భార్యనూ కొడుకునీ చూసి మార్సెర్ఫ్ వరండాలోకి తప్పుకున్నాడు. కొడుకు మాటలు వినడంతో మార్సెర్ఫ్‌కి భీతికితోడు అవమానం భరించరానిదయింది. తన గదిలో దూరి తలుపులు మూసుకున్నాడు. కొంతసేపటికి గదిలోనుంచి రివాల్వరు పేల్చిన ధ్వని వినవచ్చింది. ఫెర్నాండో ఆత్మహత్య చేసుకున్నాడు. ★

కాంచనద్వీపం

(31-వ పేజీ తరువాయి)

తుపాకులపొగ దట్టంగా అలుముకున్నందున మనిషీ మనిషీ కనిపించడం లేదు. నేను బయటికి పరిగెత్తాను. న న్నెవరో వెంటాడుతున్నారు. ఎదురుగా డాక్టరుగారు కత్తి ఝుళిపిస్తూ, తనపైకి ఉరికిన శత్రువును తరుముతున్నారు. చివరి కాయన కొట్టిన దెబ్బకి వాడు మట్టికోట వెనక గల దిబ్బపైనుండి దొర్లుకుంటూ దొర్లుకుంటూ కిందకి పడిపోయాడు.

ఇంతలో నన్ను తండేలు జాబ్ ఆండర్సన్ ఎదుర్కొన్నాడు. నన్ను చూడగానే సింహనాదంచేసి, కత్తి పైకెత్తాడు. నేను తప్పించుకొనే ప్రయత్నంలో పక్కకి దూకి, కాలుజారి దిబ్బనుండి నరాసరి కిందకి దొర్లుకుంటూ పోయాను.

అదృష్టవశాత్తు ఆండర్సన్ నన్ను వెంబడించకుండా అబ్రహాం గ్రే అడ్డుపడి వాణ్ణి ఒక్క వేటులో వధించాడు. మరొక తిరుగుబాటుదారును తుపాకి పేల్చి చంపాడు. డాక్టరుగారు తన నెదుర్కొన్న శత్రువును పరలోకానికి సాగనంపారు.

ఇదంతా కొద్ది నిమిషాల్లో జరిగిపోయింది. చివరికి పొగ తేలిపోయినతర్వాత చూడగా విజయం మా పక్షాన్నే వరించినట్లు స్పష్టపడింది. కాని ఆ విజయం ఏ ఖరీదుకు లభించిందో గ్రహించగానే మా మనస్సులెంత బాధపడ్డాయో చెప్పలేను. నమ్మిన బంటు జాయిస్ చనిపోయాడు. హంటర్ తలమీద బలమైన గాయం తగిలి స్మృతి తప్పిపోయాడు. కెప్టెన్ కూడా అశక్తస్థితిలో జమీందారుగారి చేతుల్లో వాలిపోయి వున్నాడు.

"కెప్టెన్‌కు బాగా దెబ్బతగిలింది," అన్నారు ట్రెలానీగారు. ఇంతలో కెప్టెన్ స్మృతి కోలుకొని లేచి "వాళ్లంతా పారిపోయారా?" అని ఆదుర్దాగా అడిగాడు.

"ఆ. పారిపోగలిగినవాళ్లంతా పారిపోయారు. అయిదుగురు మాత్రం ఇక ఎప్పటికీ పారిపోలేరు," అన్నారు డాక్టరుగారు.

"అయిదుగుర్ని వధించామా? ఓ, చాలు ఇవ్వాళ్టికి అది ఫరవాలేదు. మొదట్లో వాళ్లు పందొమ్మిది మంది, మనం ఏడుగురం. ఇప్పుడు వాళ్లు తొమ్మిదిమంది మనం ఆరుగురం."

(ఇంకావుంది)

★ ఎగ్జిబిటర్ల కష్టాలు ★

చిన్న చిన్న బస్తీలలో సినిమా ఎగ్జిబిటర్లు పడే కష్టాలను గురించి బొంబాయి నుంచి వెలువడే ఒక సినీవారపత్రిక వ్యాస మొకటి ప్రచురించింది. ఈ వ్యాసంలో ఇచ్చిన వివరాలు చూస్తే మన దేశమంతటా గల ఎగ్జిబిటర్లు ఒకేవిధమైన ఇబ్బందులకు లోనవుతున్నట్టు కనిపిస్తుంది.

సినిమా పరిశ్రమతో సంబంధంగల వారందరిలోకీ తేరగా డబ్బు సంపాదిస్తూ బాగు పడుతున్నట్టు కనిపించేవాడు ఎగ్జిబిటరు. ఎందుచేతనంటే ఎగ్జిబిటరు సర్వస్వతంత్రుడల్లే కనిపిస్తాడు. ఉన్నంతలో మంచిపిక్చరుగా చూసి ఆడుతాడు. ఏ వారం "హోల్డోవర్" రాకపోతే ఆవారం పిక్చరు ఎత్తేసి ఇంకొకటి ఆడుతాడు. ప్రొడ్యూసర్లు దెబ్బ తినవచ్చు, పనికిమాలిన చిత్రాలకు అడ్వాన్సు పెట్టి డిస్ట్రిబ్యూటరు దెబ్బ తినవచ్చు గాని ఎగ్జిబిటరు కెప్పుడూ లాభమే అని అందరూ అనుకుంటారు.

కాని వాస్తవం చూసినట్టయితే ఎగ్జిబిటరు వ్యాపారం ఇంత సౌకర్యంగా సాగిపోయేది కాదనిపిస్తుంది. ఆంధ్రదేశంలో ఉన్న ఎగ్జిబిటర్లందరి అనుభవాలూ సేకరించటానికి ఏ సినిమాపత్రికైనా పూనుకున్నట్టయితే అతివిచిత్రమైన సంఘటనలు బయటపడతా యనటానికి సందేహం లేదు.

చాలామంది ఎగ్జిబిటర్లు స్థానికాధికారుల హింసకు గురి అవుతున్నట్టు కనిపిస్తుంది. ఈ స్థానికాధికారులకు ఫ్రీ టిక్కెట్లు మామూళ్ళుంటాయి. (ఇటువంటి కాంప్లిమెంటరీల మీద ఎగ్జిబిటరు తన జేబు నుంచి తీసి వినోదపు పన్నిచ్చుకోవాలట.) ఇంకా ఇతర "మామూళ్లు" ఏముంటాయో తెలియదు. ఎగ్జిబిటరుకు ఇవి ఇచ్చుకోక తప్పేది లేదు. అతగాడు కాస్త "పౌరుషం" కనబరిచాడో అమాంతంగా లైసెన్సు రద్దయిపోవచ్చు. రద్దయిపోయిన లైసెన్సును తిరిగి తెచ్చుకోవటానికి ఎగ్జిబిటర్లు చాలాపాట్లు పడవలసి ఉంటుంది.

డిస్ట్రిబ్యూటర్ల "అధికారం" కూడా ఎగ్జిబిటర్లపైన బలంగానే ఉంటుంది. నిజానికి మంచి థియేటరు మీద మంచి డిస్ట్రిబ్యూటరు ఎంత ఆధారపడిఉండాలో, మంచి డిస్ట్రిబ్యూటరుపై మంచి ఎగ్జిబిటరు అంతే ఆధారపడాలి. కాని ఆచరణలో ఇది ఈ విధంగా ఉండటంలేదు. ఎగ్జిబిటరు డిస్ట్రిబ్యూటరుకు లోకువే. పెద్ద నగరాల లోని థియేటర్లకు కాపీలు అదనులో పంపటం ఆత్మగౌరవంగా భావించే డిస్ట్రిబ్యూటర్లు కూడా చిల్లర స్టేషనుల ఎగ్జిబిటర్ల పట్ల



వాహినివారి "మల్లీశ్వరి"లో ఒక దృశ్యం.

